ఆదివారం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-7-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 175 పేజీలు: 10+4 వెల: 6.50


**డ్రోన్‌ద్వారా మిస్సైల్ ప్రయోగం విజయవంతం**

**రెండు దేశాల మధ్య రాజుకుంటున్న శివాలయ వివాదం** 5లో

# ఒబిసి హక్కుల పరిరక్షణకే

# కులగణన డిమాండ్



## తెలంగాణ కులగణన దేశానికే రోల్ మాడల్

### అప్పుడు తప్పు చేశా, ఇప్పుడు సరిదిద్దుకుంటున్నా: రాహుల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై25:** కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేయలేకపోయామని, అది ముమ్మాటికీ తన తప్పిదమేనని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ అన్నారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన భాగిదారి న్యాయ సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2004 నుంచి తాను రాజకీయాల్లో ఉన్నానని, ఒకసారి వెనక్కి తిరిగి చూసినప్పుడు తాను ఓతప్పు చేశానని అర్థమవుతోందని అన్నారు. ఒబిసిల హక్కులను రక్షించాల్సిన విధంగా రక్షించలేదని, అప్పట్లో ఒబిసిల సమస్యలను లోతుగా అర్థం చేసుకోలేకపోయానని పేర్కొన్నారు. ఒబిసి చరిత్ర, సమస్యలను కొంచెం ముందుగానే తెలుసుకుని ఉన్నట్లయితే అప్పట్లోనే కులగణన చేపట్టి ఉండేవాడిని. అది కాంగ్రెస్ పార్టీ తప్పుకాదు, ముమ్మాటికీ నాతప్పే. ఇప్పుడు ఆ తప్పును సరిచేసుకునే ప్రయత్నం చేస్తున్నాం అని రాహుల్ అన్నారు. తెలంగాణ కులగణన దేశానికే రోల్‌మోడల్ అని రాహుల్ గాంధీ అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేసే వరకూ విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. ఇది తన శపథమని అన్నారు. అవకాశాలు అందిపుచ్చుకునే సామర్థం అందరికీ రావాలని,తమ శక్తిని తాము తెలుసుకోకపోవడమే కొందరి సమస్యని చెప్పుకొచ్చారు.

దేశంలో దళితులచరిత్రను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అర్థంచేసుకున్నారని చెప్పారు. చరిత్రలో ఒబిసిలుఉన్నా, వారి గురించి ఎవరూ పట్టించుకోలేదని, ఒబిసిల చరిత్ర ఎక్కడుంది? ఎవరు రాశారు? అని రాహుల్ ప్రశ్నించారు. ఒబిసిల చరిత్ర రాయకపోవడంవెనుక ఆర్‌ఎస్‌ఎస్ కుట్రఉందనిఆరోపించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి ఉద్దేశపూర్వకంగా ఒబిసిల చరిత్రను తుడిచిపెట్టేశాయని ఆరోపించారు. ఒబిసిలు అన్ని రంగాల్లో వివక్ష ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఇండియాలో ఒబిసిలు ఎక్కడున్నారని రాహుల్ ప్రశ్నించారు. అదానీ ఒబిసినా, మీడియా రంగంలో ఒబిసిలకు స్థానం ఎక్కడుంది? అని ప్రశ్నించారు. అభివృద్ధిలో విద్యదే కీలకపాత్ర అని,ఇంగ్లీషు నేర్చుకుంటే >>2

## సోనియాజీ కలలకు కార్యరూపం

### సిఎం రేవంత్‌ను అభినందిస్తూ రాహుల్ గాంధీ ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై 25:** తెలంగాణలో సామాజిక ఆర్థిక కులసర్వే నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వంచేసిన అద్భుత కృషి ఎంతో గర్వంగా ఉందని, సోనియాజీ కన్న కలలు సాకారం చేసినట్లయిందని కాంగ్రెస్ అగ్రనేత,లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందిస్తూ శుక్రవారం ట్వీట్ చేసారు. ఈసర్వే ఇపుడు దేశవ్యాప్తంగా భవిష్యత్తులో నిర్వహించనున్న జనాభా >>2

## 'సుదీర్ఘ' పాలన ప్రధానుల్లో మోడీ టాప్



### 4780 రోజుల పాలన రికార్డు

**న్యూఢిల్లీ,జూలై 25:** దేశంలో వరుసగా ప్రధాని పదవి చేపట్టి ఎలాంటి విరామం లేకుండా సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న రెండో నేతగా ఆయన రికార్డు సృష్టించారు. 2014 మే 26వ తేదీన తొలి సారి ప్రధాని అయిన మోడీ, శుక్రవారంతో 4,708 రోజులు పూర్తి చేసుకున్నారు. ఒకవిధంగాచూస్తే దివంగత ఇందిరాగాంధీ 24.01.1966 నుంచి 24.3.1977 వరకు 4,077 రోజులు ప్రధానిగా ఉన్నారు. అయితే దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదట ఆ రికార్డు సాధించారు. వరసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీలకు విజయాన్ని అందించిన ఘనత నెహ్రూ, మోడీలకు దక్కుతుంది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దీర్ఘకాలం కొనసాగిన ఖ్యాతి మోడీకే చెందుతుంది. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రి అయిన మోడీ, 2014లో ప్రధాని అయ్యేవరకు ఆ పదవిలో కొనసాగుతూ వచ్చారు. అప్పటినుంచి ప్రధానిగా ఉన్నారు. స్వాతంత్ర్యం తర్వాత జన్మించి, దీర్ఘకాలం ప్రధానిగా ఉన్న కాంగ్రెసేతర పార్టీ తొలి నేత కూడా మోదీయే నిలిచారు. కేంద్రంలో రెండుసార్లు పూర్తి పదవీకాలాన్ని పూర్తిచేసుకున్న కాంగ్రెసేతర పార్టీ నేత కూడా మోడీనే. దేశంలో ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులందరిలో వరసగా ఆరు ఎన్నికల్లో ఒక పార్టీపక్ష నేతగా ఎన్నికైన ఏకైక నేత నరేంద్ర మోడీగా రికార్డు సృష్టించారు. 1950 సెప్టెంబరు 17న గుజరాత్‌లోని మెహ్సానా జిల్లాలోని వాద్‌నగర్‌లో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన మోడీ, రాజనీతి శాస్త్రంలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరి వాద్‌నగర్‌లో స్వయం సేవక్‌గా శాఖలకు వెళ్లేవారు. 1970లో అహ్మదాబాద్ చేరుకొని ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరిన అతికొద్ది కాలంలోనే కీలకమైన బాధ్యతలు చేపట్టారు. 1975లో గుజరాత్ లోక్ సంఘర్ష్ సమితికి >>2

## ఖరీఫ్‌కు యూరియా కొరత

### కాకినాడ, రామగుండం మూసివేత

### పంటల సాగుకు అవాంతరాలు

### 35 లక్షల ఎకరాల వరికి ముప్పు

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త :** స్థానికంగా తగినంత ఉత్పత్తి లేకపోవడం, దిగుమతులు తగ్గడం వల్ల ఏర్పడిన ఎరువుల కొరత, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణలోని రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా, పంపిణీ కేంద్రాలవద్ద గందరగోళ దృశ్యాలు చోటు చేసుకుంటున్నాయి. మరోపక్క బ్లాక్ మార్కెటింగ్ మరియు నిల్వ ఆరోపణలు తీవ్రమయ్యాయి. ధరలను పెంచడానికి వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సరఫరా గొలుసుఅంతరాయాలు, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడం వంటి కారణాలతో ఏర్పడిన ఈ సంక్షోభం, నల్గొండ, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ మరియు కామారెడ్డితో సహా జిల్లాలలో పొడవైన క్యూలు, ఉద్రిక్తతలు మరియు బ్లాక్ మార్కెటింగ్ ఆరోపణలకు దారితీసింది. ముఖ్యంగా కాకినాడలోని నేషనల్ ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ యూనిట్ మూసివేయడం, రాష్ట్రంలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ యూరియా ప్లాంట్ రెండు వారాల పాటు నిలుపుదల చేయటం వలన యూరియా దిగుమతుల్లో జాప్యం మరియు స్థానిక ఉత్పత్తి కుంటుపడటం వల్ల ఈ సమస్య మరింత జటిలమైంది. ఈ కొరత వల్ల తెలంగాణలో వరి 35 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 16 లక్షల ఎకరాలు వంటి కీలకమైన ఖరీఫ్ పంటల సాగుకు ముప్పు వాటిల్లుతోందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఖరీఫ్ పంటలకు సంబంధించి విత్తడంలో జాప్యం ఇలాగే కొనసాగితే దిగుబడి 10 నుండి 15 శాతం తగ్గే అవకాశం ఉందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.ఇది తెలంగాణలోని 53.51లక్షల హెక్టార్ల సాగు భూమిని ప్రభావితం చేస్తుంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, తెలంగాణలో యూరియా వినియోగం ఇటీవలి సంవత్సరాలలో బాగా పెరిగింది.

2024-25 రబీ (యాసంగి) సీజన్‌లో 21 శాతం పెరుగుదల, గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 12.4 శాతం పెరుగుదల నమోదైంది. ఎరువులు అధికంగా ఉపయోగించే పంటలైన వరి, పత్తిపై రాష్ట్రం అధికంగా ఆధారపడటం డిమాండ్ పెరగడానికి కీలకమైన కారణమని అంటున్నారు. రాష్ట్రం హెక్టారుకు 297 గ్రాముల ఎరువుల వినియోగంతో జాతీయంగా ఐదవ స్థానంలోఉంది, ఇదిప్రపంచసగటు 78.4 గ్రాముల కంటే చాలా ఎక్కువ. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు, తెలంగాణ డిమాండ్ 8.54 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, కేంద్రం కేవలం 6.81లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను మాత్రమే కేటా >>2

## ఆగస్టు 4 నుంచి లాసెట్ కౌన్సెలింగ్

### 4 నుంచి 14 వరకు రిజిస్ట్రేషన్

### 16, 17 తేదిల్లో వెబ్ ఆప్షన్లు

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 25:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో 3 సంవత్సరాల లా కోర్సుతోపాటు, 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ లా కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించిన లా సెట్-2025 కౌన్సెలింగ్‌ను ఆగస్టు 4 నుంచి ప్రారంభించనున్నారు. అలాగే పిజి లా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పిజి లాసెట్-2025 కౌన్సెలింగ్‌ను ఆగస్టు 25 నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లను నేడు(శనివారం) జారీ చేయనున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన అడ్మిషన్ల కమిటీ సమావేశం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి పాల్గొన్నారు. లాసెట్-2025కి సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల 26న విడుదల కానుంది. ఆగస్టు 4నుంచి 14 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇవ్వను >>2



## రేవంత్ నీ సిఎం పదవికి రాజీనామా చేసి బిసిలకు ఇస్తావా?

### ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సవాల్

**హైదరాబాద్, జూలై 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామి ఇచ్చిన వారిని మోసం చేయాలని చూస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖర్ రెడ్డి ముస్లింలకు బిసి-ఇ పేరుతో 4శాతం రిజర్వేషన్లు కల్పించారని, రిజర్వేషన్లు రాజ్యంగవిరుద్ధమని, ఇలాంటి రిజర్వేషన్లు చెల్లవని హైకోర్టు రెండుసార్లు తీర్పునిచ్చిందన్నారు. అయినా సుప్రీం కోర్టుకు వెళ్లి మరీ స్టే తెచ్చుకుని అమలు చేస్తున్నారు. ఇప్పుడు ముస్లింలకు 4 నుంచి 10 శాతానికి పెంచి బిసిలకు అన్యాయం జరిగేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తుందన్నారు.

కులగణన పేరుతో బిసి జనాభాను భారీగా తగ్గించే ప్రయత్నంచేసిందని, 56శాతం బిసిలని చెబుతూ.. వారిలో ముస్లింలను 10శాతం చూపించిందన్నారు. నిజమైన బిసిలు 46శాతం మాత్రమే ఉన్నారని చెబుతూ బిసిలను మోసంచేసే ప్రయత్నం చేస్తుందన్నారు. స్థానిక సంస్థల్లో ఇస్తామన్న 42 శాతం రిజర్వేషన్లు ఎవరికి లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకుంటుందో కాంగ్రెస్‌పార్టీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో చేతి వృత్తులపై ఆధారపడి పనిచేసే కులాలకు మాత్రమే రిజర్వేషన్లు అందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకొచ్చిన 10 శాతం ఇబిసి రిజర్వేషన్లలో కూడా ముస్లిం వర్గాలు కూడా లబ్ధి పొందే అవకాశం ఉందని, మళ్లీ బిసి రిజర్వేషన్లతో కలిపి ముస్లింలకు రాజ్యంగ విరుద్ధంగా 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.

గతంలో జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో 34 శాతం బిసి రిజర్వేషన్ల పేరిట కుట్ర పన్నిన విషయం తెలిసిందేనని, 150 మున్సిపల్ డివిజన్లు ఉంటే.. 50 సీట్లు బిసిలకు రిజర్వ్ చేశారని, ఆ 50 బిసి సీట్లలో బిసియేతరులైన మజ్లిస్ పార్టీకి చెందిన వారే గెలిచారని అన్నారు. ఇప్పుడు 42 శాతం బిసి రిజర్వేషన్ల పేరిట మళ్లీ ముస్లింలకే లబ్ధి చేకూర్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. బిసిలను ఏదో ఉద్ధరించామన్నట్టు ఢిల్లీలో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ భుజాలు చరుచుకుంటున్నారు. 42 శాతం బిసిలకు రిజర్వేషన్లు ఇస్తామని చెబుతున్నప్పటికీ అందులో 10 శాతం ముస్లింలకు పోగా.. గతంలో బిసిలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 32 శాతానికి తగ్గిస్తున్నారు. అసదుద్దీన్ ఒవైసీ పార్టీకి లబ్ధి చేకూర్చడమే తప్ప బిసిలకు ఒనగూరే ప్రయోజనమే లేదన్నారు. వేల కోట్లకు పడగలెత్తిన ఒవైసీ లాంటి వ్యక్తులతో మధ్యతరగతి బిసి పేద కులాల నాయకులు ఎన్నికల్లో పోటీపడి గెలిచే అవకాశం ఉందా? ఎన్నో ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ ఏనాడూ బిసి జనగణనకు సంబంధించి అంగీకరించలేదు. పార్లమెంటులో చర్చ చేయాలని అడిగినా బిసిలగోడు వినిపించుకున్న పాపాన పోలేదు. మీలా బిసిలకు అన్యాయం చేసేలా తూతూ మంత్రపు సర్వేలు చేయబోంఅన్నారు. మేంచేసే కులగణన రాజ్యంగ బద్ధం చేసి, భవిష్యత్తులో బిసిలకు న్యాయంచేస్తాం. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఒక్క బిసివ్యక్తిని కూడా సిఎంను చేయలేదు. ఒక్క బిసి వ్యక్తి కూడా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రధానిని చేసిన పాపాన పోలేదన్నారు. కేంద్ర మంత్రి వర్గంలో అనేక మంది బిసిలను బిజెపి నియమించింది. బిసి కమిషన్ కు రాజ్యాంగ హోదా ఇచ్చింది బిజెపియే అన్నారు. అత్యధికమంది ఎంపిలు బిసి, ఎస్సీ, ఎస్టీల నుంచే గెలిపించుకున్నామన్నారు. కన్వర్టెడ్ బిసి అంటూ ప్రధాని నరేంద్ర మోడీని రేవంత్ రెడ్డి హేళన చేస్తున్నారంటూ మండిపడ్డారు. మిడిమిడి జ్ఞానంతో ముఖ్యమంత్రి స్థానంలో ఉండి ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడుతున్నారు. 1972లో లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చారు. అంటే వారు కూడా కన్వర్టెడ్ ఎస్టీలా? 1994లో గుజరాత్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మండల్ కమి >>2

## బిసి రిజర్వేషన్ల వ్యతిరేకి బిజెపి

### - రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్



శుక్రవారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,జూలై 25,ప్రభాతవార్త:** బిజెపి రాజకీయస్వభావమే అగ్రవర్ణ పెత్తందారులకు తప్ప బలహీన వర్గాలకు న్యాయంచేయదని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.ఢిల్లీ తెలంగాణ భవన్‌లో మంత్రులు కొండా సురేఖ,వాకిటి శ్రీహరిలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ కిషన్‌రెడ్డి మాటలు ఐక్యంగా ముక్తకంఠంతో ఖండిస్తున్నామని అన్నారు.బిజెపి ఫ్యూడలిస్ట్ పార్టీ ఆనాడు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మండల కమిషన్ నీరుగార్చేందుకు కమండల్ తీసుకొచ్చారని ఆయన ఆరోపించారు. మీది రిజర్వేషన్లను వ్యతిరేకించిన పార్టీ సభ్యులు మీరు పెత్తందారులకు తప్ప బలహీనవర్గాలకు న్యాయంచేయాలనిలేదు అని నిందించారు. తెలంగాణకు బిజెపి బలహీన వర్గాల ముఖ్యమంత్రిని ప్రకటించారే కానీ కనీసం ప్రతిపక్ష నాయకుడని కూడా బిసికి ఇవ్వలేదని ఆరోపణలు చేశారు. బండి సంజయ్ బిసి పార్టీ అధ్యక్షుడిగాఉండగా ఆయనను ఆకస్మాత్తుగా తొలగించి కిషన్‌రెడ్డి అధ్యక్షులు అయ్యారని అన్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆనాడు నవ సంఘర్షణ సమితి మురళీధర్ రావు కమిషన్ మండల కమిషన్ వచ్చినాడు పోరాటాలు చేసి బలహీన వర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన రామచంద్రరావును తీసుకొచ్చి బిజెపి అధ్యక్షుడుని చేశారని తెలిపారు. ఆయన ఒక ఫ్యూడలిస్ట్ సిస్టమ్.

ఆయన బిసి 42 శాతం రిజర్వేషన్లు ఎలా వస్తాయి అంటారు దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామనిఅన్నారు. మీరు బిఆర్‌ఎస్‌తో కుమ్మక్కై గెలుస్తున్నారని అన్నారు. కిషన్ రెడ్డి బిజెపి ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిగా మా ముఖ్యమంత్రి చెప్పారు ప్రధానమంత్రి అపాయింట్మెంట్ తీసుకోమ్మని >>2



## హెచ్‌సిఎ పర్యవేక్షకునిగా జస్టిస్ నవీన్ రావు

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు విశ్రాంత జడ్జి జస్టిస్ నవీన్ రావును తెలంగాణ హైకోర్టు శుక్రవారం నాడు నియమించింది. హెచ్‌సిఎలో వెలుగు చూసిన కుంభకోణం నేపథ్యంలో అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి శ్రీనివాస రావు, సిఇఒ సునీల్‌తో పాటు గోల్‌మాల్‌లో పాలు పంచుకున్న శ్రీచక్ర క్రికెట్‌క్లబ్ అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి రాజేందర్ యాదవ్‌లను సిఐడి అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే.

హెచ్‌సిఎ చరిత్రలో కార్యవర్గంలో కీలకంగా వున్న వారంతా అరెస్టవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. బిసిసిఐ అందిన వందల కోట్ల రూపాయల నిధుల్లో భారీగా అక్రమాలు జరిగినట్లు సిఐడి విచారణలో తేలడం తెలిసిందే. దీంతో పాటు ఉప్పల్ స్టేడియంలో జరిగిన పనుల్లో నాణ్యత లోపాలు బయటపడడం విదితమే.

అంతకు ముందు విజి లెన్స్ ఎన్ ఫోర్స్‌మెంట్ కూడా హెచ్‌సిఎలో అక్ర మాలు జరిగాయని నిర్ధారించింది. ఈ నేపథ్యంలో హెచ్‌సిఎ రోజువారి కార్యకలాపాలకోసం తాత్కాలికంగా అంబుడ్స్‌మెన్‌ను సర్కారు నియమించగా పర్యవేక్షకుడుగా జస్టిస్ నవీన్ రావును హైకోర్టు >>2

## టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టండి

### గేమ్ ఛేంజర్‌గా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్

### తైవాన్ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం



శుక్రవారం తైవాన్ ప్రతినిధుల బృందంతో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జూలై 25 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలతో పోలిస్తే టెక్స్ టైల్ రంగం అభివృద్ధికి అపార అవకాశాలున్నాయని, ఇక్కడ పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని తైవాన్ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. శుక్రవారం సచివాలయంలో తైవాన్ టెక్స్‌టైల్ ఫెడరేషన్(టిటిఎఫ్) అధ్యక్షుడు జస్టిన్ వాంగ్ నేతృత్వంలో 11 >>2

## ప్రాజెక్టులకు జలకళ

### జూరాలకు 80వేల క్యూసెక్కుల వరద

### 12 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

### 202 టిఎంసిలకు చేరిన శ్రీశైలం డ్యాం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 25, ప్రభాతవార్త:** ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ఉమ్మడి పాలమూరులోని ప్రాజెక్టులకు జలకళను సంతరించుకున్నాయి. కర్ణాటకలోకి ఆల్మట్టి, నారాయపూర్ జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. నారాయణపూర్ జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం >>2



జూరాల నుంచి విడుదలవుతున్న వరద

## వంటగ్యాస్ రాయితీ బకాయిలు రూ.121కోట్లు

**హైదరాబాద్,జూలై 25,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం వంటగ్యాసు బకాయి కొండలా పేరుకుపోతుంది. రూ.121కోట్లు మేరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఏప్రిల్‌వరకు చెల్లించామని మేనెల నుంచి టోకెన్లు పెండింగ్‌లో ఉన్నాయని సివిల్ సప్లయ్ అధికారులు చెపుతుంటే క్షేత్రస్థాయిలో మహిళలు మాత్రం ఆరునెలలుగా వంటగ్యాసు రాయితీ రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఆరుగ్యారెంటీల అమలులో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 1.20 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. రేషన్ కార్డుల ఆధారంగా గ్యాస్ రాయితీకి 39.57 లక్షల మంది అర్హులుగా తేలారు. ఏడాదికి రాయితీ ఇవ్వాల్సిన సిలిండర్ల సంఖ్య రెండు కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మొత్తం సబ్సిడీకింద రూ.855.22కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని అంచనా కట్టి ఆ మేరకు నిధుల్ని రాష్ట్ర బడ్జెట్లో కేటాయించారు. ప్రతి నెలా దాదాపు రూ.80 కోట్లు జమ చేస్తుండగా వినియోగదారులకు వెంటవెంటనే రాయితీ పడేది. ప్రస్తుతం ఈనిధులు విడుదల కావడం లేదు. కొంత ఆలస్యమైనా >>2




న్యూఢిల్లీ పార్లమెంటు ఆవరణలో శుక్రవారం ఇండియా కూటమి ఎంపీల నిరసనలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

# నాగార్జున పరువునష్టం కేసు విచారణ 28కి వాయిదా

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** టాలీవుడ్ నటుడు నాగార్జున అక్కినేని దాఖలు చేసిన పరువు నష్టం కేసులో మంత్రి కొండా సురేఖ శుక్రవారం నాడు నాంపల్లి కోర్టుకు గైర్హాజర్ అయ్యారు. నాగచైతన్య, సమంత విడాకుల విషయంలో కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో దీనిపై ఆగ్రహించిన నాగార్జున మంత్రిపై పరువు నష్టం కేసు దాఖలు చేయడం తెలిసిందే. దీనిపై కోర్టులో కొనసాగుతుండడం విదితమే. ఈ కేసులో మంత్రి కొండా సురేఖ శుక్రవారం నాడు కోర్టులో హాజరు కావాల్సి ఉండగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో రాలేకపోయారు. దీనిపై ఆమె తరపున న్యాయవాది కోర్టుకు సమాచారం అందించారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేస్తూ ఆరోజున మంత్రి సురేఖ కచ్చితంగా హాజరుకావాలని ఆదేశించారు.

# విద్యుత్ అదనపు చార్జీలపై హైకోర్టు స్టే

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థ నుండి అదనపు చార్జీల బకాయి వసూళ్లకు సంబంధించి కేంద్రానికి తెలంగాణ హైకోర్టు ఝులక్ ఇచ్చింది. అదనపు చార్జీల బకాయిల సొమ్మును చెల్లించాలని కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సిఇఆర్సి) ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులకు సంబంధించిన అదనపు చార్జీల బకాయిలు 179 కోట్ల రూపాయలను చెల్లించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్), ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్)లకు కేంద్ర విద్యుత్తు నియంత్రణ కమిషన్ ఇచ్చిన నోటీసుపై ధర్మాసనం స్టే విధించింది. అయితే విద్యుత్తు సరఫరాలో తేడా వల్ల విధించే తాజాచార్జీలను చెల్లించాలని స్పష్టం చేసింది. విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులను సమన్వయంచేస్తూ గ్రిడ్ కు అదనపు విద్యుత్తు అందించినందుకు 179 కోట్ల రూపాయల మేర బకాయిలు చెల్లించాలని సిఇఆర్సి సుమోటో ఆదేశాలు ఇవ్వడాన్ని దక్షిణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు హైకోర్టులో సవాలు చేశాయి. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ పి శ్యాంకోశీతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. దీనిపై పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ, సెప్టెంబర్ 2024 నుంచి విద్యుత్ రెగ్యులేటరీ నిబంధనలు అమల్లోకి వచ్చాయని, అంతకుముందున్న బకాయిలు కూడా చెల్లించాలని నోటీసు ఇవ్వడం చట్టవిరుద్ధమేనని వాదించారు. ఇదేతరహా నోటీసుల అమలును నిలిపివేస్తూ ఇటీవల కేరళ, మద్రాసు హైకోర్టులు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చాయని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలు విన్న తదుపరి 179 కోట్ల రూపాయల మేర పాత బకాయిలు చెల్లింపులకు సంబంధించిన నోటీసు అమలును నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.

# ఖరీఫ్‌కు యూరియా కొరత

>> యించింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య, రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్ టన్నుల డిమాండ్ ఉండగా, కేవలం 3.07లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే లభించింది, ఫలితంగా 1.94-2 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఏర్పడింది. ఈ నెలకు 63 వేలటన్నుల డిమాండ్ ఉండగా, మరో 97 వేల టన్నుల దిగుమతి చేసుకున్న యూరియాను సరఫరా చేయాలని రాష్ట్ర సర్కార్ కేంద్రాన్ని అభ్యర్థించింది. కానీ 29 వేల టన్నులు మాత్రమే పంపిణీ చేయబడ్డాయి. దీనికి తగినట్లుగా దేశీయంగా ఉత్పత్తి చేయబడిన ఎరువుల రవాణా చేయడానికి రైల్వే రేక్ కేటాయింపులలో జాప్యం పరిస్థితిని మరింత దిగజార్చింది.

# ప్రాజెక్టులకు జలకళ

>> 33.133 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 30.479 టిఎంసిలు నమోదు కాగా, 492.25 మీటర్లకుగానూ ప్రస్తుతం 491.63 మీటర్లకు చేరుకోవడంతో 12గేట్ల ద్వారా దిగువకు నీటినివిడుదల చేస్తున్నారు. జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. జలాశయానికి 80,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో 4.708టిఎంసిల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 34,227క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 48,504క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆవిరిద్వారా బీమా లిఫ్ట్ -2కు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1250 క్యూసెక్కులు, కుడి కాలువకు 645 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుండి 85,391క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

**882అడుగులకు శ్రీశైలం**

శ్రీశైలం జలాశయానికి వరద పెరుగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాం జలకళను సంతరించుకున్నది. దీంతో ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 34,225క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 48504 క్యూసెక్కులు, సుంకేసుల నుండి 35,296 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 99,122క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. రెండు గేట్లు 10అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగాను 882.50అడుగులకు చేరగా, 215.8070టిఎంసిలకుగాను ప్రస్తుతం 202.0439 టిఎంసిలకు చేరింది. పవర్‌హౌజ్‌కు 66331 క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

# పార్లమెంట్ సమావేశాలకు సహకరిస్తాం

## స్పీకర్ అఖిలపక్ష సమావేశంలో విపక్ష ఎంపిలు ఓకే

**న్యూఢిల్లీ,జూలై 25:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాకు ప్రత్యేక నిశిత సవరణ (సర్) చేపట్టడం, పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, భారత్, పాకిస్తాన్‌మధ్య కాల్పులవిరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ప్రకటించడం వంటి అంశాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కుదిపేస్తున్నాయి. ఆయా అంశాలపైచర్చకు విపక్ష ఇండియా కూటమి ఎంపీలు పట్టుబడుతున్నాయి. వాయిదా తీర్మానాలపై చర్చించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో సభలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నారు. వారి ఆందోళనలతో గత నాలుగు రోజులుగా సభా కార్యకలాపాలు ముందుకు సాగడం లేదు. ఉభయసభలు ప్రారంభమైన నిమిషాల్లోనే వాయిదా పడుతున్నాయి. దీంతో సభలో నిరసనలకు బ్రేక్ వేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా శుక్రవారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో అర్థవంతమైన చర్చలు జరిపేందుకు సహకరించాలని ప్రతిపక్ష నాయకులను స్పీకర్ కోరినట్లు తెలిసింది. దీంతో సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని ప్రతిపక్ష ఎంపీలు చెప్పినట్లు సమాచారం. దీంతో సోమవారంనుంచి లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగనున్నాయని సమాచారం. జూలై 28నుంచి ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్‌లో చర్చ పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారతీయ సైనిక దళాలు పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే.

# దేశవ్యాప్త కులగణన

>> అవకాశాలు రెట్టింపు అవుతాయని అన్నారు. ఇంగ్లీషును వ్యతిరేకిస్తున్న వారు తమ పిల్లలను ఎక్కడ చదివిస్తున్నారని బిజెపి నేతలను ప్రశ్నించారు. ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు తీసుకురావాలని రాహుల్ డిమాండ్ చేశారు. దేశంలో ప్రతి ఒక్కరికీ కలలు సాకారం చేసుకొనే హక్కు ఉందని, రైతు కుమారుడు వ్యాపారవేత్త కావొచ్చని పేర్కొన్నారు. అవకాశాలు అందిపుచ్చుకొనే సామర్థం అందరికీ రావాలన్నారు. తమ శక్తిని తెలుసుకోలేకపోవడమే కొందరి సమస్యగా చెప్పుకొచ్చారు. సమస్యలు సరిగా అర్థం చేసుకుంటేనే పరిష్కారం సాధించగలమని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో తెలంగాణలో పకడ్బందీగా కులగణన చేపట్టారని పేర్కొన్నారు.ప్రాంతీయ భాషలు ముఖ్యమే, అలాగే ఇంగ్లీషు కూడా కీలకమైన అని రాహుల్ అన్నారు. ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ప్రధాని మోదీని కొన్ని సార్లు కలిశానని, ఆయనలో అంతగా విషయం లేదని అంతా షోనేనని వ్యాఖ్యానించారు. ప్రధానిపై భారీగా హైప్ పెంచింది మీడియానేనని, ఆయనలో పెద్దగా విషయం లేదనే విషయం తనకు అప్పుడే అర్థమైందన్నారు. "ఇంతకుముందు ఎప్పుడు నేను ఆయనను కలవలేదు, కానీ ఈ మధ్యలో ఆయనను 23సార్లు కలిశాను. అప్పుడే నాకు అర్థమైంది. ఆయనలో విషయం లేదు. అంతా షో మాత్రమే. మోదీకి చాలా మంది ప్రాముఖ్యం ఇస్తారు. మీడియా ఆయనకు ఎక్కువ ప్రచారం ఇచ్చి హైప్ తెచ్చింది." అని రాహుల్ అన్నారు. భారతదేశ ఉత్పాదకశక్తికి ప్రతీకలు ఒబిసిలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశంలో ఓబీసీల చరిత్ర ఎక్కడుందని, ఎవరు రాశారని ప్రశ్నించారు. ఒబిసిల చరిత్ర రాయకపోవడం వెనుక ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర ఉందని తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఒబిసిలు అన్నిరంగాల్లో వివక్ష ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# సోనియాజీ కలలకు కార్యరూపం

>> గణన, కులసర్వే కసరత్తులకు మార్గనిర్దేశం చేస్తునందనే తాను విశ్వసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్వేతోనే తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో 42శాతం ఒబిసి రిజర్వేషన్లు సిఫారసు చేసి చరిత్రాత్మక అడుగు ముందుకు వేసిందన్నారు. ఈ బిల్లు ఇపుడు రాష్ట్రపతి ఆమోదం పొందడం కోసం వేచి ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశవ్యాప్త నమూనాగా నిలిచిందని, 21వ శతాబ్దపు డేటా ఆధారంగా రూపొందించిన ఈ సర్వే సామాజిక న్యాయంలో 2.0 అని భారత్ ఎలా ముందుకు సాగుతున్నదీ నిర్వచించిందని అన్నారు. తెలంగాణ ప్రజలు, భాష, సంస్కృతితో ముడిపడిన మా భావోద్వేగ సంబంధాన్ని ఈ సర్వేతో మరింత సుస్థిరంచేసినట్లయిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేసేందుకు సోనియాజీ నిర్వహించిన పోరాటం, రాష్ట్ర ప్రజలతో కాంగ్రెస్ బంధాన్ని సుస్థిరం చేసిందని భావోద్వేకంగా పోస్ట్ చేశారు. సామాజిక-ఆర్థిక కుల సర్వేను నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అద్భుతమైన ప్రయత్నాలను చూసినప్పుడు నేను అపారమైన గర్వంతో నిండిపోయానని, నిజాయతీగల, సమ్మిళితమైన, సంప్రదింపుల ప్రక్రియ పట్ల తెలంగాణ ప్రజల నిబద్ధత ఒక ప్రమాణాన్ని నిర్దేశించిందని పేర్కొన్నారు.

# టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టండి

>> మంది ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. స్వల్ప కాలంలోనే టెక్స్ టైల్ రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ధీటుగా ఎదిగింది. రాష్ట్ర పారిశ్రామిక జిఎస్‌విఎ 2024-25లో రూ.2.77 లక్షల కోట్లుగా ఉందని, ఇందులో టెక్స్‌టైల్ రంగం కీలక పాత్ర పోషించిందన్నారు. దేశంలోనే అత్యంత నాణ్యమైన పత్తి ఇక్కడే పండుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేసిన కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్(కేఎంటిపి) గేమ్ ఛేంజర్‌గా మారిందన్నారు. ప్రపంచ పటంలో తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. కెఎంటిపిలో జిన్నింగ్, స్పిన్నింగ్, వీవింగ్, ప్రాసెసింగ్, గార్మెంటింగ్ అన్నీ ఒకే చోట పూర్తి చేసేలా అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశామని వివరించారు. టెక్స్‌టైల్ దిగ్గజ కంపెనీలు యంగాన్, కైటెక్స్, గణేషా ఎకోస్పియర్ ఇప్పటికే పెట్టుబడులు పెట్టాయని, రవాణా సౌకర్యాలపరంగా కూడా ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందని వివరించారు. హైదరాబాద్ - నాగ్ పూర్ - విజయవాడ ఇండస్ట్రియల్ కారిడార్‌కు అనుసంధానంగా ఉంటుంది. ఫంక్షనల్ టెక్స్ టైల్స్, ఎకో - డైయింగ్, టెక్స్ టైల్ రీసైక్లింగ్ తదితర అంశాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయి అని తెలిపారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణ పారిశ్రామికాభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. కస్టమైజ్డ్ ల్యాండ్ పార్సిల్స్, ప్లగ్ అండ్ ప్లే యూనిట్స్, నైపుణ్య మానవ వనరులు, సమర్థవంతమైన నాయకత్వం, స్థిరమైన ప్రభుత్వం, భౌగోళిక పరిస్థితులు పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తున్నాయి. టెక్స్ టైల్స్, టెక్నికల్ టెక్స్ టైల్స్, ఎలక్ట్రానిక్స్ సిస్టం డిజైన్ అండ్ మానుఫ్యాక్చరింగ్(ఈఎస్ డీఎం), సస్టైనబుల్ మానుఫ్యాక్చరింగ్, ఇన్నోవేషన్ అండ్ ఆర్ అండ్ డి తదితర రంగాల్లో తైవాన్ కంపెనీలకు తెలంగాణ అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. తైవాన్ పారిశ్రామికవేత్తలు ముందుకొస్తే తెలంగాణ - తైవాన్ మాన్యుఫాక్చరింగ్ జోన్స్, ప్రత్యేక టెక్స్ టైల్ క్లస్టర్ లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. టెక్స్ టైల్ రంగం అభివృద్ధికి టిటిఎఫ్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తైవాన్ ప్రతినిధులు మంత్రికి తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, రాష్ట్ర టెక్స్ టైల్స్ డైరెక్టర్ ధరణి, టిటిఎఫ్ సెక్షన్ చీఫ్ ఆర్థర్ చియాంగ్, తైవాన్‌కు చెందిన టైనాన్ ఎంటర్ ప్రైజ్ కంపెనీ లిమిటెడ్, లీలీ గ్రూప్, ఆల్కెమీ తైవాన్ లిమిటెట్, సింగ్ యోంగ్ హో ఎంటర్ ప్రైజ్ కంపెనీ లిమిటెడ్, ఫార్ ఈస్టర్న్ న్యూ సెంచరీ కార్పోరేషన్, లిటిల్ కింగ్ గ్లోబల్ కంపెనీ లిమిటెడ్, యూ బంగ్ ఎంటర్ ప్రైజ్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# హెచ్‌సిఎ పర్యవేక్షకునిగా జస్టిస్ నవీన్ రావు

>> నియమించింది. ఇదిలావుండగా హెచ్‌సిఎలో వెలుగు చూసిన అక్రమాలపై సిబిఐచేత విచారణ జరిపించాలని హైకోర్టులో శుక్రవారం నాడు పిటిషన్ దాఖలయ్యింది. సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ నిర్వాహకులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. హెచ్‌సిఎ పెద్దలు తెలంగాణ క్రికెట్‌ను పూర్తిగా నాశనం చేయడంతో పాటు వర్తమాన క్రీడాకారులకు భవితవ్యం లేకుండా చేసిందని, కోట్లాది రూపాయల నిధులను కాజేశారని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు దీనిపై సోమవారం నాడు విచారిస్తామని పేర్కొంది.

# ప్రధానుల్లో మోడీ టాప్

>> ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలో నరేంద్ర మోడీజనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. 1978లో సూరత్, వడోదరా ప్రాంతంలో ఆర్‌ఎస్‌ఎస్ సంభాగ్ ప్రచారక్‌గా బాధ్యతలు అందుకున్నారు. 1985లో మోడీఆర్‌ఎస్‌ఎస్ ద్వారా బిజెపీతో జత కలిశారు. 1987లో అహ్మదాబాద్ మునిసిపల్ ఎన్నికల్లో బిజెపి ప్రచారకర్తగా వ్యవహరించారు. ఆ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించింది. 1987లో గుజరాత్‌లో బిజెపి ఆర్గనైజింగ్ సెక్రటరీ అయ్యారు. 1995 బిజెపి నేషనల్ సెక్రటరీగా ఎన్నికై ఢిల్లీకి మకాం మార్చారు. ఆ తర్వాత హరియాణా, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల కాంపైన్‌లో ప్రధాన పాత్ర వహించారు. 1996లో బిజెపి జనరల్ సెక్రటరీగా పదోన్నతిపొందారు. 2001లో గుజరాత్ ముఖ్య మంత్రిగా ఉన్న కేశుభాయ్ పటేల్ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో బిజెపి హైకమాండ్ కీలకనిర్ణయం తీసుకుంది. సిఎంగా కేశుభాయ్ పటేల్‌ను తప్పించి నరేంద్ర మోడీకి సిఎం బాధ్యతలు అప్పగించింది బిజెపి అధినాయకత్వం. గుజరాత్ సిఎంగా 2001 అక్టోబరు 7న మోడీ ప్రమాణస్వీకారం చేశారు. సిఎంగా ప్రమాణస్వీకారం చేసే సమయానికి మోడీ ఎమ్మెల్యే కూడా కాదు. 2002 ఫిబ్రవరిలో గుజరాత్‌లోని రాజ్ కోట్ అసెంబ్లీ స్థానంలో జరిగిన ఉప ఎన్నికల్లో మోడీ పోటీ చేసి గెలుపొందారు. 2007, 2012లలోగుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లోనెగ్గిముఖ్య మంత్రి అయ్యారు. 2014, 2019, 2024 సార్వత్రికఎన్నికల్లో నెగ్గి ప్రధాని అయ్యారు.

# లాసెట్ కౌన్సెలింగ్

న్నారు. ఆగస్టు 11 నుంచి 14 వరకు ఎన్‌సిసి, సిఎపి, పిహెచ్, స్పోర్ట్స్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. ఆగస్టు 15న లా సెట్‌కి అర్హత కలిగిన వారి లిస్టును విడుదల చేయనున్నారు. ఆగస్టు 16, 17 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 18న వెబ్ ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యం కల్పించారు. ఆగస్టు 22న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 22 నుంచి 25లోపు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 30 నుంచి క్లాసులను ప్రారంభించనున్నారు.

ఆగస్టు 25 నుంచి పిజి లాసెట్ కౌన్సెలింగ్
సెప్టెంబర్ 3, 4 తేదిల్లో వెబ్ ఆప్షన్లు
సెప్టెంబర్ 9న సీట్ల కేటాయింపు

పిజి లాసెట్-2025కి సంబంధించిన నోటిఫికేషన్ నేడు విడుదల కానుంది. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇవ్వనున్నారు. ఆగస్టు 27 నుంచి 29 వరకు ఎన్‌సిసి, సిఎపి, పిహెచ్, స్పోర్ట్స్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 2న పిజి లా సెట్‌కి అర్హత కలిగిన వారి లిస్టును విడుదల చేయనున్నారు. సెప్టెంబర్ 3, 4 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. సెప్టెంబర్ 5న వెబ్ ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యం కల్పించారు. సెప్టెంబర్ 8న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 9 నుంచి 13లోపు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 10 నుంచి క్లాసులను ప్రారంభించనున్నారు.

## వారం - వర్జ్యం

26-07-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
విదియ రా.10.46
ఆశ్లేష ప.3.57
వర్జ్యం : తె.4.12-5.50
దు.తె.5.47-7.27
శుభసమయం : సా.6.45-7.15
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామి నుండి ఆస్తి, వస్తులాభాలు పొందుతారు. అతిథుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం :** ఆర్థిక పరిస్థితి సంతృప్తి కరంగా ఉండును. ఇంటా బయటా ప్రోత్సాహ కరంగా వుండును.

**మిథునం:** ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. వివాదాలకు దూరంగా వుండటం మంచిది.

**కర్కాటకం :** ప్రత్యర్థులు మిత్రులుగా మారి సాయం అందిస్తారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి సన్మానాలు పొందుతారు.

**సింహం:** ఉద్యోగాలలో నూతన అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి.

**కన్య :** కొత్త పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. సోదరుల నుండి విలువైన సమాచారం అందుతుంది.

**తుల :** అనుకోని అవకాశాలు పొందుతారు. సంతానం నాకు అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు. వస్తులాభం.

**వృశ్చికం:** రాజకీయ, పారిశ్రామిక, కళా రంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**ధనుస్సు:** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. షేర్లు, భూములు క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మకరం:** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక రుణాలు తీరి ఊరట చెందుతారు. ప్రయాణాలు.

**కుంభం:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది.

**మీనం :** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. అకారణంగా వివాదాలు ఏర్పడవచ్చు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం మాల్దీవుల్లో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ఆదేశ అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జు

# మాల్దీవులకు రూ.4850 కోట్ల సాయం

## రెండుదేశాలమధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి కృషి

## ఆ దేశ అధ్యక్షుడు మొయిజ్జుతో భేటీ తర్వాత ప్రధానిమోడీ

**మాలె(మాల్దీవులు) జూలై 25:** ఇరుగుపొరుగుదేశాలకే తొలిప్రాధాన్యం కింద మాల్దీవుల దేశానికి ప్రముఖ స్థానం ఉందని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. బ్రిటన్ పర్యటనను ముగించుకుని శుక్రవారం మాల్దీవులు చేరుకున్న ప్రధాని దేశ అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత్‌కు మాల్దీవులు అత్యంత విశ్వసనీయదేశమని అన్నారు. ఈ ద్వీపకల్ప దేశానికి లైన్ ఆఫ్ క్రెడిట్‌కింద రూ.4850 కోట్ల ఆర్థికసాయం కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. వాణిజ్య, రక్షణ, మౌలిక వసతులు తదితరరంగాల్లో పరస్పర సహకారానికి ఇరుదేశాలు అంగీకరించినట్లు ప్రధాని అన్నారు. భారత్‌మాల్దీవులమధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబందించిన చర్చలు ప్రారంభం అయ్యాయన్నారు. ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం ఖరారుకు ఇరుదేశాలుకృషిచేస్తున్నాయనిచెప్పారు. భారత్ అనుసరించే పొరుగుకే ప్రాధాన్యం మహాసాగర్ విధానాల్లో మాల్దీవులకే ఎక్కువ ప్రాధాన్యం ఉందన్నారు. రక్షణ సామర్థ్యాలనున బలోపేతంచేసుకోడానికి ద్వీపదేశానికి భారత్ నిరంతరం మద్దతిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాల్దీవులకు వెళ్లారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆ దేశంలో అడుగుపెట్టారు. ఆయనకు ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు, విదేశాంగ, రక్షణ, ఆర్థిక, హోంశాఖ మంత్రులు విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలికారు. 'ఇండియా ఔట్' నినాదంతో రెండుదేశాల మధ్య సంబంధాలు ఒడిదొడుకులకు గురైన నేపథ్యంలో తాజా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాల్దీవులు అధ్యక్షుడుగా మహ్మద్ ముయిజ్జు ఎన్నికైన మొదట్లో.. చైనా అనుకూల విధానాలు అవలంబిస్తూ.. 'ఇండియా ఔట్' నినాదాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా మాల్దీవులకు భారత్ అందిస్తున్న సైనిక సాయాన్ని వెనక్కి తీసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఈ నేపథ్యంలోనే విడతల వారీగా గత మే నాటికి మాల్దీవుల్లోని భారత్ సైన్యం వెనక్కి వచ్చేసింది. ముయిజ్జు 'చైనా ఫస్ట్' విధానాన్ని అనుసరించారు. తర్వాత తన నిర్ణయాల ప్రభావం ముయిజ్జుకు త్వరగానే అర్థమైంది. దాంతో మనతో సంబంధాలు మెరుగుపర్చుకోవడానికి మొగ్గు చూపారు. గత యేడాది మన దేశ పర్యటనకు వచ్చిన ఆయనమోడీని మాల్దీవులకు ఆహ్వానించారు.

# బిసిలకు ఇస్తావా?

>> షన్ నివేదిక ప్రకారం.. మోడీ కులాన్ని బిసి జాబితాలో చేర్చింది. ఆ సమయంలో కనీసం మోడీ ఎమ్మెల్యేగా కూడా లేరు. కేంద్రంలో అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కులాన్ని జాతీయ స్థాయిలో ఓబిసి జాబితాలో చేర్చింది.అదే సమయంలో విశ్వ బ్రాహ్మణులతో పాటు మరికొన్ని కులాలను కూడా బిసిల్లో చేర్చారు. మరి విశ్వ బ్రాహ్మణులను కూడా కన్వర్టెడ్ బిసిలని అంటారా? ఆ తర్వాత కూడా చాలా కులాలను ఎస్సీ, ఎస్టీల జాబితాలో చేర్చారు. మరి వారందరినీ కూడా కన్వర్టెడ్ కులాలకు చెందిన వారని చెబుతారా? నరేంద్ర మోడీని, ఆయన కులాన్ని కాంగ్రెస్ నాయకులు రాజకీయంగా మైలేజీ పొందేందుకు ఎన్నో సార్లు కించపరుస్తూ మాట్లాడుతూ ఉన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో వరుసగా కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోతుందన్నారు. వరుసగా మూడోసారి కూడా రాహుల్ గాంధీని దేశ ప్రజలు తిరస్కరించి, నరేంద్ర మోడీని ప్రధానిని చేశారు. ఈ ఫ్రస్టేషన్‌తోనే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డితో ఇలాంటి మాటలు మాట్లాడిస్తున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఓడిపోవడం ఖాయం. వంద మంది రాహుల్ గాంధీలు కాదు.. వెయ్యి మంది రేవంత్ రెడ్డిలు వచ్చినా కాంగ్రెస్ ఆ రాష్ట్రాల్లో ఓడిపోవడం ఖాయం. ఢిల్లీ సహా అనేక రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నిల్లో కాంగ్రెస్‌కు గుండు సున్నా సీట్లు వచ్చాయన్న నిరాశతో వ్యక్తిగతంగా, రాజ్యాంగ బద్ధ సంస్థలపై దాడులు చేస్తున్నారు. మీ రాహుల్ గాంధీ ఏ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను. దేశ ప్రధానమంత్రిపై దిగజారిన వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదు. ఆయన నామినేటెడ్ ప్రధాని కాదు.. మూడుసార్లు ఆయనపై నమ్మకంతో ప్రజలు అధికారాన్ని అందించిన విషయం గుర్తుంచుకోవాలి. తెలంగాణ హైకోర్టు ఆదేశాల ప్రకారం.. పెంచిన రిజర్వేషన్లతోనే స్పష్టంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు అక్బరుద్దీన్, అసదుద్దీన్ ఒవైసీ, అజారుద్దీన్, షబ్బీర్ అలీ లాంటి ముస్లింలకు కాకుండా పూర్తిగా బిసిలకే అందేలా.. వారికే న్యాయం జరిగేలా రిజర్వేషన్లు కల్పించాలి.వేరే వారికి నీతులు చెప్పే ముందు రేవంత్ రెడ్డి సిఎం పదవికి రాజీనామా చేసి, బిసిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు.

# బిసి రిజర్వేషన్ల వ్యతిరేకి బిజెపి

>> తెలంగాణ బలహీన వర్గాల అంశానికి సంబంధించిన అంశం బలహీన వర్గాలకు లాభం జరగాలి మీరు ఇలా వ్యతిరేకిస్తే మా కుల సంఘాలు బలహీన వర్గాల సంఘాలు తెలంగాణలో మిమ్మల్ని అడుగు కూడా పెట్టనియ్యరు. చాలా సంవత్సరాల తర్వాత బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అవకాశం వచ్చింది. వేచిచూసే ధోరణితో సానుకూల ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. నోటికొచ్చే కూడును బిజెపి తన్నే ప్రయత్నం చేయవద్దని ఆయన కోరారు.బిజెపిలో ఉన్న బిసి నాయకుల్లారా కిషన్ రెడ్డి,రామచంద్రరావు లాంటి బిసిల వ్యతిరేక మాటలు వినండి అని హితవు చెప్పారు.మాది సామాజిక పార్టీ సామాజిక న్యాయానికి బ్రాండ్ అంబాసిటర్ మా కాంగ్రెస్ పార్టీమీ పార్టీలో గొంతు విప్పకపోతే అణిచివేతకు గురవుతారని ఆయన అన్నారు. జరుగుతున్న వాస్తవాలను పరిశీలించే ప్రయత్నం చేయండి బిజెపి బిసిలకు మా కన్నా ఎక్కువ ఏం చేసింది అని ప్రశ్నించారు. బిసిల రిజర్వేషన్లు ముస్లింల ప్రస్తావని తీసుకొస్తున్నారని ఆయన అన్నారు. పక్కన ఆంధ్రప్రదేశ్,మీరు పరిపాలిస్తున్న గుజరాత్ లో రిజర్వేషన్లు తొలగించి రండి అక్కడ తీయకుండా పొత్తులో ఉండే రాష్ట్రాల్లో మాట్లాడరని ఆయన ఆవేదన చెందారు. తెలంగాణలో బిసి లకు రిజర్వేషన్లు జరుగుతుంటే ఒక అపోహ సృష్టిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు మరోసారి విజ్ఞప్తి కామారెడ్డి డిక్లరేషన్ నుండి 4ఫిబ్రవరి 2025 చట్టం చేసే వరకు అక్కడి నుండి గవర్నర్ రాష్ట్రపతికి పంపించే వరకు మా చిత్త శుద్ధితో పనిచేశామని ఆయన తెలిపారు. మేధావులు,విద్యార్థులు నాయకత్వం ,ప్రజా ప్రతినిధుల శ్రమను బిజెపి నీరుగార్చే ప్రయత్నం చేస్తుందని దానిని గుర్తించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో జెఎసి గా ఏర్పడినట్టు రిజర్వేషన్లు కాపాడుకోవడానికి అదే విధంగా ముందుకు కదలాలి అని ఆయన కోరారు. రిజర్వేషన్లు పెరిగితే అధికంగా సామాజికంగా రాజకీయంగా ఉద్యోగాలపరంగా విద్యా రంగాల్లో అభివృద్ధి జరిగి విప్లవత్మక మార్పులు జరుగుతాయని అన్నారు.భారతదేశానికి స్వాతంత్రం వచ్చినట్టు తెలంగాణలో ద్వారా దేశవ్యాప్తంగా బలహీన వర్గాలకు న్యాయం జరగడానికి రాహుల్ గాంధీ గారు కంకణం కట్టుకున్నారని తెలిపారు. రాహుల్‌గాంధీ రెట్టింపు ఉత్సాహంతో బలహీన వర్గాలకు న్యాయం చేస్తానని చెబుతున్నారు బిజెపి, బీఆర్ఎస్ ,టిడిపి , ఏ పార్టీలో ఉన్నాబిసి బిడ్డలు స్వాగతించండి అని పొన్నం పిలుపునిచ్చారు.

# బకాయిలు రూ.121కోట్లు

>> గ్యాస్ రాయితీ చెల్లింపులు జరుగుతాయని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు..అయితే మేనెల నుంచి పౌరసరఫరాలశాఖ మాత్రం టోకెన్‌లు జారీచేసినా ఖజానాకు నుంచి మాత్రం నెలలుగా రాయితీ సొమ్ము లబ్దిదారుల ఖాతాల్లో జమకావడం లేదు. లబ్ధిదారుడికి సిలిండర్ అందిన తరువాత రూ.500 కంటే ఎక్కువ ఉన్న మొత్తాన్ని ప్రభుత్వం సంబంధిత ఖాతాకు జమ చేయాల్సి ఉండగా జాప్యమవుతోంది. ప్రస్తుతం వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.915గా ఉండగా ఇందులో రూ.415 రాయితీ రూపంలో లబ్దిదారుల ఖాతాలో జమ కావాల్సి ఉంది. ప్రస్తుతం కేంద్రం ఇస్తున్న రాయితీ రూ.40.71 సిలిండర్ తీసుకున్న రోజే జమ అవుతోంది. దీనిపై ప్రజాపాలన కేంద్రాల్లోనూ ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. మొదట్లో రాయితీ డబ్బులు జమ చేసినా, గత ఆరు నెలలుగా నిలిచిపోయిందని వాపోతున్నారు.ప్రజాపాలన దరఖాస్తు సమయంలో వంటగ్యాస్ కనెక్షన్ నంబర్ వివరాలు జత చేసినా చాలామంది పేర్లు నమోదు కాలేదు. దీంతో అర్హులు రాయితీ కోల్పోతున్నారు. ఆన్‌లైన్లో నమోదుకు తక్కువ సమయం ఇవ్వడంతో ఆపరేటర్లు పూర్తిస్థాయి వివరాలు నమోదు చేయకపోవడంతో అర్హుల పాలిట శాపంగా మారింది.తెలంగాణ వ్యాప్తంగా ప్రత్యేక హెల్ప్ డెస్కును ఏర్పాటు చేయడం, ప్రజాపాలన దరఖాస్తుల్లో ఎడిట్ ఆప్షన్ ఇవ్వడం, కొత్త రేషన్ దారులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తే సమస్యలు తీరనున్నాయి.కొత్తగా మరో 5లక్షలకుపైగా తెల్లరేషన్‌కార్డులు ఇస్తుండటంతో వంటగ్యాస్ రాయితీ భారం ఇంకా పెరిగే అవకాశం కూడా ఉంది. జగిత్యాల జిల్లాలో సుమారు ఎనిమిది లక్షల మంది మహాలక్ష్మి పథకం లబ్దిదారులుఉండగా ఇప్పటి వరకు 23లక్షల 74వేల రూపాయలు మాత్రమే వారి ఖాతాల్లో జమైంది. నిజామాబాద్ గత ఆరు నెలలుగా కొందరు లబ్దిదారులకు రాయితీసొమ్ము జమ కాకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలోఇప్పటి వరకు 2,40,825 కుటుంబాలకు 8,43,599 రాయితీ సిలిండర్లు సరఫరా చేసింది. లబ్దిదారుల ఖాతాల్లో రూ.25.41 కోట్లు జమ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

### హెచ్‌సిఎ స్కాం..
## ముగ్గురు నిందితులకు బెయిల్

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) గోల్‌మాల్ కేసులో అరెస్టయిన ఐ దుగురు నిందితుల్లో ముగ్గురికి బెయిల్ మంజూరయ్యింది. దీనికి సంబంధించి మల్కాజిగిరి కోర్టు శుక్ర వారం ఆదేశాలు జారీ చేసింది. బెయిల్ లభిం చిన వారిలో హెచ్‌సిఎ కోశాధికారి శ్రీని వాసరావు, శ్రీచక్ర క్లబ్ అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి రాజేందర్‌యాదవ్ ఉన్నారు. వీరు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విచారించిన కోర్టు షరతులతో బెయిల్‌ను ఇచ్చింది. అయితే ఇదే కేసులో అరెస్టయిన హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావుతోపాటు సిఇఒ సునీల్‌లకు ఇంకా బెయిల్ లభించలేదు. కాగా జగన్‌మోహన్ రావును మరింతగా విచారించేందుకు నాలుగు రోజులపాటు కస్టడీలోకి ఇవ్వాలని సిఐడి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కోర్టు కొట్టివేసింది. ఈ నెల తొమ్మిదో తేదీని సిఐడి అధికారులు వీరిని అరెస్టు చేయడం తెలిసిందే.

## నల్లమలలో ఎకో టూరిజం అభివృద్ధిపరచండి
### కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసిన ఎంపి మల్లు రవి



**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** నల్లమలలో ఎకోటూరిజం అభివృద్ధి పరిచి అక్కడ జీవవైద్యం పరిరక్షణకు పూను కోవాలని ఎంపి మల్లు రవి అన్నారు. శుక్రవారం ఢిల్లీలో టూరిజం మంత్రి షెకావత్‌ను ఆయన కలిసి వినతిపత్రం ఇచ్చారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తరుపున రవి మాట్లాడుతూ నల్లమలలో పులుల అభయారణ్యం ఉందని మరోవైపు కృష్ణా నది సోయగాలు ఎంతో అందంగా ఆహ్లాదకరంగా ఉంటుందని దానిని అభివృద్ధి పరచాలని సూచించారు.

## ఆగస్టు 28కి కెడబ్ల్యుడిటి కేసు వాయిదా

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** కృష్ణానది జలాల వివాదాల పరిష్కార ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మధ్య తలెత్తిన వాజ్యంను పరిష్కరించడానికి ఆగస్టు28కు కేసు వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్ తెలిపారు. జూలై 24 నుంచి శుక్రవారం వరకు జస్టిస్ బ్రిజేష్‌కుమార్, మెంబర్ రాంమోహన్‌రెడ్డి, తాలపత్రసమక్షంలో తెలంగాణ తన వాదనలు విని పించాల్సి ఉంది అయితే దీనిని ఆగస్టు 28,29కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## రాహుల్, రేవంత్‌లపై విమర్శలు మానుకో కెటిఆర్
### బిజెపి బ్రాహ్మణ ఆదిపత్యం కలిగిన పార్టీ
### ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** కెటిఆర్ ఫస్ట్ వాళ్ల కుటుంబాన్ని చక్క దిద్దుకొని రాహుల్, రేవంత్ గురించి మాట్లాడితే బాగుంటుందని మాన కొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల గురించి బిజెపి, బిఆర్ ఏస్ పార్టీ నేతలకు మాట్లాడే అర్హత లేదని ఆయన అన్నారు. టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అందుబాటులో ప్రజా ప్రతినిధుల కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. రిజర్వేషన్ల ఆర్డినెన్సు ను అడ్డుకునే ప్రయత్నం బిజెపి చేస్తోందని అన్నారు.. మోదీ ముఖ్యమంత్రి ఉన్నపుడు గుజరాత్ లో ముస్లిం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. బిసి రిజర్వేషన్ల గురించి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తెలుసుకొని మాట్లాడాలని హితవు చెప్పారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా బిసిలను నియమించకపోవడంతో వాళ్ళ చిత్త శుద్ధి ఏంటో తేలిపోయిందని అది అగ్రవర్ణ పార్టీ, ఆ పార్టీలో బ్రహ్మాణ అధిపత్యం కొనసాగుతోందని నిందించారు. కవిత కులగణన లెక్కలు బయటపెట్ట మనడం హాస్యాస్పదం అని ఆయన అన్నారు.

## ఎసిబికి చిక్కిన డిప్యూటీ కమిషనర్ రవికుమార్
### రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

**హైదరాబాద్ (అత్తాపూర్) జూలై 25, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఓ ఫుడ్‌కోర్టుకు సంబంధించిన యాజమానితో డబ్బులు తీసు కుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా జిహెచ్ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పట్టుపడ్డారు. ఫుడ్ కోర్టు యాజమాని ఫిర్యాదుతో ఎసిబి డిఎస్పి శ్రీనివాస్‌రెడ్డి తన బృందాంతో శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో రైడ్స్ నిర్వహించి డిసిని పట్టు కున్నారు. ఎసిబి డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి మాట్లా డుతూ.. సర్కిల్ పరిధి లోని ఓ ఫుడ్‌కోర్టు నిర్వ హణ కోసం గత కొన్ని రోజులుగా యజమానిన్ని ఇబ్బందులకు గురిచేయ డంతో పాటు రూ.5లక్షల డిమాండ్ చేయగా అతను ఎసిబిని సంప్రదించారు. శుక్రవారం అతను సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ రవి కుమార్‌కు రూ.2లక్షల రూపాయలు ఇచ్చాడని తెలిపారు. రైడ్ చేసి కారులో ఉంచిన రూ.2లక్షల రూపాయలను స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నామని వారి ఇంట్లో కూడా సోదాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఎవ్వరైనా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తే ఎసిబిని సంప్రదించాలని అవినితి అధికారులు ఎవ్వరునా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసు నమోదు చేసుకొని లోతుగా దర్యాప్తు చేసున్నట్లు తెలిపారు.



ఎసిబికి పట్టుబడిన జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రవికుమార్

# బిసి రిజర్వేషన్లపై కేంద్రం మోసగిస్తే సహించం
### మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం, బిజెపి మోసం చేస్తే తాము ఊరుకునేది లేదని రాష్ట్ర అటవీ, పర్యా వరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఒక బీసీ మంత్రిగా బిసి బిడ్డగా ఈ విషయంలో కపట వైఖరిని బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అవలంబిస్తే తాము ప్రజల్లో ఎండగడతామని మంత్రి సురేఖ హెచ్చరించారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్‌లతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. బిసి బిల్లును తాము అసెంబ్లీలో ప్రవేశపెట్టి... కేంద్రానికి పంపిస్తే...బిజెపి దాన్ని ఆపిందని... ఇది సహేతుకం కాదన్నారు. ప్రస్తుతం బిసి రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి దగ్గర ఉందన్నారు. అయితే, దాన్ని ఒప్పుకుంటారా? లేదో రాష్ట్ర ప్రజలకు బిజెపి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని సురేఖ డిమాండ్ చేశారు. బిసిలను మోసం చేసే కార్యక్రమాలు చేయొద్దని బిజెపిని ఆమె హెచ్చ రించారు. కాగా, సిఎం రేవంత్ రెడ్డి ఉన్నతవర్గానికి చెందిన నాయకుడైనా... ఆయా వర్గాలను ఒప్పించి బిసి హక్కులను కాపాడేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ దేశంలో దళితులు, గిరిజనులకు రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేని, గతంలో ఉమ్మడి రాష్ట్రంలోని కూడా తాము ముస్లింలకు రిజర్వేషన్ ఇచ్చామని గుర్తు చేశారు. ఇప్పుడు బిసిలకు రిజర్వేషన్లు ఇస్తున్నది కూడా మేమే అని మంత్రి సురేఖ వివరించారు. సమాజంలో వెనకబడిన వర్గాలు, నిమ్నవర్గాలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు.

గురువారం దేశ రాజధాని ఢిల్లీకి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షుడు, బిసి మంత్రులతో పాటు నిపుణుల కమిటీ... ఖర్గే ,రాహుల్ గాంధీలతో భేటీ జరిగిందని గుర్తు చేశారు. ఈ భేటీలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనపై కాంగ్రెస్ అగ్రనాయకత్వం పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసినట్టు తెలిపారు. బిఆర్ఎస్ బిసి కులగణనలో అసలే పాల్గొనలేదని. వారికి బిసిలపై ప్రేమ ఉండే అవకాశం లేదన్నారు. ఇప్పటికైనా బిసిలపై బిజెపి, బిఆర్ఎస్‌లు ద్వంద వైఖరి వీడాలని... సామాజిక న్యాయం కోసం కృషి చేయాలన్నారు.

# ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి హైకోర్టులో చుక్కెదురు
### ఒఎంసి కేసులో రివిజన్ పిటిషన్ డిస్మిస్

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపిలో సంచలనం రేపిన ఓబుళాపురం మైనింగ్ కేసులో ఎపికి చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురయ్యింది.



ఓబుళాపురం గనుల కేసులో నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని ఆమె దాఖ లు చేసిన రివిజన్ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం నాడు డిస్మిస్ చేసింది. ఈ కేసులో ఆమె పేరును నిందితుల జాబితాలో వుండాల్సిందేనని సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌తో హైకోర్టు ఏకీభవించింది. దీంతో ఓబుళాపురం మైనింగ్ కేసులో ఆమె కోర్టు విచారణను చవిచూడాల్సి వుంటుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కపాడియా మీడియాకు తెలిపారు. ఉమ్మడి ఎపి హయాంలో ఓఎంసి కేసుగా పేరొందిన ఓబుళాపురం గనుల అక్రమ తవ్వకాలకు సంబంధించి అప్పట్లో గనుల శాఖ కార్యదర్శిగా వు న్న సీనియర్ ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మీపై సిబిఐ కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ కేసులో ఓఎంసి ఎండిగా వున్న గాలి జనారదన్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి నాటి గనుల శాఖ డైరెక్టర్ రాజ గోపాల్ సహా మరికొందరిని దోషులుగా సిబిఐ కోర్టు రెండు నెలల క్రితం తీర్పు చెప్పడం విది తమే. ఈ కేసుకు సంబంధించి 2011లో గాలి జనార్దన్‌రెడ్డి సహా నిందితులందరు రెండేళ్లకు పైగా చంచల్‌గూడ జైల్లో రిమాండులో వుండగా వీరితో పాటు శ్రీలక్ష్మీ కూడా ఏడాది పాటు జైలు జీవితం గడిపారు.

ఈ కేసులో ఆమె బెయిలుపై ఉన్నారు. అయితే ఓఎంసి కేసులో శ్రీ లక్ష్మీని నిందితుల జాబితా నుంచి తొలగిస్తూ సర్కారు ఆదేశాలు జారీ చేయగా దీనిని సిబిఐ తప్పుపట్టింది. ఇదే సమయంలో శ్రీలక్ష్మీ కూడా తన పే రును ఓఎంసి నిందితుల జాబితా నుంచి తొలగించాలని హై కోర్టును కోరారు. ఆమె పేరును తొలగించేందుకు వీల్లేదని హైకోర్టులో సిబిఐ ప్రత్యేకంగా పిటిషన్ దాఖలు చేసింది. శ్రీలక్ష్మీ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌పై శుక్రవారం ఉదయం హైకోర్టులో విచారణ జరిగింది. శ్రీలక్ష్మీ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ విషయంలో సిబిఐ వాదనలతో ధర్మాసనం ఏకీభ వించింది. ఈ కేసులో శ్రీలక్ష్మీ అక్రమాలకు పాల్ప డ్డారనడానికి పక్కా ఆధారాలున్నాయని హైకోర్టు అభిప్రా యపడింది. ఇదే కేసులో నాటి గనుల శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డితో పాటు ఐఎఎస్ అ ధికా రి కృపానందంలకు ఊరట కలిగించినట్లు తనకు మినహాయింపు ఇవ్వాలని శ్రీలక్ష్మీ కోరడం సరి కాదని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో సిబిఐ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కపాడియా తన వాదనలు వినిపించారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసిన వింగ్ కమాండర్ యాకూబ్‌అలీ

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** 12వ ఎయిర్‌మెన్ సెలెక్షన్ సెంటర్ కొత్త కమాండింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన వింగ్‌కమాండర్ యాకూబ్ అలీ శుక్రవారం అంబేద్కర్ సచివాలయంలో పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. అగ్నివీర్‌లో చేరేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల యువకులు ఆసక్తి చూపడం లేదని, అందుకు ఈ రెండు రాష్ట్రాలు రిక్రూట్‌మెంట్ విషయంలో వెనుకబడి ఉన్నాయని యాఖుబ్ అలీ ఈ సంద ర్భంగా మంత్రి జూపల్లికి వివరించారు. ముఖ్యంగా రాష్ట్రం నుంచి అగ్నివీర్ పోటీ దారుల సంఖ్య చాలా తక్కువగా ఉందని చెప్పారు. భారత వైమానిక దళంలో ఉన్న అపారమైన ఉద్యోగ అవకాశాల గురించి యువతలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంద న్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని నియామక శిబిరాలు నిర్వహించి యువ తను ఉత్తేజపర్చే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. వింగ్ కమాం డర్ అలీ చేస్తున్న ప్రయత్నాలను మంత్రి కృష్ణారావు అభినందిస్తూ, యువతను దేశ సేవలోకి రప్పిం చేందుకు అవసరమైన అవగాహన కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

## మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి
### ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మతి స్థిమితం కోల్పోయి ఏం మాట్లాడుతున్నాడో అర్థంకాక నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నాడని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లడుతూ శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా మాట్లా డాల్సిన అవసరం ఉందన్నారు. హుజురాబాద్ ప్రజలు అసహ్యం చుకునే విధంగా కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. కెటిఆర్, బిఆర్ఎస్ నాయకులు చేసిన పనులన్నీ మిగితావాళ్లు కూడా అలానే పనిచేస్తారని కౌశిక్‌రెడ్డి మాట్లాడుతున్నారన్నారు. కెటిఆరన ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడినట్టు కౌశిక్‌రెడ్డే సాక్ష్యం అన్నారు. బిఆర్ఎస్ లో ఈటల చేరుతారనే భయంతో కెసిఆర్ కుటుంబం వద్ద పేరు సంపాదించుకునేందుకే కౌశిక్ రెడ్డి అలా మాట్లాడుతున్నారని విమర్శించారు. హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాల చెక్కులు కూడా కౌశిక్ రెడ్డి ఇవ్వకపోవడంతో ఎక్స్పైరీ డేట్ అయిపోయని అన్నారు. రేవంత్ రెడ్డి గురించి మాట్లాడితే బిఆర్ఎస్ నేతలు పైకి ఎత్తుకుంటారని కౌశిక్ రెడ్డి అనుకుం టున్నాడని, కానీ ఇలానే ప్రవర్తిస్తే మీ బతుకు కుక్కలు చింపిన ఇస్తరి అవుతుందని మండిపడ్డారు. కౌశిక్ రెడ్డి ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేస్తే ప్రజలు ఆయనకు తీవ్ర గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# రాజకీయ ఒత్తిడికి తలొగ్గవద్దు
### నూతన సిడిపిఒలకు నియామకపత్రాలను అందజేసిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు అంగన్ వాడీలను దేశానికి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని మంత్రి సీతక్క అన్నారు. ఇందులో భాగంగా అనేక మార్పులు తీసుకువస్తున్నామన్నారు. ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా నూతనంగా చైల్డ్ డెవలప మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లుగా ఎంపికైన 23 మందికి శుక్రవారం సచివాలయంలో మంత్రి సీతక్క నియామక పత్రాలు అంద చేశారు. ఈ సందర్భం గా నూతన సిడిపిఒలకు అభినందనలు తెలిపిన సీతక్క.. సీడీపీవోలు మహిళా శిశు సంక్షేమ శాఖ వెన్నెముక లాంటివారని మీరంతా ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు లొంగాల్సి న అవసరం లేదన్నారు. స్వేచ్ఛగా అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సేవా దృక్పథంతో, మానవతతో పనిచేసే శాఖ అని అన్నారు. వేల మంది పోటీ పడితే మీ 23 మంది ఉద్యోగాలు సాధించారు. మా శాఖలో ఇది కొత్తతరమన్నారు. ఉన్నత విద్యా వంతులైన మీరు మా శాఖలో చేరటం అభినంద నీయం అన్నారు. చిన్నారులు, గర్భిణీలు బాలిం తలకు సేవ చేసే అదృష్టం మీకు దక్కిందని.. శిశువులు మహిళల సంరక్షణతో పాటు దత్తత ప్రక్రియ, మహిళా సాధికారత వంటి అంశాలను నిర్వర్తించాల్సి ఉంటుందని సూచించారు. అంగన్ వాడీ సేవలు పేద ప్రజలకు ఎంతో అవసరం అని లబ్ధిదారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించే బాధ్యత మీదేనన్నారు. అంగన్ వాడీలకు 57 రకాల ఆట వస్తువులు ఇచ్చామని, వారంలో రెండు రోజులు ఎగ్ బిర్యాని పెడుతున్నామని చెప్పారు. పోషకార లోపాన్ని తగ్గించేందుకు పాలు గుడ్లు క్రమం తప్పకుండా సరఫరాతో పాటు చిన్నారులకు యూనిఫామ్స్ కూడా ఇస్తున్నామన్నారు. అంగన్‌వాడీలలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సేవలను లబ్ధిదారులకు అంద జేయాల్సిన బాధ్యత మీదేనని అందువల్ల మీరు కేవలం కార్యాలయాలకే పరి మితం కాకుండా ఫీల్డ్ విజిట్ చేయాలని సూచించారు. అంగన్ వాడీ సేవలు మెరుగుదలకు మీరు సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు.

# ఆగస్టు 1 నుంచి పిజి ఇ-సెట్ కౌన్సెలింగ్
### నేడు నోటిఫికేషన్ జారీ.. ఆగస్టు 9 వరకు రిజిస్ట్రేషన్స్
### 11, 12 తేదీల్లో వెబ్‌ఆప్షన్లు.. 16న సీట్ల కేటాయింపు
### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలే జీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఎంఇ, ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించిన పిజి ఇసెట్-2025 కౌన్సె లింగ్‌ను ఆగస్టు 1 నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను నేడు(శనివారం-జులై 26) విడుదల చేయనున్నట్టు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇందుకు సంబంధించిన అడ్మిషన్ల కమిటీ సమావేశం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండు రంగారెడ్డి పాల్గొన్నారు. పిజి ఈసెట్-2025కి సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల 26న విడుదల కానుంది. ఆగస్టు 1 నుంచి 9 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇవ్వనున్నారు. ఆగస్టు 6 నుంచి 8 వరకు ఎన్‌సిసి, సిఎపి, పిహెచ్, స్పోర్ట్స్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫి కేషన్‌ను నిర్వహించనున్నారు. ఆగస్టు 10న పిజి ఈ సెట్‌కి అర్హత కలిగిన వారి లిస్టును విడుదల చేయనున్నారు.

ఆగస్టు 11, 12 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 13న వెబ్ ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యం కల్పించారు. ఆగస్టు 16న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీట్లు పొం దిన విద్యార్థులు ఆగస్టు 18 నుంచి 21లోపు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పీజీ ఈ సెట్-2025 పరీక్షల్లో 92.63 శాతం అర్హత సాధించారు.

పిజి ఈ సెట్ పరీక్షలు జూన్ 16 నుంచి 19 వరకు జరిగాయి. పరీక్షలకి 25,335 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 22,983 మంది హాజరయ్యారు. పరీక్షలకి హాజరైన వారిలో 21,290 మంది అర్హత సాధించారు. పరీక్షకి హాజరైన వారిలో 92.63 శాతం అర్హత సాధించారు.

# హెచ్‌సిఎ స్కాంలో కీలక నిందితుడు దేవరాజ్ అరెస్టు

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) గోల్‌మాల్ కేసులో కీలక నిందితుడు ఎ2గా వున్న దేవరాజ్ రాంచందర్ (63) శుక్రవారం అరెస్టయ్యాడు. హెచ్‌సిఎ కార్యదర్శిగా వున్న దేవరాజ్ ఈ స్కాం వెలుగుచూసిన తరువాత పత్తాలేకుండా పోయాడు. ఇతని కోసం అనేకచోట్ల గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది.

చివరగా మహారాష్ట్రలోని పుణెలో త్రీస్టార్ హోటల్‌లో రహస్యంగా తల దాచుకున్న దేవ రాజ్‌ను అరెస్టు చేసిన సిఐడి అధికారులు అతన్ని వెంటనే హైదరాబాద్‌కు తరలించి ఇక్కడి కోర్టులో హాజరు పరిచి న్యాయస్థానం ఆదేశాల మేరకు చర్లపల్లి జైలుకు తరలించారు.

దేవరాజ్ అరెస్టుతో హెచ్‌సిఎ స్కాంలో అరెస్టయిన వారి సంఖ్య ఆరుకు చేరింది. ఈ కేసులో మొదట హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు, కోశాధికారి శ్రీనివాసరావు, సీఈఒ సునీల్, శ్రీచక్ర క్లబ్ అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి రాజేందర్ యాదవ్‌లను సిఐడి అరెస్టు చేయడం తెలిసిందే.

వీరిని ఆరు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని హెచ్‌సిఎ గోల్‌మాల్‌పై మరింత సమాచారం సేకరించడం విదితమే.

ఇదే కేసులో రెండు వారాలుగా పరారీలో వున్న దేవరాజ్ అరెస్టుతో అందరు నిందితులు పట్టుబడినట్ల య్యింది.

## తిరుపతి-షిర్డీ మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, జూలై 25, ప్రభాతవార్త:** యాత్రికుల సౌకర్యార్థం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతి-షిర్డీ-తిరుపతి మధ్య ప్రత్యేకరైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపారు. తిరుపతి నుంచి సాయినగర్ షిర్డీ వెళ్లే నెంబర్ 07637 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసు ఆగస్టు 3 నుంచి సెప్టెంబరు 28వరకు ప్రతి ఆదివారం తెల్ల వారుజామున 4 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 10.45 గంటలకు సాయినగర్ షిర్డీ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో సాయి నగర్ షిర్డీ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07638 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 4 నుంచి సెప్టెంబరు 29 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 7.35 గంటలకు సాయినగర్ షిర్డీ నుంచి బయలుదేరి మంగళవారం అర్థరాత్రి 1.30 (బుధవారం తెల్లవారు జామున) తిరుపతి చేరుకుంటుంది.

ఈ రైళ్లు మార్గమధ్యంలో రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికూడి, మిర్యాలగూడ, నల్గొండ, సికిందరాబాద్, లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్, బీదర్, భల్కి, ఉద్గీర్, లాతూర్, పర్లీ, గంగాఖేర్, పర్భని, సేలు, జాల్నా, ఔరం గాబాద్, నాగర్‌సోల్, మన్మాడ్, కోపర్‌గావ్ స్టేషన్లలో నిలుస్తాయి.




కేంద్రం నిషేధం విధించిన యాప్‌లు

## అశ్లీల కంటెంటెంట్ ప్రసారం చేస్తున్న 25 యాప్‌లపై కేంద్రం నిషేధం

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** అశ్లీల కంటెంట్ కలిగిన దృశ్యాలను అదేపనిగా ప్రసారం చేస్తున్న 25 యాప్‌లను కేంద్రం నిషేధించింది. ఈ మేరకు శుక్రవారం నాడు ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిషేధం విధించబడ్డ వాటిలో ఉల్లు, ఆల్ట్, దేశీఫ్లిక్స్, బిగ్ షాట్స్, బూమెక్స్, నవరస లైట్, గులాబ్ యాప్, కంగన్ యాప్, బుల్ యాప్, జల్వా యాప్, వావ్ ఎంటర్‌టైన్‌మెంట్, లుక్ ఎంటర్‌టైన్‌మెంట్, హిట్ ప్రైం, ఫెనిసా, షో ఎక్స్, సోల్ టాకీస్, అడ్డా టీవి, హాట్ ఎక్స్, విఐపి, హల్చల్ యాప్, మూడ్ ఎక్స్, నియాన్ ఎక్స్ విఐపి, ఫ్యూజీ, మోజీ ఫ్లిక్స్, ట్రై ఫ్లిక్స్ ఓటిటి (ఓవర్ ది టాప్) ప్లాట్‌ఫాంలు, వెబ్‌సైట్లు వున్నాయి. ఈ వెబ్ సైట్లు, యాప్‌లు భారతీయ చట్టాలను ఉల్లంఘించడంతో పాటు సమాచార టెక్నాలజి చట్టం 200 (సెక్షన్ 67, 67ఎ), భారతీయ న్యాయ సంహిత, 2023 (సెక్షన్ 294), మహిళల అసభ్యకరమైన చిత్రణ (నిషేధం) చట్టం, 1986 (సెక్షన్ 4) వంటి పలు భారతీయ చట్టాలను ఉల్లంఘించారని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ వెబ్‌సైట్‌లు అశ్లీలతను ప్రదర్శించడం వల్ల సమాజంలో నైతికతను దెబ్బతీస్తున్నాయని కేంద్రం పేర్కొంది. ఈ వెబ్‌సైట్‌లు లైంగిక దృశ్యాలను చూపడం వల్ల సమాజంలో పెడదోరణులను ఎక్కువ చేస్తున్నట్లు కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులో వుంది,

# ఎపి, తెలంగాణలో డీలిమిటేషన్‌పై దాఖలైన పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు
### 2022లో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తుది ఉత్తర్వులు
### యుటిలతో పోలిస్తే రాష్ట్రాల్లో డీలిమిటేషన్ నిబంధనలు భిన్నంగా ఉన్నాయన్న సుప్రీం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 25:** ఎపి, తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజనపై దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. 2022లో ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం తుది ఉత్తర్వులను జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని తన పిటిషన్‌లో పిటిషనర్ కోరారు. జమ్ముకశ్మీర్‌లో పునర్విభజన చేసే సమయంలో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టాన్ని పక్కన పెట్టి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని అందులో పేర్కొన్నారు. దీనికి సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ 170(3) అధికరణం ప్రకారం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో సెక్షన్ 26కి పరిమితి ఉందని తెలిపింది. 2026లో మొదటి జన గణన(జనాభా లెక్కలు) అనంతరం మాత్రమే డీలిమి టేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది.

ఇలాంటి పిటీషన్‌ను అనుమతించడం వల్ల ఇతర రాష్ట్రాల్లో కూడా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న పిటీషన్లు వరదల్లా వస్తాయని, గేట్లు తెరిచినట్లు అవుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కేంద్ర పాలిత ప్రాంతాలతో పోల్చినప్పుడు రాష్ట్రాలలో డీలిమిటేషన్‌కు(నియోజకవర్గాల పునర్విభజన) సంబం ధించిన నిబంధనలు భిన్నంగా ఉంటాయని ఈ సందర్భంగా సుప్రీం వ్యాఖ్యానించింది. జమ్మూకశ్మీర్‌పై ప్రత్యేక దృష్టి సారించారన్న పిటిషనర్ వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. జమ్మూకశ్మీర్ కోసం జారీ చేసిన డీలిమిటేషన్ నోటిఫికేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణను మినహాయించడం ఏకపక్షం, వివక్ష కాదని స్పష్టం చెప్తూ పురుషోత్తం రెడ్డి పిటిషన్ ధర్మాసనం కొట్టివేసింది.

లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను కొత్త జనసంఖ్యకు అనుగుణంగా అప్‌డేట్ చేస్తారు. 2027లో జనగణన ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆ సమాచారం ఆధారంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజక వర్గాలను పునర్విభజన చేసే అవకాశం ఉంది. ఈ డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల వివిధ రాష్ట్రాల్లోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యలోనూ మార్పు రానుంది. ప్రతి పార్లమెంట్ సభ్యుడు లేదా ఎమ్మెల్యే దాదాపు ఒకే సంఖ్యలో ప్రజలకు ప్రాతినిథ్యం వహించేలా ఈ మార్పులు జరిగే అవకాశాలున్నాయి.

భారత రాజ్యాంగం ప్రకారం ప్రతీ జనగణన తర్వాత లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. కానీ 1976 నుంచి ఈ తరహా ప్రక్రియను ఆపేశారు. దీనికి కారణం అప్పట్లో ప్రభుత్వం జనాభా నియంత్రణను ప్రోత్స హించాలని భావించడమే. అధిక జనన రేటు కలిగిన రాష్ట్రాలు ఎక్కువగా ఉత్తరాదిలో ఉన్నాయి.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ డివిజన్ : జడ్చర్ల
సంక్షిప్త టెండర్ ప్రకటన
టెండర్ ప్రకటన నం.: 01/2025-26
మహబూబ్‌నగర్ సర్కిల్‌లో జడ్చర్ల ఆపరేషన్ డివిజన్‌లో వివిధ విద్యుత్ పనులు నిర్వహించే అర్హులైన కాంట్రాక్టర్ల నుండి సీల్ టెండర్లు కోరబడుతున్నవి. చివరి తేది జారీ: 31.07.2025 సా.17.00గం. వరకు. దాఖలు చివరి తేది: 31.07.2025 సా.16.30గం. వరకు. మొత్తం సమాచారం వెబ్‌సైట్ : www.tssouthernpower.com నుండి పొందవచ్చును. ఫ్యాక్స్ నం: 08542-233380 & ఫోన్ నెం: 293419.
సం/-. డి.చంద్రమౌళి, డివిజనల్ ఇంజనీర్ ఆపరేషన్, జడ్చర్ల.
DIPR.NO. 5577-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 25.07.2025

వార్త


ప్రతిభావంతుడు సముద్రపు గట్టులాంటి వాడు, అలల వంటి సమస్యలకు వెనుతిరిగి పోడు.

-టి. ఎడిసన్

# ఉభయ తారక ఒప్పందం

ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించాలన్న భారత్ కల సాకారమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. అంతర్జాతీయ స్వేచ్ఛా వాణిజ్యంలో ఆటంకాలన్నిటినీసర్దుకుంటూ, సరిచేసుకుంటూ సౌహార్ద్ర సంబంధాలతో భారత్ ముందడుగు వేస్తోంది. తాజాగా ప్రధాని నరేంద్రమోడీ భారత్ యునైటెడ్ కింగ్‌డమ్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్యాన్ని సుగమం చేసే దిశగా స్వయంగా రంగంలోకి దిగారు. దాంతో సుంకాల రహిత స్వేచ్ఛా వాణిజ్యానికి ఆ దేశంలో అంకురార్పణ చేశారు. ఇన్నాళ్లు ఇచ్చిపుచ్చుకునే ధోరణికి కొన్ని దేశాలు విభిన్నపోకడలను అనుసరించాయి. భారత ప్రధాని సౌహార్ద్రతకు ఎక్కువ ప్రాముఖ్యమిస్తూ భారత్ బ్రిటన్‌ల మధ్య చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చరిత్రాత్మకంగా చెప్పుకోదగినది. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెట్టింపు చేసుకోవాలన్నది వారి సంకల్పం. ఐరోపా యూనియన్ నుంచి బయటకు వచ్చిన తర్వాత బ్రిటన్ భారత్‌తో కుదుర్చుకున్న ఏకైక అతిపెద్ద అత్యంత కీలక వాణిజ్య ఒప్పందంగా బ్రిటన్ ప్రధాని స్మార్టర్ పేర్కొనగా, అభివృద్ధి వాద యుగంలో తొలివికాస వాణిజ్య ఒప్పందంగా ప్రధాని మోడీ అభివర్ణించారు. ఈ ఎఫ్‌టిఎను 'సమగ్ర ఆర్థిక వాణిజ్య ఒప్పందం'గా ఉభయ దేశాల ప్రధానులు పేర్కొనడం విశేషం. భారత్ ఎగుమతులకు సుంకం తగ్గడం ఒక ఎత్తయితే భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు బ్రిటన్ స్వాగతించడం ఒక ఎత్తు. ఇలా 'ఫ్రీ ట్రేడ్ డీల్' కారణంగా ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు ఏర్పడడం విశేషం. భారతీయ రైతులకు ఎంఎస్‌ఎంఈలకు ప్రయోజనం చేకూరుతుంది. వాణిజ్య బంధాలు బలోపేతమౌతాయి. ఈ ద్వైపాక్షిక ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంట్ ధృవీకరించాక వాణిజ్యం మొదలవుతుంది. అయితే దాదాపు ఆ ప్రక్రియకు ఏడాది కాలం పట్టొచ్చుందని అంచానా. ఇది ప్రారంభమైన తర్వాత నాలుగైదేళ్లలో12వేల కోట్ల డాలర్ల వాణిజ్యానికి ప్రణాళికలు రూపకల్పన చేసుకుంటారు. బ్రిటన్‌లో కన్సర్వేటివ్ పార్టీ అధికారంలో ఉండగా భారత్ బ్రిటన్‌లు ఒకరి వికాసం కోసం మరొకరు చేతులు కలపాలనే ప్రతిపాదనలకు అంకురార్పణ జరిగింది. ప్రస్తుతం లేబర్ పార్టీ అధికారంలో ఉంది. బ్రిటన్ కొద్దికాలంగా ఆర్థికంగా బలహీనమవుతూ వస్తోంది. ఎవరు అధికారంలో ఉన్నా ఆర్థిక పరిస్థితులేమీ మెరుగుపడలేదు. ఈ నేపథ్యంలో 'ఎఫ్‌టిఎ' ఒప్పందాన్ని పెద్దగా ఎవరూ అభ్యంతరపెట్టలేదు. ఎన్నికల హామీలో కూడా చేర్చాయి. భారత్‌కు అండదండలు పుష్కలంగా అందించేందుకు బ్రిటన్ అక్కున చేర్చుకుంటామని భారత్‌లు ఒకరిపై ఒకరు విశ్వాసం కల్పించుకున్న తర్వాతనే 'ఒప్పందం'పై ఇరు వర్గాలు అడుగు ముందుకేశాయి. ఉభయదేశాల మధ్యజరిగే వాణిజ్య ఒప్పందంలో ఫార్మా వంటి రంగాల భవిష్యత్‌పై కొన్ని సందేహాలున్నాయి. వాటి విషయం ఎఫ్‌టిఎ ఆచరణలోకి వచ్చినప్పుడుమాత్రమే ఆయా అంశాల్లో మిగిలి ఉన్న 'కొర్రీ'లపై పరిష్కారం జరగగలదని తెలుస్తోంది. భారత్ నుంచి బ్రిటన్‌కు వెళ్లే 99 శాతం ఎగుమతులపై సుంకాలు బాగా తగ్గిపోతాయి. బ్రిటన్‌నుంచి మనకు వచ్చే దిగుమతులు కూడా 15శాతంనుంచిమూడు శాతానికి తగ్గిపోతాయి. వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు వలన భారత్ రైతాంగం సంతోషపడే రోజులు కనుచూపు మేరలోనే ఉన్నాయి. ఇవన్నీ అమల్లోకి వస్తే ఉభయదేశాల్లోనూ ఉపాధిఅవకాశాలు పెరుగుతాయి. ఇరుదేశాలపరస్పర ప్రయోజనాలు చేకూరే ఈ ఒప్పందాన్ని ఉభయ దేశాల ప్రధానుల సమక్షంలో భావోద్వేగాలమధ్య వాణిజ్యమంత్రులు అధికారులు 'ఎఫ్‌టిఎ'పై సంతకాలు చేశారు. యూకె నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే 90శాతం ఉత్పత్తులపై దశలవారీగాసుంకాల తగ్గింపునకు ఆమోదించారు. ఒప్పందం అమలులోకి రాగానే 64శాతం సుంకాల కోత ఉంటుంది. ఐ.టి ఆర్థిక, వృత్తిపరమైన ఆర్కిటెక్చర్ ఇంజినీరింగ్, విద్యాసేవల సంబంధితమై సుంకాలు తగ్గుతాయి. తాత్కాలిక ప్రాతిపదికపై యూకెకు వెళ్లే భారతీయ కార్మికులకు, వారి యాజమాన్యానికి, సామాజిక భద్రత సహకారాలకు మూడేళ్ల కాలం మినహాయింపు ఉంటుంది. ఆటోమేటిక్ రంగంలో సుంకాలను టారిఫ్ రేటు కోటా వ్యవస్థ కింద 100 శాతంనుంచి పది శాతానికి తగ్గుతాయి. కానీ విదేశీ దిగుమతులు మేక్ ఇన్ ఇండియా లక్ష్యాన్ని నష్ట పరుస్తాయనే విమర్శల మధ్య ఊగిసలాడుతోంది. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం పెంపులో భాగంగానే భారత్, యూకెల మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం కూడా సానుకూలపడే పరిస్థితి ఉంది. ఇకపై భారతీయులకువిదేశీ మద్యం చౌకధరకు దొరికే వీలుంది. రానున్న మూడేళ్లలో బ్రిటన్‌కు భారతీయ వ్యవసాయ ఎగుమతుల్లో 20 శాతం వృద్ధి చూస్తాం. భారతీయ వస్త్రాలు, పాదరక్షలు, వజ్రవైఢూర్యాలు, ఆభరణాలు సముద్ర ఆహార ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులకు యూకెలో ఎలాంటి సుంకాలు లేకుండా విక్రయించుకోవచ్చు. భారత్, బ్రిటన్ భాగస్వామ్యంలో'విజన్ 2035'లక్ష్యంగా సాగుతున్నందున వీలైనంతమేరకుప్రయోజనాలు పరస్పరం అనుభవించే వీలుంది. భారతవిమానయాన సంస్థలలో రూ.58వేల కోట్లఒప్పందం చేసుకున్నారు. బ్రిటన్‌కు చెందిన 26 సంస్థలు ఒప్పందాలలో భాగస్వాములయ్యాయి. ఈఒప్పందంతో భారత్‌కు విమానాలు ఇంజన్లు దక్కుతాయి. అనేక బ్రిటన్ సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యాయి. ప్రపంచ దేశాల మధ్య శాంతిని నెలకొల్పే విషయంలో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతాయన్న ఆశాభావం ప్రధానిమోడీనుంచి వ్యక్తమయింది. పహల్గాం ఉగ్రవాద విషయంలో బ్రిటన్ వైఖరి భారత్‌ను సంతోషపరిచింది. అనంతరంనాలుగేళ్లుగా సాగినప్రతిపాదనలు ఇంతవేగిరంగా స్వేచ్ఛావాణిజ్యఒప్పందాలకు ఉభయదేశాలు వడివడిగా ముందుకొచ్చాయి.

కష్టాలను తప్పించుకునే వారికంటే, వాటిని అధిగమించే వారే విజయం సాధించగలరు.



మహాత్మా గాంధీ

నువ్వెంత కష్టపడి పని చేస్తున్నావో చెప్పొద్దు. ఏం పని పూర్తయిందో చెప్పు.



బెర్నార్డ్ షా

# ప్రజావాక్కు

### కుబేర తరహా కుంభకోణమా?

ఈ మధ్యనే వచ్చిన 'కుబేర' చిత్రంలో బిచ్చగాళ్లను మోసగించినట్టు చూపితే, ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు కేంద్రంగా నిరుపేదలను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపి బ్యాంకు నుంచి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన తీరు చూస్తుంటే చాలా దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. యాక్సిస్ బ్యాంకు కేంద్రంగా చోటు చేసుకున్న ఈ కుంభకోణంలో అమాయకులైన దళితులు, గిరిజనులకు రుణాలను ఇప్పిస్తామంటూ కొంత మంది వ్యక్తులు మోసగించి నట్టు ప్రాథమిక సమాచారం. తొలుత 56 మందిని మోసగించి, రూ. 20 కోట్ల నుంచి రూ.30 కోట్లు స్కామ్ చేశారని భావించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం వందల కోట్లు దాటిందనే పత్రికల కథనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. బ్యాంకులు, బ్యాంకింగేతర సంస్థల్లో లక్షలాది మోసపూరిత ఖాతాలు పెరగడంపై ఆర్.బి.ఐ. తరచూ ఆందోళన వ్యక్తం చేయడం మినహా కార్యాచరణ లేకపోవడం ప్రమాదకరం.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### పిల్లలపై డిజిటల్ దుష్ప్రభావం

ఇప్పటి డిజిటల్ యుగంలో మొబైల్స్, ట్యాబ్‌లు, టీవీలు వంటి గ్యాడ్జెట్ల వాడకం పిల్లలజీవితంలో భాగమైపోయింది. అయితే దీనివల్ల వారి ఆరోగ్యంపై, చదువుపై, ప్రవర్తనపై అనేక దుష్ప్రభావాలు కనిపిస్తున్నాయి. ఎక్కువ సమయం స్క్రీన్ ముందు గడపడం ద్వారా కంటిచూపు సమస్యలు, శారీరకజడత్వం పెరుగుతోంది. ఆన్‌లైన్ గేమ్స్, యూట్యూబ్ వీడియోలు వంటి వినోదాల వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గుతోంది. అలాగే, సోషల్ మీడియా వల్ల పిల్లల్లో అసహనం, ఒత్తిడి ఏర్పడుతోంది. ఆత్మవిశ్వాసం తగ్గుతుంది కొన్నిసార్లు. డిజిటల్ ప్రపంచానికి పరిమితి ఉండాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### గుర్తింపు కార్డులు ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అటెండర్ స్థాయి నుండి జిల్లా కలెక్టర్‌స్థాయి వరకు అధికారులకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వంతరఫున గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి. గుర్తింపుకార్డులలో ఉద్యోగికి సంబంధించిన పూర్తివివరాలను స్పష్టంగా ఉండే విధంగా చూడాలి. ఐడి నంబరు, పేరు, ఫోన్ నెం. ఉండాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### యూరియా కొరతతో అన్నదాత ఆగమాగం

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో యూరియా కొరత వల్ల రైతులు నానా యాతన పడుతూవున్నారు. సహకార సంఘాల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. ఉదయమే క్యూలైన్‌లో పాసుబుక్కులు పెట్టిన రైతులు వర్షాలతో రాళ్లను పెట్టి నిరీక్షిస్తున్నారు. యూరియా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామనిప్రభుత్వం చెబుతున్నప్పటికీక్షేత్రస్థాయిలో మాత్రం అది కనబడటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతులువరి, మొక్కజొన్న పంటలను ఎక్కువ మొత్తంలో సాగుచేశారు. యూరియా అవసరం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బారులు తీరుతున్నారు. యూరియా బస్తాలు తక్కువగా ఉండటంతో రైతులంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు సరిపడా యూరియాను సరఫరా చేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా

### ఉచిత వైద్యం కల్పించాలి

కేంద్రప్రభుత్వం సుమారు ఏడాది క్రితం ఘనంగా ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ కార్డులు తెలంగాణా రాష్ట్రంలో అయితే ఇంతవరకు జారీకాలేదు. మీ సేవ వారికి కూడా ఏ విధమైన సమాచారంలేదు. ఆధార్‌కార్డు ద్వారా కె.వై.సి.తీసుకుంటే హాస్పిటల్ వాళ్లు దానిని వైద్యానికి ఒప్పుకుంటారని అంటున్నారు. ఇంతవరకు ఆ పత్రాలను చూపించి వైద్యం చేయించుకున్న వాళ్లెవరు తారసపడలేదు. మరొక విషయ మేమంటే ఈ ఆరోగ్య పథకం ఎమర్జెన్సీలో హాస్పిటల్‌లో చేర్చుకున్న వారికే వర్తింస్తుందట. అవుట్ పేషంట్లకు ఈ పథకం పనికిరాదట. ఆపైన ఈ5లక్షల పథకం ఏడాదికి భార్యా భర్తలకు కలిపి ఉంటుందట. కేవలం ఆధార్ కార్డు ద్వారా 70 ఏళ్లుదాటిన వారందరికి ఏఅడ్డంకులు లేకుండాసూచించిన వైద్య శాలల్లో ఉచిత వైద్యం కల్పిస్తే ఏ గందరగోళం ఉండదు కదా!

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### కల్తీ విత్తనాలను అరికట్టాలి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ఫర్టిలైజర్ యాజమాన్యసంస్థలు రైతులకు అందించే విత్తనాలపైదృష్టిసారించి నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులు మోసపోకుండా చూడాలి. అదేవిధంగా అధిక ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకోవాలి. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సబ్సిడీకి ప్రభుత్వమే అందించే ప్రయత్నం చేయాలి.

-ఎం.సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

మన వివి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సంక్షోభంలో యువజనం!

**దేశ ప్రగతికి పట్టుకొమ్మలైన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత పరిస్థితి మరింత దారుణంగా తయారవుతున్నది. చదివిన చదువుకు తగినట్టుగా ఉపాధి దొరక్కపోయినా, జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకోని దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, కొన్ని ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసి గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ పనులకు వెళ్లలేక ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో విధిలేక వెళ్లినా అలవాటులేని కష్టం చేయలేక దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. పనిచేసే శక్తి ఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేథాశక్తి ఉంది. కష్టపడి పనిచేయాలన్న ఉత్సాహం ఉంది. సంఘంలో తమకు ఒక స్థానం కల్పించుకోవాలన్న తపన ఉంది. కానీ ఏ ఆధారం లేక, నిరుత్సాహంగా అర్థాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు.**

దామెర్ల సాయిబాబ

చేయబోయే పనిని గూర్చి తెలుసుకోవడం వివేకం. ఎలా చేయాలో తెలుసుకోవడం నైపుణ్యం. పూర్తి చేయడం సామర్థ్యం. ఈ మూడింటిలోనూ సాఫల్యం చెందితేనే పరిపూర్ణత లభిస్తుంది, అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతాం. ఇది వ్యక్తులకైనా, సంస్థలకైనా, ప్రభుత్వాలకైనా వర్తిస్తుంది. దేశంలో కోట్లాది మంది యువతీయువకులు నిరాశానిస్పృహలతో నీరసించిపోతున్నా రనేది పెద్దలకు తెలియంది కాదు. వారిలో నూతనోత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించి కార్యోన్ముఖులను చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి కూడా పెద్దలకు క్షుణ్ణంగా తెలుసు. కానీ ఆ వైపు అడుగులు పడడం లేదు. రాజకీయ నాయకులు ఎప్పుడూ రాబోయే ఎన్నికల గురించే ఆలోచిస్తే రాజనీతిజ్ఞులు భావితరాల భవిష్యత్తు గురించి మదనపడతారు. అధునాతన ప్రపంచంలో కాలాన్ని మించిన వేగంతో శాస్త్రసాంకేతిక రంగాలు పురోగమిస్తున్నాయి. ఆధునిక మానవుడు అపూర్వమైన మేథాసంపత్తిని సంతరించుకొని శక్తియుక్తులు, ప్రతిభాసామర్థ్యాలతో విశ్వాంతరాలపై సాధిస్తున్న విజయాల వెనుక యువశక్తి పాత్ర అత్యంత కీలకమైనదని నేతలు వక్కాణిస్తుంటారు. నవభారత నిర్మాణానికి ఉద్యమించి దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేయాల్సిన పవిత్ర బాధ్యత యువత భుజస్కంధాలపై ఉందని పెద్దలు పదేపదే సెలవిస్తుంటారు. కాగితాలపై కళా విన్యాసంతో ఈ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదని పల్లెపల్లెల్లో ప్రతి బస్తీలోనూ స్థితిగతులను చక్కదిద్ది ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా యువజనులందరినీ కలిపి ఐక్యంతో కృషిచేస్తే దేశానికి ఉజ్వల భవిష్యత్ సుసాధ్యమవుతుందని పాలకులందరికి తెలిసిందే. ఇందుకోసం అనేక పథకాలు కూడా ప్రవేశపెట్టారు. కానీ ఆ పథకాల అమల్లో అవినీతికి, అవతవకలు తావులేకుండా చేయలేకపోతున్నారు. మారిన కాలానుగుణంగా పరిస్థితుల దృష్ట్యా ముఖ్యంగా విద్యావిధానంలో మార్పు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టంగా తెలిసినా ఆ కోణంలో చర్యలు చేపట్టలేకపోతున్నారు. చాలా మంది విషయంలో చదివే చదువుకు జీవనోపాధికి సంబంధం లేకుండాపోతున్నది. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన విద్యార్థులు ఎందరో హోంగార్డు, పోలీసు లాంటి ఉద్యోగాలకు వెళ్తున్నారు. ఏదో ఒకరిద్దరు కాదు. వందలసంఖ్యలో ఈ నియామక పరీక్షలకు హాజరవుతున్నారు. అంతేకాదు ఆ ఉద్యోగాల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసేందుకు కూడా సిద్ధపడుతున్నారు. దళారుల చేతుల్లో మోసపోయిన వారెందరో ఉన్నారు. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగం అనేది ఒక బంగారు కొలువుగా మారిపోయింది. ఆ ఉద్యోగంలో చేరితే ఆ కుటుంబానికి ఆరోగ్య, ఆర్థిక సెక్యూరిటీ లభిస్తాయనే ఆశలు పెరిగిపోయాయి. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్రాల పాలకులు ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రకటనలు ఇస్తున్నారు. కొంతమేరకు నియామకాలు కూడా జరుగుతున్నాయి. ఈ ఉద్యోగాల కోసం గ్రామాల్లో ఉన్న యువత పట్టణాలకు చేరుకొని కోచింగ్ సెంటర్ల బాటపడుతున్నారు. వేలాది రూపాయలు వ్యయం చేస్తున్నారు. దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొన్ని కోచింగ్ సెంటర్లు తమ శక్తి కొలదీ ప్రయత్నాలు చేస్తున్నాయి. పరీక్షలు ఆలస్యమయ్యే కొద్దీ ఈ కోచింగ్ సెంటర్లకు అంతగా లక్ష్మీప్రసన్నం ఉంటుంది. మరోకపక్క ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా దళారుల ప్రమేయానికిఆస్కారం లేకుండా ఈ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వాలు చేస్తున్నా, శతకోటి దారిద్ర్యాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఈ దళారులు ఏదో ఒక రూపంలో

ఒక్క మాట

ఎక్కడో ఒక చోట చొచ్చుకుపోయేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత గతంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు సంబంధించి భారీ కుంభకోణమే జరిగింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగాలే ప్రశ్నపత్రాలు అమ్ముకున్న విషయం వెలుగు చూసింది. ఆ కేసుకు సంబంధించి వందమందికిపైగా అటు ఉద్యోగులను, ఇటు ప్రశ్నపత్రాలను అందుకున్న అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేశారు. కేసు నడుస్తున్నది. అనేక రాష్ట్రాల్లో ఈ పరీక్షాపత్రాల వ్యాపారం జోరుగానే జరుగుతున్నట్లు గతంలో వెలుగు చూసిన సంఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే కేవలం ఐదారుశాతం మందికి ఉద్యోగాలు కల్పిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. దేశంలో ప్రభుత్వ కొలువుల కోసం ఎదురు చూస్తున్న కోట్లాది మంది యువతీయువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం అనేది సాధ్యమయ్యే పనికాదు. అలా కోరుకోవడం కూడా ఏమాత్రం సమంజసం కాదు. పోనీ స్వయం ఉపాధి పథకాలేమైనా అవకతవకలకు, అవినీతికి దూరంగా నడుస్తున్నాయంటే అదీలేదు. ఉత్తరమో, దక్షిణో లేకుండా ఫైళ్లు కదలని పరిస్థితి. రాజకీయ అండైనా లేక లక్ష్మీప్రసన్నలైనా ఉండాలి. అందుకే యువజన శక్తులే దేశాభివృద్ధికి బాటలు అంటూ ఉపన్యాసాలు ఇస్తూ దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయలు యువజన సంక్షేమం కోసం వెచ్చిస్తున్నట్లు ప్రకటిస్తున్నా ఆశించిన ఫలితాలు కన్పించడం లేదు. యువజనుల్లో రోజురోజుకు నిరుత్సాహం పెరిగిపోతున్నది. నిరక్షరాస్యులైన యువకులే కాదు ఉన్నత చదువులు అభ్యసించిన వారు కూడా నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా దేశ ప్రగతికి పట్టుకొమ్మలైన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత పరిస్థితి మరింత దారుణంగా తయారవుతున్నది. చదివిన చదువుకు తగినట్టుగా ఉపాధి దొరక్కపోయినా, జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకొని దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, కొన్ని ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసి గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ పనులకు వెళ్లలేక ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో విధిలేక వెళ్లినా అలవాటులేని కష్టం చేయలేక దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. పనిచేసే శక్తి ఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేథాశక్తి ఉంది. కష్టపడి పనిచేయాలన్న ఉత్సాహం ఉంది. సంఘంలో తమకు ఒకస్థానం కల్పించుకోవాలన్న తపన ఉంది. కానీ ఏఆధారం లేక, నిరుత్సాహంగా అర్ధాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు. ఇకపోతే మెడికల్, ఇంజినీరింగ్ చేసి మెరికల్లాంటి యువతీయువకులు ఇంతకాలం విదేశాలకు వెళ్లిపోయి తమ విజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకొని అక్కడే సేవలు అందిస్తున్నారు. అక్కడికి వెళ్లాలనే ఆరాటపడే వారి సంఖ్యకూడా తక్కువేమీకాదు. ఇప్పుడు అక్కడి పరిస్థితులు కూడా అయోమయంగా మారిపోయాయి. అమెరికా దేశ అధ్యక్షుడుగా ట్రంప్ రెండోసారి గెలిచిన తర్వాత స్థానికులకే ఉద్యోగాల్లో ప్రాధాన్యత అంటూ గళమెత్తారు. మొన్న బుధవారం వాషింగ్టన్‌లో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సులో ఆయన ఏకంగా భారతీయులను ఉద్యోగాల్లో నియమించుకోవద్దని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఎంతో మంది అమెరికా నుండి భారత్‌కు వచ్చారు, వచ్చేస్తున్నారు. అక్రమ వలసదారుల పేరుతో మరెందరినో గొలుసులు వేసి విమానాల్లో ఎక్కించి పంపుతున్నారు. అక్కడ ఉన్నవారికే పరిస్థితి అలా ఉంటే కొత్తగా వెళ్లాలనుకునేవారికి అవకాశాలు దాదాపు మూసుకుపోయినట్లే చెబుతున్నారు. ఇంకొకపక్క ఆస్ట్రేలియాలో కూడా పరిస్థితి ఏమాత్రం బాగాలేదు. గతవారంలో భారత సంతతికి సంబంధించిన ఒక యువకుడిని హత్యచేయగా, దేశంనుంచి వెళ్లిపోమంటూ పోస్టర్లు వేస్తున్నారు. ఇక ఇరాన్, ఇరాక్, ఇజ్రాయెల్ తదితర దేశాల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. యుద్ధాలతో అవి అతలాకుతలం అవుతున్నాయి. ఉద్యోగాల సంగతి దేవుడెరుగు. అక్కడ చదువుకుంటున్న విద్యార్థులను సైతం స్వదేశాలకు తరలించారు. మరోకపక్క ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసంచేసే కార్యక్రమాలు దేశంలో నిరాటంకంగా జరుగుతున్నాయి. పాలకులకు ఈ విషయాలన్నీ తెలియనివి కావు. ఇదంతా లేత మనసులపై చెరగని ముద్ర వేస్తున్నది. సమాజంపై ప్రేమ అభిమానం ఉన్న యువకులే పగ, ద్వేషంతో రగలిపోతున్నారు. మరికొందరు నిస్సహాయస్థితిలో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు కళ్లుతెరవాలి. యువతీయువకుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి. ఇందుకు ముఖ్యంగా ప్రభుత్వ వైఖరిలో మార్పు రావాలి. కనీసం యువతీయువకుల సంక్షేమం కార్యక్రమాలు, ఉద్యోగాల నియామకాల్లో త్రికరణశుద్ధిగా అవినీతికి అవకాశం లేకుండా వ్యవహరించగలిగితే కొంతమేరకైనా లక్ష్యం సాధించే అవకాశాలు ఉంటాయి. •

# నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించేవారెవరు?

డి. అశోక్

పిల్లల భద్రత కోసం తల్లిదండ్రులు ప్రతి రోజూ పరితపిస్తూ ఉంటారు. స్కూల్ బస్సులు, ఆటోలు, వ్యాన్లకు వేల రూపాయలు వెచ్చించి తమ బిడ్డలను దూర ప్రాంతాల స్కూళ్లకు పంపించే తల్లిదండ్రులు, వాళ్లు సురక్షితంగా తిరిగివస్తారన్న నమ్మకంతోనే ఆ నిర్ణయంతీసుకుంటారు. కానీ ఆ నమ్మకాన్ని కొన్ని నిస్సహాయ పరిస్థితులు భగ్నం చేస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు దీనికి నిదర్శనంగా మారాయి. తనిఖీల్లో భయానక వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. స్కూల్ బస్సులు నడిపే 14 మంది డ్రైవర్లు, విద్యార్థులను తరలించే 26 మంది ఆటో డ్రైవర్లు మద్యం సేవించిన స్థితిలో వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. ఓ డ్రైవర్ రక్తంలో ఆల్కహాల్ స్థాయి నిబంధనల కంటే 13 రెట్లు అధికంగా ఉండటం, అతడు ఇలా వాహనం నడపడం నాకు కొత్త కాదు అని నిర్లక్ష్యంగా చెప్పడం గమనార్హం. ఈ సంఘటనలు పిల్లల ప్రాణాలను ఏ స్థాయిలో ప్రమాదంలోకి నెట్టుతున్నాయో స్పష్టంగా చూపిస్తున్నాయి. డ్రైవర్లు తాగిన మత్తులో వాహనాలు నడపడం కేవలం వ్యక్తిగత బాధ్యతాలోపం కాదు. ఇది యాజమాన్యాల నిర్లక్ష్యానికి స్పష్టమైన ఉదాహరణ. స్కూల్ యాజమాన్యాలు డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితిని, మద్యపానం వంటి అలవాట్లను కచ్చితంగా తనిఖీ చేయాల్సిన బాధ్యత కలిగి ఉన్నప్పటికీ, చాలా చోట్ల అది జరగడం లేదు. ఓ చిన్న అప్రమత్తత పిల్లల ప్రాణాలపై తీవ్రప్రభావాన్ని చూపుతుంది. 2022లో దేశవ్యాప్తంగా డ్రంకన్ డ్రైవ్‌వల్ల 10వేలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 4,201మంది ప్రాణాలు కోల్పోయారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గత కొన్ని సంవత్సరాల్లో 83వేల డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 18వేలకి చేరిన ఈ కేసులు, పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో తెలుపుతున్నాయి. విశాఖపట్నంలో 2023తో పోల్చితే డ్రంకన్ డ్రైవ్ కేసులు 58 శాతం పెరగడం, ఇతర పట్టణాల్లోనూ ఇలాంటి వృద్ధి నమోదవడం కళ్లెదుట నడిచే ప్రమాద ఘట్టాల వైనాన్ని గుర్తు చేస్తోంది. తాగి వాహనం నడిపిన వ్యక్తులపై ఇప్పటికీ తక్కువ ఫైన్‌లు, కొన్ని రోజులు లైసెన్స్ సస్పెన్షన్ వంటి చర్యలు మాత్రమే తీసుకుంటున్నాం. కానీ అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో ఇటువంటి చర్యలు అత్యంత కఠినంగా ఉంటాయి. మరణాలు కలిగిస్తే 15నుంచి 20ఏళ్లవరకు జైలుశిక్ష విధిస్తారు. అటువంటి శిక్షలు వందల మంది జీవితాలను కాపాడే అవకాశాన్ని ఇస్తాయి. అందుకే భారత్‌లో కూడా శిక్షల తీవ్రతను పెంచేలా కొత్త చట్టాలను తేవాల్సిన అవసరం ఉంది. డ్రంకన్ డ్రైవ్‌ను ఆదాయ వనరుగా చూడడం మానేయాలి. మద్యం వలన ఎన్నో కుటుంబాలు విడిపోతున్నాయి. పిల్లలు అనాథలవుతున్నారు. ఇది సామాజిక సమస్యగా మారుతోంది. ట్రాఫిక్ పోలీసులు వారాంతాల్లో మాత్రమే కాకుండా ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించాలి. హైవేలపై గణనీయంగా శ్వాస విశ్లేషణ పరీక్షలు జరగాలి. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపితే, అతడి లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దుచేయాలి. స్కూల్ యాజమాన్యాలు డ్రైవర్లపై పోలీసు వెరిఫికేషన్ చేయడం తప్పనిసరి చేయాలి. పిల్లల భవిష్యత్తు కంటే విలువైనది మరొకటి లేదు. ప్రతి తాగిన డ్రైవర్ స్కూల్ బస్సు స్టీరింగ్ పట్టుకున్నప్పుడు అది కేవలం చట్ట ఉల్లంఘన కాదు, ఒక కుటుంబంపై జరిగిన దాడి. సమాజంగా మనం మేలుకోవాలి. చట్టాలను కఠినతరం చేయాలి. •

# నామినేటెడ్ సభ్యుల ఎంపికలో కొత్త ఒరవడి

యేచన్ చంద్రశేఖర్

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 80, క్లాజ్ (1), సబ్ సెక్షన్ (ఎ) ప్రకారం, కళ, సాహిత్యం, సాంకేతిక విజ్ఞానం, సామాజిక సేవా రంగాలలో గణనీయమైన కృషి చేసిన 12 మంది సభ్యులను రాజ్య సభకు నామినేట్ చేసేందుకు రాష్ట్రపతికి అధికారం కల్పించింది. రాష్ట్రపతి, రాజ్యాంగం ద్వారా తనకు సంక్రమించిన అధికారాన్ని వినియోగించుకుంటూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని మంత్రి మండలి సిఫార్సుల మేరకు గతంలో నామినేట్ చేయబడి పదవీ విరమణ చేసిన సభ్యుల స్థానాలను భర్తీ చేయడానికి ఉజ్వల్ నికమ్, సి సదానందన్ మాస్టర్, హర్ష్‌వర్ధన్ ష్రింగ్లా, డాక్టర్ మీనాక్షిజైన్‌లను రాజ్యసభకు నామినేట్ చేసినట్లు జూలై 12, 2025 నాడు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు తప్ప నామినేటెడ్ సభ్యులు ఎన్నికైన ఎంపీలు అనుభవించే అన్ని అధికారాలు, హక్కులకు అర్హులు. గత దశాబ్ద కాలంలో, ప్రత్యేకించి రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేసే 12 మంది సభ్యుల విషయంలో, గణనీయమైన మార్పు గోచరిస్తోంది. రాజకీయాలకు దూరంగా విభిన్న దృక్పథాలతో వివిధ రంగాలలో తమ నైపుణ్యాలతో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని ఎగువ సభలోకి ఆహ్వానించి వారి అనుభవం నుండి ప్రయోజనం పొందడానికి నామినేషన్ పద్ధతి ప్రవేశపెట్టబడింది. ఇటీవలకాలంలో రాష్ట్రపతి ద్వారా రాజ్యసభకు నామినేట్ చేయబడే సభ్యుల ఎంపికలో స్వాగతించదగ్గ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో మాదిరిగా రాజకీయ లబ్ధి కోసమో లేదా సెలెబ్రెటీలు, డబ్బు పరపతి ఉన్న వ్యక్తులనో రాజ్యసభకు నామినేట్ చేసే ఒరవడి కాస్త తగ్గుముఖం పట్టి భారతదేశ సాంస్కృతిక గుర్తింపును పరిరక్షించడంలో వారి కృషికి గుర్తింపు పొందిన వారిని నామినేట్ చేయడంపై ప్రాధాన్యత పెరుగుతోంది. ఇది ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నామినేట్ చేసిన నలుగురు సభ్యుల విషయంలో స్పష్టంగా వెల్లడవుతోంది. ఈ నలుగురిలో ఉజ్వల్ దేవరావు నికమ్ ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్. ఆయన కీలకమైన క్రిమినల్ కేసులను విచారించడంలోపేరుగడించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆయన నిర్వహించిన కీలక కేసుల్లో 26/11 ముంబై ఉగ్రవాద దాడి విచారణ ఒకటి. ఈ కేసులో ప్రాణాలతో పట్టుబడ్డ ఏకైక ఉగ్రవాది అజ్మల్ కసాబ్‌కు ఉరిశిక్ష పడేలా వ్యాజ్యం నడిపిన తీరు ఆయన న్యాయవాద వృత్తి నైపుణ్యానికి, నిబద్ధతకు నిదర్శనం. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన ప్రాతినిధ్యం వహించిన కేసులలో 1991 బాంబే బాంబు పేలుళ్ల కేసు, 1993 ముంబై వరుస పేలుళ్ల కేసు2003 గేట్‌వే ఆఫ్ ఇండియా బాంబు దాడులు కేసు ఉన్నాయి. ఇవి కాకుండా ప్రధాన కేసుల్లో కూడా నికమ్ వాదించారు.



ప్రముఖ గూర్ఖా వ్యక్తులలో ఒకరైన హర్ష్‌వర్ధన్ ష్రింగ్లా డార్జిలింగ్ కొండ ప్రాంతానికి చెందినవారు. ఆయన 2020 నుండి 2022 వరకు భారత విదేశాంగ కార్యదర్శిగా పనిచేశారు. 2019-2020లో అమెరికాలో భారత రాయబారిగా కూడా పనిచేసిన ఆయన 2019లో అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన హౌడీ మోడీ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి పనిచేశారు. 2023లో భారతదేశ జి20 అధ్యక్ష పదవికి ఆయన చీఫ్ కోఆర్డినేటర్ కూడా పనిచేశారు. విదేశాంగ విధానం దౌత్యంలో విస్తృత అనుభవం కలిగిన ష్రింగ్లా యునైటెడ్ స్టేట్స్, థాయిలాండ్ రాయబారిగా, బంగ్లాదేశ్‌కు హైకమిషనర్‌గా కూడా పనిచేశారు. కోవిడ్19 మహమ్మారి సమయంలో ష్రింగ్లా భారతదేశ దౌత్య కార్యకలాపాలకు నేతృత్వం వహించడంతో పాటు చైనాతో సరిహద్దు ఉద్రిక్తతలు వంటి సున్నితమైన సమస్యల పరిష్కారానికి కృషి చేసారు. వ్యూహాత్మక ఆలోచనా ధోరణితో మేధోపరమైన సహకారం అందించగల ఆయన నైపుణ్యం, సంక్లిష్టమైన దౌత్య సవాళ్లను నిర్వహించగల ఆయన సామర్థ్యం పార్లమెంటరీ కార్యకలాపాలను సుసంపన్నం చేస్తాయనడంలో ఎలాంటి సంశయం లేదు. పద్మశ్రీ మీనాక్షిజైన్ ప్రస్తుతం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్‌లో (ఐసిఎస్‌ఆర్) సీనియర్ ఫెలో. భారతదేశంలో సాంస్కృతిక, మతపరమైన పరిణామాలపై విశేష పరిశోధనలు చేసారు. విద్య, సాహిత్యం, చరిత్ర రాజకీయ శాస్త్రంలో ఆమె చేసిన కృషి ముఖ్యంగా విద్యాపరమైన చర్చలను సుసంపన్నం చేసింది. భారతీయ వారసత్వం, మత సంస్కరణలు, ప్రస్తుత రాజకీయ పోకడలపై ఆమె అభిప్రాయాలు, లోతుగా పరిశోధించి జాతీయ ప్రాముఖ్యత కలిగిన చారిత్రక సమస్యలను పరిష్కరించిన రచనలు పార్లమెంటరీ చర్చలకు విలువైన రచనలుగా పరిగణించబడతాయి. 2014లో భారత ప్రభుత్వంచే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ సభ్యురాలిగా నామినేట్ చేయబడిన ఆమె సాహిత్యం విద్యా రంగాలలో చేసిన కృషికి 2020లో పద్మశ్రీఅవార్డును అందుకున్నారు. రాజ్య సభ సభ్యురాలిగా ఆమె నామినేషన్ భారతీయ చరిత్ర సంస్కృతి రంగంలో మేధోపరమైన కృషి మరియు పాండిత్యానికి గుర్తింపును ప్రతిబింబిస్తుంది. సదానందన్ మాస్టర్ రాజ్యసభ ఎంట్రీ కేరళ సుదీర్ఘ రాజకీయ హింస, ప్రతీకార హత్యల చరిత్రనుగుర్తు చేస్తుంది. హింస బెదిరింపులు అతని ఉత్సాహాన్ని ఏమాత్రం నిలువరించలేకపోయాయి. కమ్యూనిస్ట్ కుటుంబంలో జన్మించిన సదానందన్ మాస్టర్ తన కళాశాల రోజుల్లో సిపిఎం సభ్యుడిగా చురుకుగా ఉండేవారు. సిపిఎం నాయకులతో విభేదాల కారణంగా ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం పట్ల ఆకర్షితులైన ఆయన కొంతమంది స్నేహితులతో కలిసి, సిపిఎం బలమైన కోట అయిన మట్టన్నూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ యూనిట్‌ను ఏర్పాటు చేయగా ఆయనను కన్నూర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ బౌద్ధిక్ ప్రముఖ్‌గా నియమించారు. జనవరి 25, 1994న, 12 మంది సిపిఎం కార్యకర్తలు, ఆయన ప్రయాణిస్తున్న కారు నుండి బయటకు లాగి, రెండు కాళ్లను తెగనరికారు. అయితే, ఎన్నికైన నామినేట్ చేయబడిన సభ్యుల కూర్పుతో రాజ్యసభ ప్రధాన నిర్మాణం భారతదేశ పార్లమెంటరీ వ్యవస్థలో కీలకమైన అంశంగా పరిగణించబడుతుంది. •

# గాజాలో మరణరోదన..



## ఆకలితో పిట్టల్లా రాలుతున్న పిల్లలు

**గాజాసిటీ, జూలై 25:** గాజాలో పరిస్థితులు రోజురోజుకు దారుణంగా మారుతున్నాయి. ఎక్కడ చూసినా ఆకలి కేకలే. ఏడిస్తే కన్నీరు కూడా రాని పరిస్థితి. తిండి లేక అల్లాడుతున్న చిన్నారులు పిట్టల్లా రాలిపోతున్నారు. పోషకాహార లోపంతో నిత్యం వందలాది మంది పసి పిల్లలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఆహారం, ఔషధాలు లేక వైద్యులు చేతులెత్తేస్తున్నారు. ఇలా గడిచిన నాలుగు రోజులుగా గాజాలో అనేకమంది చిన్నారులు ఆకలికి బలయ్యారు. 'ఉత్తర గాజాలో ఉన్న పేషెండ్స్ ఫ్రెండ్స్ ఆస్పత్రిలో ఎన్నడూ లేని విధంగా చిన్నారుల చేరికలు ఉన్నాయి. నిత్యం 200 నుంచి 300 మంది చేరుతున్నారు. ఈ విపత్తును చూస్తుంటే మాటలు రావడం లేదు. శరీరం బక్కచిక్కి ఎముకలు మాత్రమే కనిపిస్తున్నాయి. పిల్లలు నడవడం, కనీసం ఏడవడానికీ ఓపిక లేదు. వారి పొత్తికడుపులు ముడుచుకుపోయాయి. వీరికి ఇవ్వడానికి ఆస్పత్రిలో సరైన పోషకాహారం కూడా లేదు. కొందరికి ఐసియులో చికిత్స అందిస్తున్నా ప్రాణాలను కాపాడలేకపోతున్నాం. ఇంతకంటే దారుణ, భయంకరమైన పరిస్థితి మరొకటి లేదు. మే కూడా అలసిపోయాం' అని అమెరికా స్వచ్ఛంద సంస్థ తరఫున డాక్టర్ రానా సోహోబ్ పేర్కొన్నారు. చిన్నారులకు పొటాషియం ఎంతో కీలకమని, కానీ, అది అందుబాటులో లేకపోవడంతో రానున్న రోజుల్లో మరిన్ని మరణాలు చూడక తప్పని దుస్థితి నెలకొందని వాపోయారు.

**లక్ష మందికి తక్షణ అవసరం:** లక్ష మంది మహిళలు, చిన్నారులకు అత్యవసర చికిత్స అవసరమని ఐరాసకు చెందిన ప్రపంచ ఆహార కార్యక్రమం విభాగం పేర్కొంది. చాలా కీలక చికిత్సలు ఆగిపోయాయని, అవసరమైన ఔషధాలు అయిపోనట్లు వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకలి చావులకు ఇది ఆరంభం మాత్రమే నని మెడ్‌గ్లోబల్ సహవ్యవస్థాపకుడు, గాజాలో వాలంటీర్‌గా పనిచేసిన డాక్టర్ జాన్ కహలెర్ పేర్కొన్నారు. గత మూడు వారాల్లో 48 పోషకాహార లోపం సంబంధిత మరణాలు చోటుచేసుకున్నాయని, వారిలో 28 మంది పెద్దలు, 20మంది చిన్నారులు ఉన్నారని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. గత ఐదు నెలల్లో 10 మంది చనిపోగా ఇప్పుడది వేగంగా పెరుగుతోందని తెలిపింది. మరోవైపు ఐదేళ్ల లోపు 21 మంది చిన్నారులు ఆకలి కారణంగా ప్రాణాలు కోల్పోయారని, జూలైలోనే 13 మంది చనిపోయినట్లు గుర్తించామని ఐరాస మానవతా సంస్థ ఒసిహెచ్ఎ తెలిపింది.

**ట్రక్కుల లూటీ:** ఐరాస అంచనా ప్రకారం గాజా వాసులకు నిత్యం 500-600 ట్రక్కు ఆహార పదార్థాలు అవసరం. కానీ, ప్రస్తుతం సరాసరి 69 ట్రక్కుల్లో మాత్రమే సరఫరా అవుతున్నట్లు ఐరాస చెబుతోంది. అయితే, వీటిని పంపిణీ చేయకముందే.. ఆహారం కోసం అల్లాడుతున్న పాలస్తీనా వాసులు ఆ ట్రక్కులపై దాడి చేసి లూటీ చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో రానున్న రోజుల్లో భారీగా ఆకలి చావులు నమోదయ్యే ప్రమాదం ఉందని, ఆయా దేశాలు తక్షణమే స్పందించి ఆహార పదార్థాలు సరఫరా చేయాలని 115 అంతర్జాతీయ మానవ హక్కుల, స్వచ్ఛంద సంస్థలు ఓ ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే.





## అటవీ అధికారి ఇంట్లో రూ.1.4 కోట్ల నగదు

### విజిలెన్స్ సోదాల్లో మరింతగా నగదు లభ్యం

**కోరాపుట్,జూలై 25:** ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో ఉన్న జేయ్‌పోర్ డిప్యూటీ రేంజర్ రామచంద్ర నేపాక్ ఇండ్లపై ఇవాళ విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టారు. ఆ తనిఖీల్లో ఆ ఆఫీసర్ ఇంట్లో సుమారు 1.4 కోట్ల నగదు దొరికింది. అతని అపార్ట్‌మెంట్‌లోని ఓ రహస్య ట్రెజరీలో ఆ నగదును దాచిపెట్టాడు. ఫారెస్ట్ ఆఫీసర్ రామచంద్ర నుంచి నగదుతో పాటు నాలుగు బంగారు బిస్కెట్లు, 16 బంగారు నాణాలు రికవరీ చేశారు. మొత్తం ఆరు ప్రదేశాల్లో ఇవాళ ఒడిశా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులను సంపాదించినట్లు ఆ ఆఫీసర్‌పై ఆరోపణలు ఉన్నాయి. విజిలెన్స్ శాఖ స్పెషల్ జడ్జి ఇచ్చిన సెర్చ్ వారెంట్‌తో అధికారులు ఆ ఆఫీసర్ ఇండ్లల్లో తనిఖీలు చేశారు. ఆరుగురు డీఎస్పీలు, అయిదుగురు ఇన్‌స్పెక్టర్లు, 9 మంది ఏఎస్ఐలు, ఇతర సిబ్బంది ఈ సోదాల్లో పాల్గొన్నారు. అన్ని చోట్ల నుంచి సుమారు 1.4 కోట్ల నగదును సీజ్ చేశారు. ప్రస్తుతం ఇంకా తనిఖీలు కొనసాగుతున్నట్లు అధికారులు చెప్పారు. సోదాలు ముగిసిన తర్వాత సమగ్రమైన ఇన్ఫర్మేషన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ాయ్‌పోర్ పట్టణంలోని గోల్డెన్ హైట్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ లో ఉన్న ఫ్లాట్ నెంబర్ 510లోని ఓ సీక్రెట్ లాకర్‌లో 1.4 కోట్ల నగదును సీజ్ చేసినట్లు ఒడిశా విజిలెన్స్ అధికారులు చెప్పారు.

## పూంచ్‌లో మందుపాతర పేలి అగ్నివీర్ మృతి



**పూంచ్, జూలై 25:** జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఎల్‌ఒసి వెంబడి మందుపాతర పేలడంతో ఒక ఆర్మీ జవాన్ శుక్రవారం ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఇండియన్ ఆర్మీకి చెందిన వైట్‌నైట్ కార్ప్స్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. 'కృష్ణ ఘాటి బ్రిగేడ్ జనరల్ ఏరియాలో పెట్రోలింగ్ చేస్తుండగా మందుపాతర పేలి 7-జాట్ రెజిమెంట్‌కు చెందిన అగ్నివీర్ లలిత్‌కుమార్ వీరమరణం పొందారు. ఆయన కుటుంబసభ్యులకు మేము అందగా నిలుస్తాం' అని వైట్‌నైట్స్ కార్ప్స్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ మిలటరీ చర్యలకు దిగు తూ ఎల్‌ఒసి వెంబడి పెద్దఎత్తున క్రాస్-బోర్డర్ షెల్లింగ్ జరిపింది. గత నెలలో రాజౌరి జిల్లా ఎల్‌ఒసి సమీపంలోని ఫార్వార్డ్ ఏరియాలో అనుమానాస్పద కదలికలు గుర్తించడంతో ఆర్మీకాల్పులు జరిపింది. పూంచ్, సాంబ, కథువా జిల్లాలతో సహా డజనుకుపైగా ఏరియాల్లో గాలింపు చర్యలు చేపట్టింది.

## విమానంలో సాంకేతిక లోపం

### వెనక్కి మళ్లించిన పైలట్లు!

**జైపూర్, జులై 25:** గగనతలంలోఉండగా ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. జైపూర్ నుంచి ముంబయి వెళుతున్న విమానం టేకాఫ్ అయిన 18 నిమిషాలకే సాంకేతిక సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు దాన్ని వెనక్కి మళ్లించారు. దాంతో అది బయల్దేరిన చోటే ల్యాండ్ కావాల్సి వచ్చిందని విమానాశ్రయ వర్గాలు వెల్లడించాయి. ఇటీవలి కాలంలో ఎయిరిండియా విమానాలు తరచూ వార్తల్లో నిలుస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో ప్రయాణికులు భద్రత విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల 188మంది ప్రయాణికులు, సిబ్బందితో ఉన్న ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య తలె త్తినట్లు అధికారులు పేర్కొన్నారు. మరో ఘట నలో హాంకాంగ్ నుంచి ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చిన ఎయిరిండియా ల్యాండింగ్ అయిన కాసే పటికే పవర్ యూనిట్‌లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైనసిబ్బంది ప్రయాణికులను వెంటనే కిందకు దించేయడంతో పెనుప్రమాదం తప్పింది.

# కుప్పకూలిన స్కూలు భవనం పైకప్పు

## ఏడుగురు చిన్నారులు మృతి, 28 మందికి తీవ్రగాయాలు



**జైపూర్,జూలై 25:** రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఝులావర్‌లోని పీప్లోడీ ప్రాథమిక పాఠశాల పైకప్పు ఒక్కసారిగా శుక్రవారం ఉదయం కుప్పకూలింది. దీంతో శిథిలాల కింద అనేక మంది విద్యార్థులు చిక్కుకుపోయారు. ఘటనలో ఏడుగురు చిన్నారులు చనిపోయారు. 28 మంది విద్యార్థులు గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. ఉదయం పిల్లలు తరగతులకు హాజరువుతుండగా ఘటన జరిగినట్లు తెలిపారు.అయితే ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన విద్యార్థులను చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. జేసీబీ సాయంతో శిథిలాలను తొలగించి, చిన్నారులను బయటకు తీశారు. ఆ విషయంలో స్థానికులు కూడా సహాయపడ్డారు. అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలను పరిశీలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనలో ఏడుగురు పిల్లలు మరణించగా, మరో 28 మంది గాయపడ్డారని పోలీసు సూపరింటెండెంట్ అమిత్ కుమార్ మీడియాకు తెలిపారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థులను ప్రత్యేక ఆరోగ్య కేంద్రంలో చేర్పించామని, కొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. పాఠశాల పైకప్పు కూలిన ఘటనలో ప్రాణనష్టం సంభవించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు.రాజస్థాన్‌లోని ఝులావర్‌లోని ఒక పాఠశాలలో జరిగిన ప్రమాదం విషాదకరం. తీవ్ర బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధిత విద్యార్థులు, వారి కుటుంబాలతో నా ఆలోచనలు ఉన్నాయని మోదీ తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. అధికారులు బాధిత వారికి అన్ని విధాలుగా సహాయం అందిస్తున్నారని తెలిపారు. మరోవైపు, పాఠశాల పైకప్పు కూలిన ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ విచారం వ్యక్తం చేశారు. చిన్నారులు మృతి చెందడంపై సంతాపం తెలిపారు. గాయపడిన పిల్లలకు సరైన చికిత్స అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఖిఖిమరణించిన వారికి దేవుని పాదాల వద్ద స్థానం దొరకాలి. అపారమైన దుఃఖాన్ని భరించే శక్తిని వారి కుటుంబాలకు దేవుడు ప్రసాదించాలని ముఖ్యమంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ కూడా స్పందించారు. ఈ విషాద ఘటన తనను ఎంతో బాధించిందని తెలిపారు. గాయపడిన చిన్నారులు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. వారి చికిత్సకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. భవనం పైకప్పు ఎలా కూలిపోయిందో తెలుసుకునేందుకు విచారణ జరిపిస్తామన్నామని వెల్లడించారు. గాయపడిన విద్యార్థులు త్వరగా కోలుకోవాలని మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ ఆకాంక్షించారు. శిథిలాల కింద మరికొందరు విద్యార్థులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, దీనిపై గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పుడు కూలిపోయి విషాదానికి దారి తీసిందని చెబుతున్నారు.

# రెండుదేశాలమధ్య రాజుకుంటున్న శివాలయాల వివాదం


## పరస్పర దాడులకు దిగుతున్న థాయిలాండ్, కాంబోడియా



**బ్యాంకాక్,జూలై 25:** ఆసియా దేశాలైన థాయ్‌లాండ్, కంబోడియాల మధ్య ఘర్షణలు యుద్ధం అంచుకు చేరుకున్నాయి. ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకోవడంతో ఇరుదేశాల బలగాలు ఫిరంగులు, రాకెట్లతో పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఘర్షణలకు సరిహద్దు వివాదాలే కారణమని చెబుతున్నా ఆ సరిహద్దుల్లోని హిందూ దేవాలయాల కోసం ఇరుదేశాలు ఎన్నో ఏళ్లుగా కొట్టుకుంటున్నాయి. ప్రధానంగా ప్రముఖ ఆలయాలు ఉన్న ప్రీహ్ విహార్, ట మోన్ థోమ్, ట మ్యూన్ థోమ్ ఉన్న పర్వతాలు, అరణ్యాలు కలగలిసిన ప్రాంతాల కోసం దశాబ్దలుగా ఇరుదేశాల మధ్య తీవ్ర పోరాటం జరుగుతోంది. ఈ ఆలయాల్లో శివలింగం, సంస్కృత లిపిలో శాసనాలు, హిందూ దేవతల చిత్రాలు ఉన్నాయి. థాయిలాండ్, కంబోడియా మధ్య 508 మైళ్ల సరిహద్దు ఉంది. దీనిలో అత్యధిక భాగాన్ని ఫ్రాన్స్ పాలన కింద ఉన్నప్పుడే గుర్తించారు. రెండు దేశాలు శాంతియుతంగా కలిసి ఉంటున్నప్పటికీ, సరిహద్దుల్లో మాత్రం తరచూ ఘర్షణలతో రగులుతున్నాయి. వీటిల్లో 9వ శతాబ్దానికి చెందిన ప్రీహ్ విహార్ కీలకమైంది. ఈ శివాలయాన్ని ఖెమర్ పాలకులు నిర్మించారు. డాంగ్రెక్ పర్వతాల శిఖరం థాయ్‌లాండ్‌కు అత్యంత సమీపంలో ఉంటుంది. ఈ ఆలయం కంబోడియాకు చెందుతుందని 1962లో అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దానిని థాయ్‌లాండ్ అంగీకరించింది. కంబోడియా విజ్ఞప్తి మేరకు 2008లో ఈ ఆలయాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. దీనిని థాయ్‌లాండ్ తీవ్రంగా వ్యతిరేకించింది. కంబోడియానాడు చూపిన మ్యాప్‌లో 4.6 చదరపు మైళ్లను ఆక్రమించుకొన్నట్లు ఆరోపించింది. అటు థాయ్‌లాండ్ దేశ పరిధిలోని సురిన్ ప్రావిన్స్‌లోని ట మోన్ థోమ్, ట మ్యూన్ థోమ్ ప్రాంతాలు కూడా ఇరుదేశాల మధ్య వివాదాస్పద ప్రదేశాలుగా ఉన్నాయి. థాయ్‌లాండ్ సురిన్ ప్రావిన్సులోని ప్రసాత్ ట మోన్ థోమ్ అనే మరో శివాలయం కోసం కూడా రెండు దేశాలు గొడవ పడుతున్నాయి. చారిత్రక ఆధారాల ప్రకారం ఈ శివాలయం తమకే చెందుతుందని కంబోడియా వాదిస్తోంది. అందుకు థాయ్‌లాండ్ అంగీకరించట్లేదు. శిథిలావస్థకు చేరిన ఈ ఆలయాలు రెండు దేశాల మధ్య వివాదంతో మరోసారి తెరపైకి వచ్చాయి. మరోవైపు థాయ్‌లాండ్, కంబోడియా మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన వేళ కేంద్రం అప్రమత్తమైంది. ఈ మేరకు థాయ్‌లాండ్‌లోని భారతీయులకు అడ్వైజరీ జారీ చేసింది. భారతీయ పౌరులు థాయ్‌లాండ్‌లోని ఏడు ప్రావిన్సులవైపు ప్రయాణాలు చేయద్దొని అక్కడి భారతీయ రాయాబార కార్యాలయం ప్రకటనను విడుదల చేసింది. ప్రస్తుత అస్థిర పరిస్థితుల దృష్ట్యా థాయ్‌లాండ్‌లో పర్యటించే భారతీయులు స్థానిక అధికారులు ఇచ్చే అప్‌డేట్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఎంబసీ సూచించింది. ఆ దేశ పర్యాటక శాఖ సూచించిన ప్రదేశాల్లో ప్రయాణాలకు దూరంగా ఉండాలని పేర్కొంది.


## ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎన్నికల అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్

**న్యూఢిల్లీ,జూలై 25:** నూతన ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం, తాజాగా రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీని నియమించింది. ఆరోగ్య సమస్యలను పేర్కొంటూ సోమవారం సాయంత్రం పదవికి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేయడంతో ఉప్పరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. న్యాయ మంత్రిత్వ శాఖతో సంప్రదించి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ సమ్మతితో 2025 ఉపరాష్ట్రపతి ఎన్నికలకు మోదీని రిటర్నింగ్ అధికారిగా నియమించినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. రాజ్యసభ సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ గరిమా జైన్, సెక్రటేరియట్ డైరెక్టర్ విజయ్ కుమార్‌లను సహాయ రిటర్నింగ్ అధికారులుగా నియమించింది.ఉప రాష్ట్రపతి ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లు పూర్తి కాగానే అతి త్వరలో షెడ్యూలు విడుదల చేస్తామని ఎన్నికల కమిషన్ బుధవారం తెలిపింది. నెల రోజుల్లో ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ పూర్తి కావొచ్చని తెలుస్తోంది. వాస్తవానికి ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు 10 వరకూ పదవీ కాలం ఉంది. కొత్త ఉప రాష్ట్రపతి మిగిలిన కాలానికి కాకుండా ఐదేళ్లపాటు పదవిలో ఉంటారు. అయితే దేశంలో ఇప్పటిదాకా 16 సార్లు ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగ్గా నాలుగు సార్లే ఏకగ్రీవమైంది. మిగిలిన 12 సార్లు పోటీ జరిగింది. ఇందులో రెండు ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పోటీ చేశారు. 2022లో కాంగ్రెస్ అభ్యర్థి మార్గరెట్ ఆల్వాను ఓడించి జగదీప్ ధన్‌ఖడ్ ఉప రాష్ట్రపతి అయ్యారు. ఈసారి బీజేపీ సీనియర్ నేతనే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీయే కూటమి ఖరారు చేస్తుందని తెలుస్తోంది. తొలుత బీహార్ సీఎం నీతీశ్ కుమార్‌తోపాటు మరో ఐదుగురు పేర్లు వినిపించినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. మరోవైపు, ఇండియా కూటమి తమ తరఫున ఒక ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలని యోచన చేస్తున్నట్లు సమాచారం. పార్లమెంట్‌లో ఇండియా కూటమికి మెజారిటీ లేకపోయినప్పటికీ ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకుంటూ ఉండడం గమనార్హం. ఫలితంతో సంబంధం లేకుండా బలమైన సందేశాన్ని పంపే ఉద్దేశంతోనే ప్రతిపక్ష పార్టీల కూటమి పోటీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.



## ఐదో రోజూ ఉభయసభల్లో గందరగోళం

### సోమవారానికి వాయిదాపడిన పార్లమెంట్



**న్యూఢిల్లీ,జూలై 25:** పార్లమెంట్ ఉభయ సభల్లో ఐదో రోజైన శుక్రవారం కూడా గందరగోళ వాతావరణం కొనసాగింది. బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండు చేస్తూ విపక్షాలు నినాదాలు చేయడంతో రభస ఏర్పడి సభా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. విపక్ష సభ్యుల నిరసనలతో ఉభయసభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. ఉభయ సభలు శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశమయ్యాయి. సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు ఆందోళనకు దిగారు. వాయిదా తీర్మానాలపై చర్చకు ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టాయి. ముఖ్యంగా బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చించాలని డిమాండ్ చేశాయి. సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. విపక్షాల ఆందోళనతో ప్రారంభమైన నిమిషాల్లో సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. ఎలాంటి చర్చా లేకుండానే మధ్యాహ్నం 2 గంటల వరకూ దిగువ సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఆతర్వాత సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అటు రాజ్యసభలోనూ అదే పరిస్థితి కొనసాగింది. సభ ప్రారంభంకాగానే సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు కమల్ హాసన్ ఎంపీగా రాజ్యసభలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత విపక్ష ఎంపీల నిరసనలతో సభ వాయిదా పడింది.



## డ్రోన్ ద్వారా మిస్సైల్ ప్రయోగం విజయవంతం

### ఎక్స్‌లో ఫొటోను పోస్టు చేసిన రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

**రాజంపేట, జూలై 25 ప్రభాతవార్త:** భారత్ సరికొత్త ఆయుధాలతో సత్తా చాటుతోంది. తాజాగా డ్రోన్ ద్వారా మిస్సైల్ ప్రయోగించే పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుజిల్లా ఓర్వకల్లు డిఆర్‌డిఓ కు కేటాయించిన టెస్ట్ సెంటర్‌లో డ్రోన్ నుంచి ప్రిసెషన్ గైడెడ్ క్షిపణిని విజయవంతంగా శుక్రవారం ప్రయోగించారు.డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ కర్నూలులో యుఏవి లాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ క్షిపణి (యు ఎల్ పి జి ఎం) వి3 పరీక్షలను నిర్వహించింది.ఈ ప్రయోగం విజయవంతం కావడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు.ఈ పరీక్ష భారతదేశ క్షిపణి సామర్థ్యాన్ని మరింత పెంచిందన్నారు. యుఎల్‌పిజిఎంని డీఆర్డిఓ యొక్క టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ లాబొరేటరీ అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్డీఓని అభినందించారు. ఈ మేరకుఎక్స్‌లో ఫొటోను రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్‌పోస్ట్‌చేశారు.క్షిపణి తయారీలో భాగస్వాములైనసంస్థలను రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు.

## భారత్ అత్యంత అప్రమత్తంగా ఉండాలి



### సిడిఎస్ అనిల్‌చౌహాన్

**న్యూఢిల్లీ, జూలై 25:** భారత్ 365 రోజులూ, 24 గంటలూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని సిడిఎస్ అనిల్‌చౌహాన్ హెచ్చరించారు. ఆయుధాలు ఇతర పరిజ్ఞానం గురించి మిలిటరీ పూర్తిగా అప్‌డేట్ అయి ఉండాలని అభిప్రాయపడ్డారు. యుద్ధాల గతి మారిపోతోందని సిడిఎస్ వెల్లడించారు. భవిష్యత్తులో దళాల్లో ఇన్ఫో-టెక్ తోపాటు స్కాలర్ వారియర్స్ కలగలిసి ఉంటాయన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని గుర్తు చేశారు. సుబ్రతోపార్క్‌లో జరిగిన డిఫెన్స్ సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. యుద్ధాల్లో రన్నరప్‌లు ఉండరని సిడిఎస్ అనిల్‌చౌహాన్ గుర్తు చేశారు. అందుకే సైన్యాలు అప్రమత్తంగా ఉంటూ ఏ క్షణమైనా ఆపరేషన్ చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. దీనికి ఆపరేషన్ సిందూర్‌నే ఆయన ఉదాహరణగాచూపారు.భారత మిలిటరీకి భవిష్యత్తులో ఇన్ఫర్మేషన్, టెక్నాలజీ,స్కాలర్ వారియర్స్ అవసరం చాలా ఉందని చెప్పారు. మారుతున్న పరిణామాల ఆధారంగా భవిష్యత్తు సైనికులు ఈ మూడు నైపుణ్యాల కలబోతగా ఉంటారని పేర్కొన్నారు. సైనిక దళాల్లో జరుగుతున్న మార్పుల మూడో విప్లవం కీలక దశలో మనం ఉన్నట్లు వెల్లడించారు. దానిని తాను కన్వర్జెన్సీ యుద్ధంగా అభివర్ణిస్తానన్నారు. ఇది కైనటిక్, నాన్-కైనటిక్ మిశ్రమంగా ఉంటుందన్నారు.



## పాకిస్థాన్‌లో వరదల బీభత్సం 266 మంది మృతి

**ఇస్లామాబాద్, జూలై 25:** పాకిస్థాన్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అనేక ప్రాంతాలు నీట మునిగాయి. వర్షాలు, వరదల కారణంగా జూన్ చివరి వారం నుంచి ఇప్పటి వరకు 266 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఎ) శుక్రవారం తెలిపింది. మృతుల్లో 126 మంది చిన్నారులే కావడం గమనార్హం. గత 24 గంటల్లో భీకర వర్షానికి 14 మంది ప్రాణాలు కోల్పోగా 17 మందికి గాయాలయ్యాయని ఎన్‌డిఎంఎ తాజా నివేదికలో పేర్కొంది. భారీ వర్షాలు, వరదల కారణంగా వేల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. వందలకొద్దీ మూగ జీవాలు ప్రాణాలు కోల్పోయాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో పాకిస్థాన్‌లోని పంజాబ్ గవర్నర్ సర్దార్ సలీమ్ హైదర్ పర్యటించి అక్కడి పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. కొండచరియలు విరిగిపడటంతో హరిపూర్‌లోని ఖాన్‌పూర్‌లో అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. జూన్‌లో రుతుపవనాల తాకిడి మొదలైనప్పటి నుంచే వరదలు తీవ్రమయ్యాయని అధికారులు తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు ఎన్‌డిఎంఎ అధికారులు తెలిపారు.

# సంక్షిప్తంగా..

## వృద్ధ తల్లితండ్రులను చూసుకునేందుకు అదనపు సెలవులు

### కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ వెల్లడి





**న్యూఢిల్లీ,జూలై 25:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సర్కారు శుభవార్త చెప్పింది. సంవత్సరంలో 30రోజులు అదనంగా సెలవులు తీసుకోవచ్చని చెప్పింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ రాజ్యసభలో ప్రకటించారు. ఉద్యోగులు ఆయా సెలవులను తమ వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకోవచ్చన్నారు. ఇందులో 20రోజుల హాఫ్ పే లీవ్, ఎనిమిది రోజుల క్యాజువల్ లీవ్, 2 రోజుల పరిమిత సెలవులు ఉన్నాయి. రాజ్యసభలో ఎంపీ సుమిత్రా బాల్మిక్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర సహాయమంత్రి జితేంద్ర సింగ్ సమాధానం ఇచ్చారు. సర్వీస్ రూల్స్ ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 30 రోజులు సెలవు తీసుకు నేందుకు అర్హులని ఈ సెలవులను వృద్ధ తల్లి దండ్రులను చూసుకునేందుకు, ఇతర వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగించవచ్చన్నారు.

## విమానం గాల్లో ఉండగానే ప్రయాణికుడి మృతి

### అత్యవసర లాండింగ్ తర్వాత మృతదేహం అదృశ్యం

**కాలిఫోర్నియా,జూలై 25:** విమానం గాల్లో ఉండగానే ఓ ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురై క్షణాల్లోనే ప్రాణాలు కోల్పోయాడు. అయితే పైలెట్లు విమానాన్ని అత్యసవరంగా ల్యాండింగ్ చేయాలనుకున్నా కుదరకపోవడం గమ్యస్థానానికి చేరాకే మృతదేహాన్ని కిందకు దించారు. కానీ ఆ తర్వాత నుంచి మృతదేహం కనిపించకుండా పోయింది. కాలిఫోర్నియాకు వెళ్తున్న టర్కిష్ ఎయిర్‌లైన్స్ విమానంలో చోటు చేసుకుంది. ముఖ్యంగా ఈనెల 13వ తేదీన టర్కిష్ ఎయిర్ లైన్స్ కు చెందిన టూకే79 విమానం ఇస్తాంబుల్ నుంచిశాన్‌ఫ్రాన్సిస్కోకు బయలుదేరింది. అయితే ఈ విమానం గాల్లో ఉండగానే ఓ ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అప్రమత్తమైన సిబ్బంది అతడి దగ్గరకు వెళ్లేలోపే అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈక్రమంలోనే విమానాన్ని ఇస్‌లాండ్‌లోని కెఫాలావిక్ విమానాశ్రయానికి మళ్లించేందుకు పైలెట్లు ప్రయత్నించారు. కానీ అది కుదరకపోవడంతో చికాగో ఎయిర్ పోర్టుకు మళ్లించి అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఆపై మృతదేహాన్ని కుక్ కౌంటీ మెడికల్ ఎగ్జామినర్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలుస్తోంది.కానీ ఎగ్జామినర్ కార్యాలయ ప్రతినిధి నటాలియా డెరెవ్యానీ టర్కిష్ ఎయిర్ లైన్స్ నుంచి తమకుఎలాంటి మృతదేహం లభించలేదని చెప్పారు.దీంతో విమానం ల్యాండింగ్ తర్వాత ఏంజరిగింది, అసలా మృతదేహం ఏమైందనే దానిపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## యూట్యూబ్ చూసి బరువుతగ్గే ప్రయత్నంలో విద్యార్థి మృతి

**చెన్నై,జూలై 25:** యూట్యూబ్ చూసి బరువు తగ్గడానికి ప్రయత్నించిన ఒక విద్యార్థి మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. గత మూడు నెలలుగా బరువు తగ్గడానికి కేవలం పండ్ల రసం తాగుతూ వ్యాయామం చేస్తున్న ఆ విద్యార్థి ఊపిరాడక కుప్పకూలిపోయి విషాదకరంగా మరణించాడు. కన్యాకుమారిలోని బర్నత్రిలైకి చెందిన శక్తిశ్వర్ అనే 17 ఏళ్ల యువకుడు స్థానికంగా ఉన్న ఇంటర్ కాలేజ్‌లో సెకండ్ ఇయర్‌లో ఉత్తీర్ణత సాధించి ఇంజనీరింగ్ కళాశాలలో చేరడానికి సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో శక్తిశ్వర్ ఇంట్లో అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే స్థానికి హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు చనిపోయినట్టు నిర్ధారించారు.

## సరిహద్దు సమస్యలపై సమగ్ర దౌత్య చర్చలు

**న్యూఢిల్లీ,జూలై 25:** భారత్, చైనా మధ్య ఉన్న సరిహద్దు సమస్యలపై నిజాయితీగా దౌత్య చర్చలు జరిగాయని చైనా పేర్కొంది.ఇరుదేశాలు తమ మధ్య ఉన్న సరిహద్దు సమస్యలపై ఢిల్లీలో వర్కింగ్ మెకానిజం ఫర్ కన్సల్టేషన్ అండ్ కోఆర్డినేషన్ చట్రం కింద చర్చలు జరిపాయి. దీని తర్వాత చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. అందులో భారత్‌చైనా మధ్య జరిగిన చర్చలు ఎలాంటి కపటం లేకుండా నిజాయితీగా జరిగాయని పేర్కొంది. భారత్‌చైనా సరిహద్దు అంశాలపై ప్రత్యేక ప్రతినిధుల 23వ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పుడు వీటి అమలుపై ఇరుపక్షాలు దృష్టిసారించాయి. అంతేకాదు త్వరలో 24వ ప్రత్యేక ప్రతినిధుల సమావేశానికి సంయుక్తంగా సిద్ధం కావడానికి అంగీకరించాయని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. డబ్ల్యూఎంసీసీ చర్చల తరువాత భారత విదేశాంగ మంత్రిత్వశాఖ కూడా స్పందించింది. సరిహద్దుప్రాంతాల్లో ప్రశాంతతల వ్యాప్తిపై ఇరుపక్షాలు సంతృప్తి వ్యక్తం చేశాయి.ఇది ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను క్రమంగా సాధారణీకరించడానికి దారితీస్తుందని తెలిపింది. అంతేకాదు ఈఏడాది చివర్లో భారత్‌లో జరగనున్న తదుపరి ఎడిషన్ ప్రత్యేక ప్రతినిధుల చర్చలకుకూడా రంగంసిద్ధం చేసినట్లు పేర్కొంది.

# మామునూర్ బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల

## ఎకరాకు రూ. కోటి 20 లక్షలు చెల్లించనున్న సర్కారు

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** మామునూరు వద్ద కొత్త బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూసేకరణ చేయడానికి రాష్ట్రప్రభుత్వం రూ.205కోట్లు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్నాయుడు మార్చి నెలలో వరంగల్ నగరం శివారులోని మామునూరులో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు సమ్మతి తెలిపారు. ఈ విమానాశ్రయానికి అన్ని అనుమతులు ఇస్తూ.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ నిర్మాణం ప్రారంభించడానికి వీలుగా సంబంధిత ఫైల్ సంతకం చేశారు. మరో 253 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇస్తే కొత్త విమానాశ్రయ నిర్మాణం మొదలు పెడతామని కేంద్ర మంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యం లోనే భూ సేకరణ కోసం ప్రభుత్వం తాజాగా నిధులు విడుదల చేసింది. ఇదిలా ఉంటే ఇటీవలే మామునూరు విమా నాశ్రయం నిర్మాణానికి భూములిస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.కోటి 20లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించింది. అలాగే ప్లాట్లకు, ఇళ్లకు సైతం న్యాయమైన పరిహారం చెల్లించేందుకు ప్రతిపాదించడంతో భూ బాధితుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. గత నెల రోజులుగా భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఖిలావరంగల్ తహ సీల్దార్ బండి నాగేశ్వర్‌రావు సఫలీకృతులయ్యారు.

**నిధుల విడుదలపై మంత్రి సీతక్క ధన్యవాదాలు**

మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులకి అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయగా...అందుకు కృషి చేసిన సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. మామునూరు విమా నాశ్రయం నిర్మాణానికి భూములిస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.కోటి 20 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు వివరించారు.అలాగే ప్లాట్లకు, ఇళ్లకు సైతం న్యాయమైన పరిహారం చెల్లించేందుకు ప్రతిపాదిం చారు. గత నెల రోజులుగా భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో తాము జిల్లా ఇంఛార్జ్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జిల్లాకి చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధి కారులు కృషి చేస్తున్నట్లు వివరించారు. కేరళలోని కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం మాదిరిగా మామునూరు ఉండాలని ప్రణాళికలు రచిస్తున్నట్టు వివరించారు. సుమారు 1,000 ఎకరాల్లో నిర్మించనున్నట్టు చెప్పారు. ఎయిర్ పోర్టు పూర్తయితే, మామునూరు విమానాశ్రయం ప్రారంభమైతే చుట్టుపక్కల ప్రాంతాలే కాకుండా సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి అక్కడికి వెళ్లే రహదారుల వెంట అభివృద్ధి జరుగుతుం దని ఆశాభావం వ్యక్తం చేశారు.



సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు ఇస్తున్న నేరగాళ్ల నుంచి జప్తు చేసిన సెల్‌ఫోన్లు, లాప్‌టాప్

## సైబర్ నేరగాళ్లకు మ్యూల్ బ్యాంకు ఖాతాలిస్తున్న 9 మంది నేరగాళ్ల అరెస్టు

### సెల్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు జప్తు

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** విదేశాల్లో వుండే బడా సైబర్ నేరగాళ్లకు భారత్‌లో నేర కలాపాలు సాగించేందుకు ఏజెంట్లుగా వుంటూ వారి కి మ్యూల్ బ్యాంకు ఖాతాలు సమకూరుస్తున్న తొమ్మిది మంది నేరగాళ్లను సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ నేరగాళ్లలో ఇద్దరు రాజస్తాన్‌కు చెందిన వారు కాగా మిగతా ఏడుగురు తెలంగాణకు చెందిన వారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 16 సెల్ ఫోన్లు, ఒక లా ప్‌టాప్, రెండు కార్లతో పాటు 82,500 రూపాయల నగదును జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సైబరాబాద్ కొత్వాల్ అవినాష్ మొ హంతి శుక్రవారం నాడు మీడియాకు వెల్లడించారు. సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఈ క్రమంలో రా ష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీసు విభాగాలకు సైబర్ నేరగాళ్ల భరతం పట్టేందుకు సమాచారం ఇస్తుండడం తెలిసిందే. ఇలా అందిన సమాచారం మేరకు సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు సైబర్ నేరగాళ్లకు మ్యూల్ బ్యాంకు ఖాతాలు అందిస్తున్న ఓ ముఠాను పట్టుకున్నారు. ఈ ముఠాలో రాజస్తాన్‌కు చెందిన సుమిత్ రాథోడ్, మన్‌వేంద్ర సింగ్ రాథోడ్, తెలంగాణకు చెందిన మహమ్మద్ నదీం ఉర్ రెహమాన్, మహమ్మద్ నయీం ఉర్ రెహమాన్, మహమ్మద్ షఫీ, ఎస్.భరత్, తెలుగు మహేష్, అబ్దుల ఖలీద్, జెల్‌పేటి మహేష్ వున్నారు. వీకంతా ఒక ముఠాగా ఏర్పడి విదేశాల్లో వుంటూ సైబర్ నేరాలకు పాల్పడే బడా కేడీల కు భారత్‌లో తమ పేరిట వున్న కరెంటు బ్యాంకు ఖాతాలను కమీషన్ కోసం ఇస్తున్నారు. ఇదే సమయంలో సై బర్ నేరాల వల్ల తమ ఖాతాలకు వస్తున్న నగదును సిం కార్డులు, మొబైల్ అప్లికేషన్ ద్వారా విత్ డ్రా చేసుకుంటున్నారు. ఈ ముఠా టెలిగ్రాం అలి యాస్ జాక్ అనే సైబర్ ముఠాలో కీలకంగా వుందని తేలింది. గచ్చిబౌలిలో ని డిఎల్ఎఫ్ హోటల్‌తో పాటు నగరంలోని పలుచోట్ల త్రీ స్టార్ హోటల్ లో వారం పది రోజుల పాటు వుంటూ ఎవరికి అనుమానం రాకుండా గోల్‌మాల్ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇందుకోసం ఎపికె ఫైల్ అప్లికేషన్ ను వాడు తున్నారు. ఇది కేవలం శాంసంగ్ మొబైల్ ఫోన్‌లోనే పనిచేస్తుందని తేలింది. పట్టుబడ్డ నిందితులను జైలుకు తరలిం చారు. నిందితులపై బిఎన్ఎస్‌లోని సమాచార చట్టం 2008 కింద కేసు నమోదు చేశా రు. కాగా ఈ తరహా కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని కొత్వాల్ అవినాష్ మొహంతి కోరారు. సైబర్ నేరగాళ్లకు మ్యూల్ బ్యాంకు ఖాతాలు అందించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## పంటల వివరాల నమోదులో డేటా వినియోగం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సాగవుతున్న పంటల వివరాలు అంచనా వేయడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. దీనికి సంబంధించి తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిపాదించిన ప్రాజెక్టుపై హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో సాగవుతున్న పంటల విస్తీర్ణం అంచనా వేయటం ద్వారా రానున్న కాలంలో ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయడానికి వీలుంటుందన్నారు. కావున వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు బృందం ముందస్తు అంచనా వేయటానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఇతర వసతులను ఉపయోగించనున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా రెండు మాసాల వరకు రాష్ట్రంలో పంటల వారిగా సాగవుతున్న విస్తీర్ణాన్ని అంచనా వేయడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాటి అమలుకు అవసరమైన నిధులు ప్రభుత్వం అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. అదేవిధంగా రానున్న కాలంలో ప్రభుత్వం అమలు చేయనున్న పంటల భీమా పథకానికి సమగ్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం అందించాలని సూచించారు. వివిధ పంటలను ఆశించు చీడపీడల వివరాలను కూడా సెన్సార్ అమర్చడం ద్వారా ముందు గానే తెలుసుకునే వీలుందని, ఈ దిశగా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వివిధ పంటలలో ఈ పంటకాలం నుంచే ప్రయోగాలు చేపట్టాలన్నారు.

## వర్షాలతో సింగరేణికి రూ.35 కోట్ల నష్టం

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు వెలికితీతకు అంతరాయం ఏర్పడింది. మూడు రోజుల్లో లక్ష టన్నులకుపైగా ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. దీంతో సింగరేణికి సుమారు 35 కోట్ల రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని అంచనా.

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిలో ఓపెన్‌కాస్ట్ గనులు కీలకంగా ఉన్నాయి. రాత్రి షిఫ్ట్‌ల్లో వర్షం ఎక్కువగా కురుస్తుండడంతో ఎక్కడికక్కడే డంపర్లు నిలిచిపోతున్నాయి. వర్షం కారణంగా ఒక్క రోజు శ్రీరాంపూర్‌ఏరియా ఓసీల్లో 43 శాతం, మణుగూరులో 36, మందమర్రిలో 39, ఇల్లెందులో 65, ఆర్జీ-3లో 50, భూపాలపల్లిలో 43 శాతం మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరిగింది.

## నర్సులే సమాజానికి ప్రాణదాతలు

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

### ఘనంగా 4వ బ్యాచ్ బిఎస్సీ నర్సింగ్ విద్యార్థుల స్నాతకోత్సవ సభ



స్నాతకోత్సవ సభకు హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), జూలై 25, ప్రభాతవార్త:** నర్సింగ్ వృత్తి కీలకమైనదని, నర్సులే సమాజానికి ప్రాణ ప్రధాతలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మహిళా దక్షత సమితి విద్యాసంస్థలు, బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ నుంచి బీఎస్సీ నర్సింగ్‌లో పట్టభద్రుల 4వ బ్యాచ్ స్నాతకోత్సవ కార్యక్రమం చందానగర్ గంగారంలోని మహిళ దక్షతసమితి ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ. నర్సులు సమాజానికి అదృశ్యశక్తులన్నారు. నర్సులు కేవలం డిగ్రీలు తీసుకోవడమే కాకుండా సరికొత్త బాధ్యతలు, హామీలు, మానవజాతికి సేవ చేయలన్న లక్ష్యాన్ని స్వీకరించారని గుర్తుచేసుకోవాల న్నారు. డాక్టర్ సరోజ్ బజాజ్‌లాంటి నాయకత్వపు మార్గనిర్ధేకత్వంలో విద్యార్థులు నూతన ప్రపంచంలోనికి ఎంతో ఉత్సాహంతో డిగ్రీ సాధించారని, సాధికారతతో కూడిన మహిళలుగా సమాజానికి చికిత్స చేయటానికి బయట అడుగుపెట్టాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్, ఐపీఎస్ అధికారిణి అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. నర్సింగ్ అనేది కేవలం ఒక ఉద్యోగం కాదని, అదొక దైవకార్యం లాంటిదన్నారు. వృత్తిపరమైన జీవితాల్లోనికి పవిత్రభావనతో అడుగుపెట్టాలన్నారు. వసుద ఫార్మా కెమ్ లిమిటెడ్ సీఎండీ మంతెన వెంకట రామరాజు మాట్లాడుతూ.. వైద్యవ్యవస్థకు ఎంతగానో అవసరమైన నర్సింగ్ వృత్తి కీలకమైన దన్నారు. తపాడియా డయాగ్నస్టిక్స్ ఎండి డాక్టర్ మహేశ్ తపాడియా మాట్లాడుతూ.. కోవిడ్ వంటి మహమ్మారుల సమయంలో కూడా ఎంతో ధైర్యంగా సేవలందించిన మహిళా దక్షత సమితికి తమ వంతు సహకారం అందిస్తామని, ఉచితంగా నర్సింగ్ విద్యార్థులందరికి తలసీమియా పరీక్షలు చేయిస్తామన్నారు.

మహిళా దక్షత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్ మాట్లాడుతూ.. 1991లో స్థాపించిన తమ సంస్థలో ఇప్పటి వరకు 10వేల మందికి పైగా యువతులు నిరుపేదలుగా తమ వద్దకు వచ్చినవారేనని, వారికి వైద్యం, ఆర్థిక టెక్నాలజీ రంగాల్లో శిక్షణనిచ్చి జీవితంలో స్థిరపడే విధంగా తమవంతు సహకారం అందిస్తున్నా మన్నారు. విద్యార్థుల అవసరాలకు, ఆడిటోరియం నిర్మాణానికి దాదాపు 1.15 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో బాలికల హాస్టల్, ఆడిటోరియంలకు తమ దాతృత్వం చాటుకుంటున్న దాతలు సజ్జన్ కుమార్ గోయెంకా, అరుణా మాలిని, నిర్మలా గోయెంకా, దివంగత రాంగోపాల్ గోయెంకాలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళ దక్షత సమితి సంస్థల ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ గ్రాడ్యుయేట్స్ పూర్తిచేసిన 50 మంది విద్యార్థులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పట్టాలను అందించారు.

ఈ కార్యక్రమానికి వెయ్యిమందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, అతిథులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎండిఎస్ ప్రధాన కార్యదర్శి జి.లక్ష్మి, విమలా భద్రుకా, మున్నా జెగెతియ, శారధా గుప్త, జయా బహితి, శీలా సొంతా లియా, అనిత్ అగర్వాల్, లక్ష్మీకుమార, రాజశ్రీజైన్, జ్ఞానపతి పరాష్, డాక్టర్ ఆకాశ్ అగర్వాల్, లలిత కుమార్ అగర్వాల్, శ్యాంసుందర్ ముందాడ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీకి త్వరలో పూర్తిస్థాయి సిబ్బంది

### సమావేశమైన ఉన్నతస్థాయి కమిటీ

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి త్వరలోనే పూర్తిస్థాయి సిబ్బంది నియమితులు కానున్నారు. ఇప్పటి వరకు ఉస్మానియా యూనివర్సిటీలో భాగంగా ఉన్న కోఠి మహిళా కళాశాలను విశ్వవిద్యాలయంగా ప్రభుత్వం ఉన్నతీకరించిన సంగతి తెలిసిందే. ఉస్మానియా విశ్వవిద్యాలయం, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం మధ్య బోధన, బోధనేతర సిబ్బంది.. ఇతర ఆస్తులను విభజించేందుకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించిన సంగతి తెలిసిందే.

అందులో భాగంగా శుక్రవారం ఉన్నతస్థాయి కమిటీ మొదటి సమావేశం జరిగినట్టు తెలిసింది. అయితే వివిధ కారణాల రీత్యా కమిటీ సభ్యులైన ఓయూ విసి, మహిళా వర్సిటీ విసి సమావేశానికి హాజరు కానున్నట్టు తెలిసింది. మొదటి సమావేశంలో బోధన, బోధనేతర సిబ్బంది విభజనకు సంబంధించి చర్చించినట్టు తెలిసింది. ఓయూలో పనిచేస్తున్న వారికి, ప్రస్తుతం కోఠి ఉమెన్స్ కాలేజీగా కొనసాగుతున్న కాలేజీలో బోధన చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ఆప్షన్లను ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. అయితే బోధనా సిబ్బందిలో మహిళా యూనివర్సిటీకి సబ్జెక్టుల్లో ఇతర ఆప్షన్లు లేకుంటే.. కొత్తగా రిక్రూట్ చేసుకునే వరకు వారిని మహిళా వర్సిటీలోనే కొనసాగాలని సూచించనున్నారు.

కమిటీ మెంబర్ సెక్రటరీగా రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, సభ్యులుగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, ఓయూ విసి ప్రొఫెసర్ ఎం కుమార్, మహిళా వర్సిటీ విసి ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, ప్రత్యేక ఆహ్వానితుడిగా ఓయూ మాజీ విసి ఆచార్య తిరుపతిరావును నియమించారు. విభజన అనంతరం పూర్తిస్థాయి యూనివర్సిటీగా ఏర్పడనుంది.

## హెచ్‌ఎండిఎ ముందస్తు ప్రణాళిక చర్యలు భేష్

### హెచ్‌ఎండిఎ ప్రణాళికలపై జెడిఎ ప్రతినిధులు బృందం అధ్యయనం

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఎ) ప్రణాళికా చర్యలు బాగున్నాయని జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ (జెడిఎ) ప్రతినిధి బృందం సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ ఆనంది నేతృత్వంలో ప్రతినిధి బృందం హెచ్‌ఎండిఎ కార్యాలయాన్ని సందర్శించించారు. ఈ బృందంలో ప్లానింగ్ డైరెక్టర్ ప్రీతి గుప్తా, అదనపు చీఫ్ టౌన్ ప్లానర్ అంకుర్ దధీచ్, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ రుషికేష్ కొల్టే పాల్గొన్నారు. హెచ్‌ఎండిఎ ప్రణాళికా కార్యక్రమాలు, మెట్రోపాలిటన్ అభివృద్ధిలో అనుసరిస్తున్న వాటిని అధ్యయనం చేయడానికి ఈ ప్రతినిధి హైదరాబాద్ నగరానికి వచ్చారు. ఇక్కడ అమలు అవుతున్న వాటి స్థితిగతులను పరిశీలించాలన్నదే జెడిఎ ప్రతినిధులు బృందం ప్రధాన ఉద్దేశ్యం. ఈ సందర్భంగా హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సంస్త అభివృద్ధిపై సమగ్ర సమీక్షా ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుత మాస్టర్ ప్లాన్లు, రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్లు, ల్యాండ్ పూలింగ్ పథకాలు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం - 2050 కోసం రూపొందించిన సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను వివరించారు. ఇందులో ..కాంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్లాన్, ఆర్థికాభివృద్ధి ప్రణాళిక, బ్లూగ్రీన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్లాన్‌లను ఏకీకృతంగా కలిపింది, జిఐఎస్ ఆధారిత బేస్ మ్యాప్ ద్వారా మొత్తం మెట్రోపాలిటన్ ప్రాంతానికి ఆధారభూతంగా పని చేస్తున్నదని తెలిపారు. అదనంగా, తెలంగాణ యొక్క ముఖ్యమైన పట్టణ ప్రాంతం కోసం 3డి డిజిటల్ ట్విన్.. అభివృద్ధి చేస్తుండటం, అలాగే కొత్త ..కాంప్రెహెన్సివ్ బిల్డింగ్ రెగ్యులేషన్స్.. రూపకల్పనలో ఉన్నట్లు తెలియజేశారు. సమావేంలో ఉన్నతాధికారులు ఎస్. దేవేందర్ రెడ్డి, ప్లానింగ్ డైరెక్టర్లు కె. విద్యాధర్, ఎం. రాజేంద్ర ప్రసాదనాయక్‌తో పాటు పలువురు టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

### హెల్త్ వర్సిటీలో ఎంబిబిఎస్, బిడిఎస్ కన్వీనర్ కోటా

## రిజిస్ట్రేషన్ల గడువు 30వ తేదీకి పెంపు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూలై 25:** రాష్ట్రంలో కొనసాగుతున్న కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీలో ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల రిజిస్ట్రేషన్ కోసం నిర్దేశించిన గడువును పొడిగించారు. రిజిస్ట్రేషన్‌ను ఈ నెల 30 వరకూ పొడిగిస్తున్నట్టు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ప్రకటించింది. గతంలో రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 25 వరకు ఉన్న సంగతి తెలిసిందే. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు గడువును పొడిగించినట్టు యూనివర్సిటీ అధికారులు ప్రకటించారు. 2025-26 విద్యా సంవత్సరానికి కాంపిటెంట్ అథారిటీ కోటా కింద ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం నోటిఫికేషన్‌ఈ నెల 15న జారీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 2025-26 విద్యా సంవత్సరానికి ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ ఎలిజిబిలిటీకమ్‌ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యుజి-2025లో కటాఫ్ స్కోర్‌లు, అంతకంటే ఎక్కువ సాధించడం ద్వారా అర్హత సాధించిన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తుల చివరి తేదీని పొడిగించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి వచ్చిన అనేక అభ్యర్థనలతోపాటు స్థానిక, స్థానికేతర సమస్యలకు సంబంధించి కోర్టు కేసు కారణంగా ఈ నెల 30 సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్టు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## కేబినెట్ సమావేశం 28వ తేదీకి వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 25:** తెలంగాణ కేబినెట్ సమావేశం ఈనెల 28కి వాయిదా పడింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించాల్సిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం వాయిదా పడింది. ఎఐసిసి కార్యాలయంలో బీసీ రిజర్వేషన్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేసేందుకు సిఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి ఢిల్లీకి వెళ్లిన విషయం తెలిసిందే. వీరితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఐదుగురు మంత్రులు ఢిల్లీలోనే ఉన్న కారణంగా కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయాలని నిర్ణయించారు. ఈ భేటీని ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తామని వెల్లడించారు. కాగా, సిఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రానికి ఢిల్లీ నుంచి తిరిగి హైదరాబాద్ వచ్చేశారు.

## బిజెపి నేతలు బిసిలకు వ్యతిరేకులు

### రఘునందర్‌రావు బిసి రిజర్వేషన్ అమలు కోరుకోవడం లేదు: ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** బిసి బిల్లును వ్యతిరేకిస్తూ బిజెపి నాయకులు మాట్లాడుతున్న తీరు దారుణం అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిఎల్‌పిలో శుక్రవారం మాట్లాడుతూ ముఖ్యమంత్రి అగ్రవర్ణ కులాల్లో పుట్టినా రిజర్వేషన్‌తెచ్చారని సామాజిక న్యాయం పట్ల రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనం అన్నారు. 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్కసారైనా బిసిలను ప్రధాని చేశారా అని ఇవాళ కాంగ్రెస్ ను ప్రశ్నించిన రఘునందన్ రావుకు

తాజాగా ఆది శ్రీనివాస్ కౌంటర్ ఇచ్చారు. బిసి బిల్లు అమలు కాకూడదని రఘునందన్ రావు కోరుకుంటున్నారని ఆరోపించారు. బిసిలకు న్యాయం చేసే విషయంలో బిజెపికి క్లారిటీ లేదని దుయ్యబట్టారు. రాష్ట్రం పంపిన బిల్లును ఆమోదించకుండా ఉంగ్రెస్ పై విమర్శలు చేయడం ఏంటని మండిపడ్డారు.

బిజెపి అగ్రకుల పార్టీ అని బిసిలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తోందని ధ్వజమెత్తారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, మా పార్టీని ప్రశ్నించే బదులు రఘునందన్ రావు మీ బిజెపి అధ్యక్షుడు ఎవరు? బిసిలకు అధ్యక్ష పదవి ఇవ్వమని అధిష్టానాన్ని మీరెందుక అడగరు అని ఆది శ్రీనివాస్ నిలదీశారు. కాంగ్రెస్ చెప్పే సామాజిక న్యాయం మాటలకే పరిమితం కాదని మన్మోహన్ సింగ్ లాంటి నేతను రెండు సార్లు ప్రధానిగా చేసిన ఘనత మాదేనన్నారు.

## పంటలకు ప్రాణం.. వర్షాలతో అన్నదాతల హార్షం

### ఉమ్మడి జిల్లాలో వేధిస్తున్న ఎరువుల కొరత

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల పంటలకు ఊపిరి పోసినట్లయింది ఈ ఏడాది ప్రారంభంలో నైరుతి రుతుపవనాలు ముందుగా ప్రవేశించిన ఎప్పటికీ సరైన వర్షాలు కురవలేదు దీంతో మొదట్లో పంటలు సాగు చేసే రైతులు వర్షాలు లేక రెండు మూడు దఫాలుగా దుక్కిలో విత్తనాలను నాటవలసి వచ్చింది. దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతిన్నారు ఈ నేపథ్యంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది వానల కోసం రైతులు నెల రోజులుగా ఎదురు చూస్తున్నారు జూన్ నెల లొ వర్షాలకు వేసిన విత్తనాలు మొలవ క పోవటం అన్నదాతలను ఆందోళన కలిగించింది. కాలం వచ్చాక పెరిగిన ఎండ వడగాల్పుల వల్ల వేసిన విత్తనాల మొలకలు కూడా ఎండి పోయా యి ఖమ్మం జిల్లాలో వానాకాలంలో 5.80 లక్షల ఎకరాల్లో ఎకరాల్లోనూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 6.30 లక్ష ఎకరాల్లో పంటలు పండించాలని వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

ఆ మేరకు ఉమ్మడి జిల్లాలో నాలుగున్నర లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు కుంటలు బావులలో బోర్లలో నీరు చేరటంతో వరి నాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు వీటితోపాటు వర్షాభా పరిస్థితి వల్ల ఇంకా సాగు చేయాల్సిన మొక్కజొన్న జొన్న కంది మిరప తోటలను పూర్తిస్థాయిలో వేయలేకపోయారు. ఈ వర్షాల వల్ల ఆ పంటలను కూడా ఇప్పుడు వేసే అవకాశం ఉంది ఈ దశలో రైతులకు అవసరమైన యూరియా కాంప్లెక్స్ డిఏపి లాంటి ఎరువులు మార్కెట్లో దొరకటం లేదు ఎరుల కోసం రైతులు దుకాణాల చుట్టూ పడిగాపులు కాస్తున్నారు ప్రధానంగా ఖమ్మం కొత్తగూడెం భద్రాచలం పాల్వంచ మధిర సత్తుపల్లి ఇల్లందు తదితర ప్రాంతాల్లో రైతులు ఎరువుల దుకాణాల ముందు ముందు క్యూలు కట్టి నిల్చుంటున్నారు ఒకవైపున ప్రభుత్వం ఎరువులకు ఎలాంటి కొరతలేదని ఎరువులు బ్లాక్ మార్కెట్లో తరలించిన గాని అధిక రేట్లకు వికరించిన గాని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నప్పటికీ వ్యాపారుల్లో మార్పు రావటం లేదు.

ఫలితంగా ఒకవైపు ఎరువుల సరఫరా తక్కువగా ఉంటే మరోవైపు మార్కెట్లో ఉన్న ఎరువులు కూడా వ్యాపారులు రైతులకు అందించడం లేదు దీంతో ఉమ్మడి జిల్లాలో ఎరువుల కొరత తీవ్రంగా ఏర్పడింది.



ప్రహ్లాద్‌జోషికి వినతిపత్రం ఇస్తున్న ఎంపిలు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, బిసి నేతలు గుజ్జ కృష్ణ, నందగోపాల్ తదితరులు

## పార్టీలకతీతంగా బిసి బిల్లుకు మద్దతు ఇవ్వాలి

### బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలి

### కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి ఎంపి ఆర్.కృష్ణయ్య వినతి

**హైదరాబాద్, జూలై 25,ప్రభాతవార్త:** పార్టీలకతీతంగా బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మరో ఎంపి బీదమస్తాన్‌రావు, బిసి సంక్షేమసంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ దుర్గా నరేష్, ఢిల్లీ ఇన్‌చార్జ్ కర్రీ వేణు మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి నంద గోపాల్, మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ శారద లతో కలిసి కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ..బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, రాజ్యాంగా పరమైన, న్యాయపరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమీలేవన్నారు. గతంలో పాలించిన కేంద్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం, బి సీ వ్యతిరేక వైఖరి అవలంబించడం మూలంగానే ప్రమోషన్లలలో రిజర్వేషను పెట్టలేదు. రాజ్యాంగ బద్ధమైన మండల్ కమీషన్ బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసిందన్నారు. ఈవిషయాలపైన అన్నీ పార్టీలతో చర్చిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాల క్రితం పార్లమెంట్ లో బీసీ బిల్లు పెడితే 14 పార్టీలు బిఆర్ఎస్, టి.డి.పి. డి.ఎం.కె. అన్నా డి.ఎం.డి. పి.ఎం.క, సమాజ్ వాది పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, తీఆశి, జనతాదళ్ (యునైటెడ్), జనతా దళ్ (ఎస్), కాంగ్రెస్ పార్టీ, నేషన్ లిష్టు కాంగ్రెస్ పార్టీ, అప్నా దళ్, లోక్ దళ్ పార్టీలు మద్దతు ఇచ్చాయని కానీ బిజెపి పార్టీ మద్దతు ఇవ్వకపోవడంతో బిల్లు పాస్ కాలేదని కావున బిజెపి బీసీ బిల్లుకు తమ విధాన ప్రకటన చేయాలని కోరారు.

## అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్-2025లో నారాయణ విద్యార్థులకు స్వర్ణ, రజత పతకాలు



**హైదరాబాద్, ప్రభాతవార్త, జూలై 25:** అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ (ఐపిహెచ్‌వో) 2025లో నారాయణ విద్యార్థులు స్నేహిల్ ఝా, ఆగం షాలు స్వర్ణ, రజత పతకాలు గెలుచుకున్నారు. 2025 జూలై 18 నుండి 24 వరకు ఫ్రాన్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మక ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో నారాయణ విద్యార్థులు తమ ప్రతిభతో ఆకట్టుకు న్నారు. భారత్ తరపున పాల్గొన్ని విజయకేతనం ఎగురవేశారు. అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ (ఐపిహెచ్‌వో) అనేది జూనియర్ కాలేజీ విద్యార్థుల కోసం ప్రపంచవ్యాప్తంగా జరిగే అత్యంత ప్రతిష్టాత్మక పోటీ పరీక్ష. ఈ పరీక్షలో విద్యార్థులు సిద్ధాంతాలు, ప్రయోగాత్మక భౌతిక శాస్త్రాల్లోని జ్ఞానం, తర్కం, విశ్లేషణ సామర్థం, సమస్య పరిష్కార నైపుణ్యం, వివిధ నైపుణ్యాలను సమగ్రంగా పరిశీలిస్తుంది. ఈ పోటీ ప్రతి సంవత్సరం వివిధ దేశాల్లో నిర్వహించబడుతుంది. 87 దేశాల నుండి పాల్గొన్న వందలాది విద్యార్థుల మధ్య పోటీని తట్టుకుని వివిధ దశలను దాటుకుంటూ చివరిదైన 5 దశను విజయ వంతంగా దాటి ఫైనల్లో విజేతలుగా నిలిచారు. ప్రపపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. అంతర్జాతీయ వేదికపై స్నేహిల్ ఝా, ఆగం షా చూపిన అసాధారణ ప్రతిభా పాటవాలు, అత్యుత్తమ ప్రదర్శన వారి మేధస్సుకు, నిరంతర కృషికి నిదర్శనంగా నిలుస్తోంది. నారాయణ విద్యాసంస్థల్లో అందించే అత్యుత్తము శిక్షణ ఫిజిక్స్ ఒలింపియాడ్ మరోసారి తార్కాణంగా నిలుస్తోంది.

చిన్న వయస్సు నుండే శాస్త్రీయ నైపుణ్యాన్ని పెంపొందించడంలో నారా యణ విజయవంతం అవుతోంది అనడానికి వీరి విజయాలే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ నారాయణ విద్యార్థులు అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ 2025లో సాధించిన విజయం పట్ల ఎంతో గర్విస్తున్నామన్నారు. ఇది వ్యక్తిగతంగా వారి జీవితంలో ఒక గొప్ప మైలురాయి మాత్రమే కాదని.. నారాయణ కుటుంబం మొత్తానికి, అలాగే యావత్ భారతావనికే గర్వకారణమన్నారు.

నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి శరణి నారాయాణ మాట్లాడుతూ ఒలింపియాడ్ శిక్షణ విధానానికి వచ్చే సరికి స్పష్టమైన కాన్సెప్టు, లక్ష్యబద్ధమైన శిక్షణ, వ్యక్తిగత మార్గదర్శకతను కలిపి రూపొందించబడిందన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రత్యేక అధికారుల నియామకం

### ఉమ్మడి జిల్లాల వారీగా ఉత్తర్వులు జారీ చేసిన సిఎస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూలై25:** తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ జిల్లాకు ఇలంబర్తి, రంగారెడ్డి- డి. దివ్య, ఆదిలాబాద్- సి. హరికిరణ్, నల్గొండ - అనితా రామచంద్రన్, నిజామాబాద్ - ఆర్. హనుమంతు, మహబూబ్‌నగర్ - రవి, కరీంనగర్ - సర్ఫరాజ్ అహ్మద్, వరంగల్ - కె. శశాంక్, మెదక్ - ఎ శరత్, ఖమ్మం - కె. సురేంద్ర మోహన్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన జిల్లాలను సందర్శించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిస్థితిని ఎదుర్కోవడానికి సంసిద్ధతపై అన్ని విభాగాలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సహాయంతీసుకోవాలని సూచించారు.

## ఇ-గవర్నెన్స్, డిజిటలైజేషన్‌లో ఎస్తోనియా సహకారం తీసుకుంటాం

### ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** ఇ-గవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధించిన ఎస్తోనియా సహకారం తీసుకుంటామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ రెండు రంగాల్లో ఎస్తోనియా దేశం అగ్రగామిగా ఎదగడం అబ్బురపరుస్తోందని ఆయన ప్రశంసించారు. శుక్రవారం ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో సచివాలయంలో మంత్రిని కలిసారు. ఈ సందర్భంగా ఎస్తోనియా వాణిజ్య ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, కృత్రిమ మేధ, రోబోటిక్స్, ఆరోగ్యరంగాల ప్రతినిధులు ఉన్నారు. తెలంగాణా రాష్ట్రం ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్లో ఇంకా ప్రథమ దశలోనే ఉందని, వంద శాతం ప్రగతి సాధించిన ఎస్తోనియా తమకు సాంకేతిక సహకారం అందించాలని శ్రీధర్ బాబు కోరారు. వాణిజ్యం, ఏఐ సాంకేతికతలో కూడా కలిసి పనిచేయాలన్ని ఆకాంక్షను ఆయన వెలిబుచ్చారు. ప్రజా సేవల విభాగాలను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు ఇగవర్నెన్స్ కీలకమని ఆయన తెలిపారు. ఇందులో ఎస్తోనియా తోడ్పాటును కోరుతున్నాం. సైబర్ సెక్యూరిటీలో సైతం పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డ్రోన్ టెక్నాలజీలో తెలంగాణాలో గణనీయ అభివృద్ధి సాధించిందని, ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో హైదరాబాద్‌లో తయారైన డ్రోన్లు మా శత్రుదేశానికి భారీ నష్టం కలిగించాయన్నారు. భవిష్యత్తు యుద్ధాలు డ్రోన్లు, సైబర్ దాడులతోనే జరుగుతాయి. ఫుడ్ ప్రాసెసింగ్, బ్రాండెడ్ మద్యం ఉత్పత్తిలో ముందున్నాం అన్నారు. ఈ రంగాల్లో కూడా కలిసి పనిచేసే విషయాన్ని పరిశీలించాలన్నారు. సెప్టెంబరులో తమ దేశం సందర్శించాలని ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ చేసిన అభ్యర్థనకు శ్రీధర్ బాబు స్పందించారు. తమ అధికారుల బృందం వస్తుందని, విద్య, ఇ గవర్నెన్స్, ఏఐ, రోబోటిక్స్‌లో పరస్పరం సహకరించుకునే విషయంపై చర్చిస్తారని తెలిపారు. సమావేశంలో ఐటి, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ (మీ సేవ) కార్పోరేషన్ కమిషనర్ రవికిరణ్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌ది ఏ కులం?

### బిజెపి బిసిలకు వ్యతిరేకం కాదు

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీది ఏ కులం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు ప్రశ్నించారు. రాహుల్ తాత ఒక పర్షియన్ అని ఆయన మాత్రం బ్రాహ్మిణ్ అని చెప్పుకుంటారని అన్నారు. ఇంతకూ ఆయనకు గాయత్రీ మంత్రం వచ్చా..? అంటూ ప్రశ్నించారు. ఆయన బ్రాహ్మణుడెలా అవుతారని అన్నారు. సిఎం రేవంత్ మంచి యాక్టర్ అని, ఆయనకు ఆస్కార్ అవార్డు కాదు.. అత్తారింటికి దారేది సినిమాలో మాదిరిగా భాస్కర్ అవార్డు ఇవ్వాలని అన్నారు. నోబుల్ ప్రైజ్ కాదు గ్లోబల్ ప్రైజ్ ఇవ్వాలంటూ ఎద్దేవా చేశారు. మోడీని కన్వరన్ బిసి అనటం వెనుకబడిన కులాలను అవమానించడమేనని అన్నారు. దత్తాత్రేయను ఉపరాష్ట్రపతి చేయాలనడంపై రేవంత్‌కు థాంక్యూ చెప్పారు. తాము కూడా తెలంగాణ సిఎంను బిసిని చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. బిసి కమిషన్ ఏర్పాటు చేసిందే బిజెపి ప్రభుత్వమని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు పెట్టకుండా ఆర్డినెన్స్ తేవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. కులగణన రిపోర్టును ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ పిఎం అయ్యే ముందు నుంచే బిసి అన్నారు. అప్పటి నుంచి ఎన్నో కులాలు బిసిల్లో కలిసిపోయినట్లు గుర్తు చేశారు. ఇక, రాహుల్ గాంధీ తల్లి తండ్రులు వేర్వేరు మతాలకు చెందినవారు, ఆయన కులం ఏమిటి? అని ప్రశ్నించారు.

తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని రాంచందర్ రావు తెలిపారు. పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేస్తానని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తనపై చేసిన వ్యాఖ్యలపై కోర్టుకి వెళ్లానని. చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42 రిజర్వేషన్లు కల్పించని పక్షంలో తాము పార్టీగా టికెట్లు ఇస్తామని చెప్పారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇచ్చిన సూచనల మేరకు పార్టీ నేతలు ఎక్కువ టూర్లు చేయాలని, కార్యకర్తల్ని కలవాలని రామచందర్ రావు పేర్కొన్నారు.

## భారీ వర్షాలకు గ్రామీణ రహదారులు దెబ్బతినే ప్రమాదం

### సత్వరమే పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి

### ఆగస్టు మొదటి వారంలో స్పెషల్ డ్రైవ్

### పిఆర్ అండ్ ఆర్డీ సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క



**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త :** గ్రామాల్లో పచ్చదనం స్వచ్ఛదనం పెంచేలా ఆగస్టు మొదటి వారంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. భారీవర్షాలతో గ్రామీణ రహదారులు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున.. సత్వరమే పునరుద్ధరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిత్య పర్యవేక్షణ కోసం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ ఆఫీస్ లో డీఈ, ఎస్ఈ లతో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో పీఆర్ ఆర్డీ శాఖపై మంత్రి సీతక్క జిల్లా అడిషనల్ కలెక్టర్లు, జెడ్పీ సీఈఓలు, డీపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. రూరల్ డ్రింకింగ్ వాటర్, సానిటేషన్, రూరల్ రోడ్స్, ప్లాంటేషన్‌పై సమీక్ష నిర్వహించారు. వనమహోత్సవంలో భాగంగా 2.44 కోట్ల మొక్కలు నాటినట్లు అధికారులు నివేదించగా .వేగం పెంచాలని మంత్రి ఆదేశించారు. మిషన్ భగీరథ పైప్ లైన్లను నిత్యం పరిశీలించాలన్న మంత్రి సీతక్క వర్షాలు, వరదలతో పైప్ లు లీక్ అయితే తాగునీటి కలుషితం అయ్యే ప్రమాదం ఉన్నందున అధికారు లంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగు నీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అధికారులంతా క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. వర్షకాలం పూర్తయ్యే వరకు అధికారులెవరూ హెడ్ ఆఫీస్‌ను విడిచి వెళ్లరాదని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి రోజు సానిటేషన్, తాగు నీటి సరఫరా, గ్రామీణ రహదారుల పరిస్థితిపై రోజు వారి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారి చేశారు.

**జువనైల్ హోం సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశం**

సైదాబాద్ జువనైల్ హోం నుంచి ఐదుగురు బాలలు తప్పించుకుపోయిన ఘటన పట్ల మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు. విధుల పట్ల నిర్లక్షం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. అంతే కాకుండా ఇద్దరు సుపర్వైజర్లను విధుల్లో నుంచి తొలగించి, సుపరిండెంట్ కు మెమో జారీ చేశారు. ఈ సందర్భంగా జువనైల్ వెల్ఫేర్ శాఖ అధికారులుఘటన విరాలను మంత్రికి జువనైల్ వెల్ఫేర్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చార్వాక్, అసిస్టెంట్ చీఫ్ ప్రొబేషన్ సుపర్‌వైజర్ నవీన్ తప్పించుకు పోయిన ఐదుగురు బాలల్లో ముగ్గురు ఆచూకి లభించిందని, మిగిలిన ఇద్దరు బాలల ఆచూకి కనుక్కునేందుకు పోలీసుల సహాయం తీసుకుంటున్నామని మంత్రి సీతక్కకు తెలిపారు.

## 43 మంది మైనింగ్ ఇంజనీర్ల పునర్నియామకం

### సింగరేణి యాజమాన్యం అంగీకారం

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** సింగరేణిలో టర్మినేట్ అయిన 43 మంది జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ ఉద్యోగులు పునర్నియామకం కానున్నారు. ఇందుకు సింగరేణి యాజమాన్యం అంగీకారం తెలిపింది. ఈ మేరకు దీనికి సంబంధించి హైదరాబాద్‌లో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు సమక్షంలో శుక్రవారం గుర్తింపు కార్మిక సంఘానికి, సింగరేణి యాజమాన్యానికి మధ్య ఒప్పందం కుదిరింది. గతంలో జూనియర్ ఐనింగ్ ఇంజనీరులు విధులకు గైర్హాజరు కావడం, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించకపోవడం వల్ల వారిని సింగరేణి యాజమ్యానం విధుల నుంచి తొలగించింది. కాగా వీరిని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం యజామాన్యానికి విజ్ఞప్తి చేసింది. దీనిపై గత జూన్ 27వ తేదీన డైరెక్టర్ పా స్థాయిలో జరిగిన 51వ నిర్మాణాత్మక సమావేశంలో చర్చించి ఒక ద్వైపాక్షి క అంగీకారానికి రావడం జరిగింది. తదుపరి యూనియన్ ప్రతినిధులు, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో మరోమారు చర్చల అనంతరం త్రైపాక్షి క ఒప్పందానికి అంగీకరించడం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం టర్మినేట్ అయి పునర్‌నియామకం పొందుతున్న 43 మంది జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీలను తాజా నియామకంగా గుర్తించడం జరుగుతుంది. వీరంతా హై పవర్ కమిటీ ముందుకు వెళ్లి తమ సర్వీసు విషయాలు, ఓవర్ మెన్ సర్టిఫికెట్, గ్యాస్ టెస్టింగ్ ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లు మొదలైనవి సమర్పించవలసి ఉంటుంది. అనంతరం ఆ కమిటీ సూచన మేరకు మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. దాని ఆధారంగా ప్రాథమిక అపాయింట్మెంట్ ఆర్డర్లు జారీ చేస్తారు. తిరిగి ఉద్యోగంలో చేరిన వీరు తమ మొదటి సంవత్సరంలో తప్పనిసరిగా కనీసం 190 మస్టర్లకు తగ్గకుండా విధులు నిర్వహించాలని ఉంటుందని ఒప్పందంలో ప్రతిపాదించారు.

## రేవంత్‌రెడ్డి తన భార్య ఫోన్ కూడా ట్యాప్ చేశారు!

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 25:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి చివరకు తన భార్య ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని సంచలన ఆరోపణలు చేశారు. భార్యాభర్తల ఫోన్లను ట్యాప్ చేయించి వింటున్నారని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. ఫోన్ ట్యాపింగ్ సాధారణమేనని ఇటీవల ఢిల్లీలో రేవంత్ రెడ్డి అన్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌ను సహజమని చెప్పిన ముఖ్యమంత్రిపై ఈడీ, సీబీఐ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులతో పాటు సొంత మంత్రుల ఫోన్‌లను కూడా ఆయన ట్యాప్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇదే సమయంలో ఆయన ముఖ్యమంత్రిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి తమపై ఇలాగే నోటికి వచ్చినట్లు మాట్లాడితే ఆయన ఎవరెవరితో తిరిగారో ఆ పదహారు మంది పేర్లు బయటపెడతానని హెచ్చరించారు. జూబ్లీ హిల్స్, ఢిల్లీ, దుబాయ్‌లలో ఎక్కడెక్కడ ఉన్నావో అందరికీ తెలుసునని ఘాటుగా విమర్శించారు. చివరకు మిస్ వరల్డ్ పోటీదారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు.

## ప్రాథమికస్థాయి వరకు తెలుగుభాషలో బోధన అవసరం

### మహారాష్ట్ర మాజీ గవర్నరు సిహెచ్.విద్యాసాగరరావు

### మహాకవి దాశరథి కవిత్వం-వ్యక్తిత్వం-సినిమా పాటలపై

### యువ పరిశోధకుడు, కవి డా. శరత్‌చంద్ర స్మారక ప్రసంగం



దాశరథి కవిత గ్రంథావిష్కరణ కావిస్తున్న విద్యాసాగరరావు, రమణాచారి, ఉడయవర్లు, శరత్‌చంద్ర తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 25, ప్రభాతవార్త :** ఆంగ్లం తదితర ఎన్నిభాషలు నేర్చుకున్నా మాతృ భాష తెలుగును మరచిపోరాదని, ప్రభుత్వాలు కూడా కనీసం పాఠశాల స్థాయి వరకైనా విద్యార్థులకు తెలుగుభాషలో బోధన చేయడం, ప్రతీఒక్కరి మాతృభాషల్లో బోధన ఎంతో అవసరమని మహారాష్ట్ర పూర్వ గవర్నరు సిహెచ్. విద్యాసాగరరావు అన్నారు. మాతృభాష రానివాడు ఎప్పటికీ మేధావి కాలేడని స్పష్టం చేశారు. తెలుగుభాషను ఎంతో చులకచేసి తెలుగుభాషలో మాట్లాడడం కూడా తగదని శాసించిన నిజాం ప్రభువును ఎదిరించి తెలుగుభాష, తెలంగాణ కోసం వీరోచితంగా తన కవిత్వం ద్వారా చైతన్యపరిచి ఉద్యమోన్ముఖులను చేసిన మహోన్నతకవి దాశరథి అని కొనియాడారు. దాశరథి శతజయంతిని సంవత్సరం పొడుగునా జరుపుతూ ఆయన గురించి తరతరాలకు తెలపాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టం చేశారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లో తెలుగుభాషాభ్యున్నతికి తనవంతు బాధ్యతగా కృషిచేస్తానని భరోసా నిచ్చారు. అలాగే ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్న తెలం గాణ భాషానిలయం అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని భరోసా నిచ్చారు. తెలంగాణ కవుల ప్రతినిధి దాశరథి, దాశరథి అంటేనే తెలంగాణ వీరరసం ఉప్పొంగిపోతుందని, ఆయన నినదించి తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసి రాష్ట్ర సాకారానికి కారణమైన 12 అక్షరాల నా తెలంగాణ కోటి రతనాల వీణ ఒక ఓం నమఃశివాయ పంచాక్షరి, ఓం నమో నారాయణాయ అష్టాక్షరీ మంత్రాలు ఎలాగో అలాగే దేశభక్తిని దైవభక్తిగా భావించిన మహానుభావుడు దాశరథి ఉచ్చరించిన నా తెలంగాణ కోటి రతనాల వీణ ద్వాదశాక్షరి అని తెలం గాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి, భాషానిలయం అధ్యక్షుడు డా. కె.వి. రమణాచారి అభివర్ణిం చారు. నా తెలంగాణ కంజాతవల్లి, తెలం గాణలేమ సౌందర్యసీమ, కోటి అందాల జాన, రతనాల వీణ అని దాశరథి అన్నాడని గుర్తుచేశారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో మహాకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంత్యుత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా నిలయంలోని రావిచెట్టు రంగారావు సభామందిరంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు. భాషానిలయం అధ్యక్షుడు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల పూర్వ గవర్నరు సిహెచ్. విద్యాసాగరరావు విశిష్ట అతిథులు స్మారక ప్రసంగకర్త యువ పరిశోధకుడు, కవి డా. శరత్‌చంద్ర, గౌరీశంకర్, కార్పొరేటర్ సురేఖ, భాషా నిలయం గౌరవ కార్యదర్శి టి. ఉడయవర్లు తదితరులతో కలిసి ముందుగా దాశరతి చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి, భాషానిలయం రూపొం దించిన దాశరథి కవిత గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సభకు టి. ఉడయవర్లు స్వాగతో పన్యాసంలో భాషానిలయం పుట్టుపూర్వోత్త రాలను, చేసిన చేస్తున్న కార్యక్రమాలు, కళాసేవలను సంక్షిప్తంగా వివరించారు. ఈ సందర్భంగా అతిథుల చేతులమీదుగా దాశరథి కవిత్వం-వ్యక్తిత్వంపై పాఠశాలస్థాయి విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేసి శుభాశీస్సు లందజేశారు. అనంతరం డా. శరత్‌చంద్ర మహాకవి దాశరథి కవిత్వం-వ్యక్తిత్వం-సినిమా పాటలు అంశాలపై స్మారక ప్రసంగం కావించారు.

## ప్రధాని మోడీ విదేశీ పర్యటనల వ్యయం రూ.295 కోట్లు

### పార్లమెంటులో కేంద్రమంత్రి లిఖితపూర్వక జవాబు



**న్యూఢిల్లీ, జూలై 25:** ప్రధాని మోడీ విదేశీ పర్యటనలకు అయిన ఖర్చు వివరాలను కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. 2021 నుంచి 2024 డిసెంబర్ వరకూ ప్రధాని విదేశీ పర్యటనలకు అయిన మొత్తం ఖర్చు దాదాపు రూ.295 కోట్లు అని తెలిపింది. విదేశీ పర్యటనలకు మోదీ వెళ్లినప్పుడు వివిధ ఏర్పాట్ల కోసం అక్కడి దౌత్య కార్యాలయాలు ఎంత ఖర్చు చేశాయో వెల్లడించాలని రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2021-24 మధ్య ప్రధాని విదేశీ పర్యటనకు అయిన ఖర్చు రూ.295 కోట్లుగా పేర్కొన్నారు. 2025లో ఫ్రాన్స్ పర్యటనకు రూ.25 కోట్లకుపైగా ఖర్చైనట్లు తెలిపారు. ఇక 2023 జూన్‌లో ప్రధాని అమెరికా పర్యటనకు రూ.22 కోట్లకుపైగా ఖర్చైనట్లు వెల్లడించారు. అయితే, ఈ ఏడాది మార్చిలో జరిగిన సమావేశాల్లో 2022 నుంచి 2024 డిసెంబర్ వరకూ ప్రధాని 38 విదేశీ పర్యటనలకు వెళ్లినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలకు గానూ రూ.258 కోట్లు ఖర్చైనట్లు ప్రకటించింది. 2021-24 మధ్య ప్రధాని మోదీ అమెరికా, జపాన్, జర్మనీ, కువైట్, డెన్మార్క్, ఫ్రాన్స్, యూఏఈ, నేపాల్, ఇండోనేషియా, ఆస్ట్రేలియా, ఈజిప్ట్, దక్షిణాఫ్రికా, గ్రీస్, పోలాండ్, ఉక్రెయిన్, రష్యా, ఇటలీ, బ్రెజిల్, గయానా, బంగ్లాదేశ్, ఇటలీ, యూకేలో పర్యటించారు. కేంద్రం పంచుకున్న డేటా ప్రకారం.. ప్రధాని 2024లో రష్యా, ఉక్రెయిన్, యూఎస్, బ్రెజిల్ సహా 16 దేశాల్లో పర్యటించారు. ఆ పర్యటనకు దాదాపు 109 కోట్లు ఖర్చైంది. అంతకు ముందు ఏడాది అంటే 2023లో ప్రధాని ఈజిప్ట్ పర్యటనకు ప్రకటనలు, ప్రసారాల కోసం దాదాపు రూ.11.90 లక్షలు ఖర్చు చేసినట్లు పేర్కొంది. 2023 జూన్‌లో ప్రధాని అమెరికా పర్యటనకు రూ.22 కోట్లకుపైగా ఖర్చైనట్లు వెల్లడించారు. మొత్తం 2023లో ప్రధాని పర్యటనలకు దాదాపు రూ.93 కోట్లు ఖర్చైంది. ఇక 2022లో ప్రధాని పర్యటనలకు రూ.55.82 కోట్లు ఖర్చైంది. ఆ ఏడాది జర్మనీ రూ. 9,44,41,562, డెన్మార్క్ రూ. 5,47,46,921, ఫ్రాన్స్ రూ. 1,95,03,918, నేపాల్ రూ. 80,01,483, జపాన్ రూ. 8,68,99,372 దేశాలన సందర్శించారు. ఇక 2021లో మోదీ విదేశీ పర్యటనల ఖర్చు రూ. 36 కోట్లు. బంగ్లాదేశ్ రూ. 1,00,71,288, అమెరికా రూ. 19,63,27,806, ఇటలీ రూ. 6,90,49,376, యూకే రూ. 8,57,41,408 దేశాలను ప్రధాని సందర్శించారు.

## ఆగస్టు 2న తెలంగాణ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం ఆగస్టు 2వ తేదీన నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో 519 మంది యుజీ, పీజీ, పీహెచ్డీ విద్యార్థులు పట్టాలు అందుకోనున్నారని ప్రకటించారు. ఈ మేరకు ఒక ప్రకటనలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించనున్న ఈ స్నాతకోత్సవంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఎల్జాట్ ముఖ్య అతిథిగా పాల్గొని స్నాతకోత్సవ ప్రసంగం చేయనున్నారని వెల్లడించారు. రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షతన ఈ స్నాతకోత్సవం జరగనుందని వివరించారు. ఈ కార్యక్రమంలో 322 మంది మహిళలు, 197 మంది పురుషులు పట్టాలు అందుకోనున్నారని వివరించారు. వారిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన 9 మంది, పీజీ, పీహెచ్డీ విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నామని పేర్కొన్నారు.

## ఇద్దరు రైతుల ఆత్మహత్య

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** వ్యవసాయం కలిసి రాక, సాగు నిమిత్తం తెచ్చిన అప్పులు తీరే మార్గం కనిపించక రాష్ట్రంలో ఇరువురు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎన్నో ఆశల తో అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలు సరైన దిగుబడులు రాక దిక్కుతోచని స్థితిలో రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాలకు చెందిన ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. తెలంగాణలోని భువనగిరి జిల్లా వలిగొండ మండలం కంచనపల్లికి చెందిన వడ్డెబోయిన మీనయ్య (60) పత్తి సాగు చేయగా సరైన దిగుబడి రాకపోవడంతో నష్టాల పాలయ్యారు. దీంతో తెచ్చిన అప్పులు తీర్చే మార్గం కనిపంచక పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే రాష్ట్రంలోని భూపాలపల్లి జిల్లా కాటారం మండలం చింతకానికి చెందిన గోల్కొండ పోచం (64) తన చేలో పత్తి, మిర్చి సాగు చేశారు. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలించక సరైన దిగుబడులు రాలేదు. ఫలితంగా నష్టాలపాలై అప్పు ఎలా తీర్చాలన్న బెంగతో పురుగు మందు తాగి బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు.




సైబర్ వారియర్లు, సైబర్ క్రైం పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్

## టిజిసిఎస్‌బి ఆధ్వర్యంలో సైబర్ వారియర్లు, అధికారులకు ప్రత్యేక శిక్షణ

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్ బి) ఆధ్వర్యంలో సైబర్ వారియర్లు, సైబర్ సెక్యూరిటీ విభాగంలో పనిచేసే అధికారులకు శుక్రవారం నాడు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం జరిగింది. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లోని టిజిసిఎస్‌బి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ శిఖా గోయల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయని తెలిపారు. సైబర్ నేరాలను నివారించేం దుకు పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ప్రజలు నిరంతరం అప్రమత్తంగా వుండా ల్సిన అవసరం వుందని ఆమె అన్నారు. ఈ క్రమంలోనే సైబర్ నేరాలపై విచారణ చేసే అధికారులకు వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించిన ట్లు ఆమె తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సైబర్ నేరాలపై విచారణతో పాటు ఫోరెన్సిలో తాజాగా వున్న సాధనాలు, సాంకేతికతల గురించి వివరించడం, నేరగాళ్ల ను పట్టుకునేందుకు అనుసరించాల్సి వ్యూహాలను ఎలా అమలు చేయాలనే దానిపై చెప్పడం జరిగిందని ఆమె వెల్లడించారు. ఈ శిక్షణలో 25 మంది సైబర్ వారియర్లతో పాటు సైబర్ క్రైం పోలీసు స్టేషన్ల నుంచి 15 మంది అధికారులను ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. సైబర్ నేరాలపై విచారించే అధికారులు నిరంతరం అప్రమత్తంగా వుం డడంతో పాటు విచారణ సమయంలో వేగవంతంగా వ్యవహరించాలని శిఖా గోయల్ కోరారు. నిర్లిప్తత ఎంతమాత్రం పనికిరాదని ఆమె హెచ్చరించారు. రాష్ట్రంలో 2024తో పోలిస్తే 2025లో సైబర్ నేరాలు 16 శాతం తగ్గాయని గణాంకాలు చెబుతున్నాయని ఆమె అన్నారు. అయితే దేశ వ్యాప్తంగా ఈ నేరాలు 37 శాతం పెరిగాయని ఆమె తెలి పారు. ఈ ఏడాది రాష్ట్రంలో సైబర్ నేరాల వల్ల బాధితులు 726 కోట్ల రూపాయలు నష్టపోతు ఇందులో 105 కోట్ల రూపాయలను జప్తు చేసి బాధితులకు అందజేసినట్లు శిఖా గోయల్ తెలిపారు. దీంతో పాటు 1657 సిం కార్డులు, 7178 ఐఎంఈఐ. 565 యుఆర్ఎల్‌ను బ్లాక్ చేశామని రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ నేరాలపై చైతన్య కార్యక్రమాలు చేబట్టామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిసిఎస్‌బి ఎస్‌పి హర్షవర్ధన్ సహ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రేవంత్ అరాచకాల నుంచి తెలంగాణను రక్షించేది కెసిఆర్ ఒక్కరే

### కామారెడ్డిలో దళితుల ఆత్మగౌరవ గర్జన సభలో కెటిఆర్ ప్రసంగం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 25:** రాష్ట్రంలో దళితులను అణిచివేతకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని త్వరలోనే గద్దెదించుతామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు అన్నారు. కామారెడ్డి జిల్లా, లింగంపేట్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన దళితుల ఆత్మగౌరవ గర్జన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితుల పట్ల ప్రభుత్వం అమానవీయంగా ప్రవర్తిస్తోందని మండిపడ్డారు. దళిత నాయకుడు ముదాం సాయిలుకు జరిగిన అవమానం క్షమించరానిదని అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలో మాజీ ఎంపిపి సాయిలుకు పోలీసులు చేసిన అవమానం క్షమించరానిదన్నారు. సాయిలుకు జరిగిన అవమానాన్ని తెలంగాణకు జరిగిన అవమానంగా భావిస్తున్నా మని పేర్కొన్నారు. తమ పార్టీ అధినేత కెసిఆర్ ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చానని అన్నారు. రేవంత్ అరాచకాల నుంచి తెలంగాణను రక్షించేది కెసిఆర్ ఒక్కరేనని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో దళితుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ట్యాంక్‌బండ్ వద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెట్టామని అన్నారు. అంబేద్కర్ బోధించిన సూత్రాలను ఒంటబట్టించుకుని కెసిఆర్ 14 ఏళ్ల పోరాడితే తెలంగాణ సాధ్యమైందని అన్నారు. అంబేద్కర్ పేరును సెక్రటేరియట్‌కు పెట్టుకున్నామని. 18శాతం దళిత జనాభాకు న్యాయం చేయాలని ఉద్దేశంతో దళితబంధును తమ ప్రభుత్వం దశలవారీగా అమలు చేసిందని వివరించారు. ఎల్లారెడ్డి మాజీ ఎంఎల్ఎ జాజాల సురేందర్ మాట్లాడుతూ.. దళితులు కష్టపడి ఇళ్లు కట్టుకుంటే స్థానిక ఎమ్మెల్యే ఓర్వలేకపోతున్నాడని ఆరోపించారు. దళితుడైన జెసిబి డ్రైవర్ ఒక్కో రూపాయి కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే నిర్దాక్షిణ్యంగా కూల్చేశారన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో దళితులను అవమానిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల దయేరియాతో తండ్రీకొడుకులు మృతి చెందితే కాంగ్రెస్ నాయకులు ఒక్కరు కూడా పరామర్శించలేదని ధ్వజమెత్తారు. గ్రామాల్లో పారిశుద్ధం అధ్వానంగా ఉన్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం నిరంకుశ పాలనలో ఉందని చెప్పేందుకు ఇదొక సాక్ష్యమని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ కార్యకర్తలకు అన్యాయం జరిగితే ఊరుకోబోమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనకు లెక్కకు లెక్క అప్పగించాల్సిందేనని మాజీ మంత్రి, ఎంఎల్ఎ ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. దానికి బదులుగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి లెక్క అప్పజెబుదామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు పాలనలో బిఆర్ఎస్ కార్యకర్తలకు ఎక్కడ ఇబ్బంది ఎదురైనా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముదాం సాయిలుకు జరిగిన అవమానాన్ని తెలుసుకున్న కెటిఆర్ అక్కడికి వెళ్లాలని తమతో మాట్లాడారన్నారు. తాను సిఎంగా ఉన్నన్ని రోజులు రాష్ట్రంలో సినిమా టికెట్ ధరలు పెంచే ప్రసక్తే లేదని పేర్కొన్న రేవంత్‌రెడ్డి హరిహర వీరమల్లు సినిమాకు రేట్లు ఎలా పెంచారని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. అక్కడ పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు ఉన్నారు కాబట్టి మెడ మీద కత్తి ఉంటుందని, అందుకే ఆ సినిమాకు రేట్లు పెంచారని ఆరోపించారు. తెలంగాణలో దుర్మార్గపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు అల్లాడుతున్నారని పార్టీ నేత ఆర్ఎస్ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. నిజానికి.. అబద్ధానికి మధ్య పోరాటం జరుగుతోందని.. ప్రజలు ఏవైపు ఉండాలో నిర్ణయించుకోవాలని పేర్కొన్నారు. కమిట్మెంట్, కెపాసిటీ, క్యాలిబర్, కరిష్మా ఉన్న నాయకుడు కెటిఆర్ అని అన్నారు. ఇప్పుడు ఉన్న బాధలను, కన్నీళ్లను కసిగా పెంచుకొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు ప్రతి ఇంటికి పోయి కడుపులో తలపెట్టి అప్పటి సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలను వివరించాలని సూచించారు.

# తెర

## కూలీ చాలా స్పెషల్




సూపర్ స్టార్ రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న కూలీ చిత్రంపై అంచనాలు పెరిగిపోయాయి. ఈ సినిమాలో నాగార్జున మెయిన్ విలన్‌గా నటిస్తున్నారు. ఆయన పాత్ర చాలా అద్భుతంగా ఉంటుందని శ్రుతి హాసన్ తెలిపారు. నాగార్జున నెగెటివ్ రోల్‌లో ఫెంటాస్టిక్‌గా నటించారని, ఆయనకు అందరూ సూపర్ ఫ్యాన్స్ అయిపోతారని ఆమె అన్నారు. ఈ మూవీలో నాగ్ చాలా కూల్‌గా కనిపిస్తారని శ్రుతి పేర్కొన్నారు.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో అక్కినేని నాగార్జున, ఉపేంద్ర, షౌబిన్ సాహిర్, సత్యరాజ్, శ్రుతి హాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ క్యామియో చేయగా.. పూజా హెగ్డే స్పెషల్ సాంగ్‌లో కనిపించనున్నారు. తాజాగా శ్రుతి హాసన్ ఈ సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. నాగ్ పాత్రకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. కూలీ సినిమాలో నాగార్జున మెయిన్ విలన్‌గా కనిపించనున్నారు. ఈ విషయాన్ని లోకేష్ కనగరాజ్ ఇదివరకే కన్ఫార్మ్ చేశారు. ఇప్పుడు శ్రుతి హాసన్ దీనిపై మాట్లాడుతూ.. ఆ పాత్రలో నాగ్ అద్భుతంగా నటించారని తెలిపారు. ఈ సినిమాతో ఆయనకు అందరూ సూపర్ ఫ్యాన్స్‌గా మారిపోయామని చెప్పారు. ఖినాగార్జున గారితో నాకు ఈ సినిమా కంటే ముందు నుంచే పరిచయముంది. ఆయన ఎల్లప్పుడూ ఛార్మింగ్ గా, వండర్ ఫుల్ గా ఉంటారు. ఈ మూవీలో ఆయనతో వర్క్ చేయడం ఎక్స్ట్రా స్పెషల్. ఎందుకంటే నాగ్ సార్ కి ఇది ఫస్ట్ నెగెటివ్ క్యారక్టర్. ఆయన ఆ పాత్రలో ఫెంటాస్టిక్‌గా నటించారు. నేను ఎప్పుడూ ఆయనకి అభిమానినే. కానీ ఇప్పుడు మేము సూపర్ ఫ్యాన్స్ అయిపోయాం. మీరు కనీసం ఊహించను కూడా ఊహించలేరు. అది మాత్రం చెప్పగలను. సినిమాలో ఆయన చాలా కూల్ గా కనిపిస్తారు అని శ్రుతి అన్నారు. ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## బాలీవుడ్ బ్యూటీతో బాస్ డ్యాన్స్

మెగా కంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ విశ్వంభరఅప్డేట్స్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో మేకర్స్ మూవీ నుంచి ఇంట్రెస్టింగ్ అప్డేట్ పంచుకున్నారు. షూటింగ్ చివరి షెడ్యూల్ ప్రారంభమైనట్లు తెలిపారు. అంతేకాదు ఈ షెడ్యూల్‌లో బాస్ ఫ్యాన్స్‌కి కిక్కెకించే ఒక స్పెషల్ సాంగ్ షూట్ చేస్తున్నట్లు తెలియజేస్తూ ఫొటోను షేర్ చేశారు. ఈ ఫొటోలో లేడీ డాన్సర్స్ అంతా కలర్ ఫుల్ కాస్ట్యూమ్స్‌లో కనిపిస్తుండగా.. కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్, డైరెక్టర్ వశిష్ఠ మానిటర్‌లో చూస్తూ ఉన్నారు. మెగాస్టార్ బ్యాక్ సైడ్ లుక్‌లో స్టైలిష్‌గా కనిపించారు. అయితే విశ్వంభరలో ఒక స్పెషల్ నెంబర్ ఉండబోతుందని ఇప్పటికే వార్తలు వినిపించారు. ఇప్పుడు ఈ ఫొటోలతో అది నిజమేనని అర్థమవుతోంది. ఈ సాంగ్‌లో బాలీవుడ్ బ్యూటీ మోనీ రాయ్ మెగాస్టార్ జోడీగా స్టెప్పులేయనున్నట్లు తెలుస్తోంది. మోని రాయ్ స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్, ఆమెకున్న క్రేజ్ సినిమాకు ప్లస్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు.

సోషియో ఫాంటసీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇందులో వీఎఫెక్స్ ప్రధాన ఆకర్షణగా నిల్వనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే విడుదలైన టీజర్‌లో గ్రాఫిక్స్ నాసిరకంగా ఉన్నాయని విమర్శలు రావడంతో.. నిర్మాతలు వీఎఫెక్స్ విషయంలో మరింత శ్రద్ధ వహిస్తున్నారు. ప్రేక్షకులకు మంచి అనుభవాన్ని అందించాలనే ఉద్దేశంతో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో కలిసి పనిచేస్తున్నారు. దీని కారణంగానే విడుదల కూడా ఆలస్యమవుతూ వస్తుందని టాక్. ఈ సినిమాలో మెగాస్టార్ సరసన



త్రిష కృష్ణన్ కథానాయికగా నటిస్తోంది. దాదాపు 18 ఏళ్ల గ్యాప్ తర్వాత మళ్ళీ చిరంజీవి, త్రిష కలిసి స్క్రీన్ పై కనిపించబోతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విశ్వంభరను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



## ఒకేరోజు 15 సినిమాలు

మూవీ మొఘల్ డాక్టర్ డి.రామానాయుడు తర్వాత అత్యధిక చిత్రాలు నిర్మించిన వ్యక్తిగా, శతాధిక చిత్ర నిర్మాతల్లో రెండవ వాడిగా ఘనతకెక్కిన భీమవరం టాకీస్ అధినేత తుమ్మలపల్లి రామసత్యనారాయణ... ప్రపంచ సినిమా చరిత్రలోనే తొలిసారిగా ఒకేసారి 15 చిత్రాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. ప్రపంచ రికార్డుగా నమోదు కానున్న ఈ చారిత్రక ఘట్టానికి హైద్రాబాద్ లోని సారథి స్టూడియో వేదిక కానుంది. సినిమా రంగంతోపాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ ప్రపంచ రికార్డుకు ప్రత్యక్ష సాక్షులు కానున్నారు. మన భారత స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఈ అరుదైన ఘట్టం శ్రీకారం చుట్టుకోనుంది.

## ఆయన వల్లే నేను ఈ స్థానంలో ఉన్నా



యంగ్ హీరో నరేష్ అగస్త్య, దర్శకుడు విపిన్ దర్శకత్వంలో, సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై ఉమా దేవి కోట నిర్మించిన మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా ఖిమేఘాలు చెప్పిన ప్రేమ కథఖిలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. చిత్రంలో రబియా ఖతూన్ కథానాయిక. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు టీజర్లు, సాంగ్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ చిత్రం ఆగస్ట్ 22న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు.

ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో నరేష్ అగస్త్య మాట్లాడుతూ.. ట్రైలర్ మీ అందరికీ నచ్చిడం ఆనందంగా వుంది. ఆగస్టు 22న సినిమా రిలీజ్ అవుతుంది. హీరో కంటే అందంగా ఉండే కామియో కావాలి. అందుకే వెతికి వెతికి రాజాని పట్టుకున్నారు(నవ్వుతూ). తను నాకు మంచి స్నేహితుడు. రబియా చాలా అద్భుతంగా నటించింది. వెరీ బ్యూటీఫుల్ క్లీన్ ఫిలిం ఇది. ప్రొడ్యూసర్ ఉమాదేవి కోట మాట్లాడుతూ.. మీరందరూ ఆదరిస్తే మరిన్ని సినిమాలు చేయాలని ఉంది అన్నారు. హీరోయిన్ రబియా మాట్లాడుతూ.. నా ఫస్ట్ డైరెక్టర్ ధనుష్. ఆయన వల్లే నేను ఇప్పుడు ఈ స్థానంలో నిలుచున్నాను అన్నారు. డైరెక్టర్ విపిన్ మాట్లాడుతూ సినామా కోసం చాలా ఎఫర్ట్ పెట్టామన్నారు. యాక్టర్ రాజా మాట్లాడుతూ చాలా క్లియర్ విజన్‌తో డైరెక్టర్ మోహన్ కృష్ణ మా అందరిని చాలా డిఫరెంట్‌గా చూపించారు అన్నారు.




## అభినయ కృష్ణ దర్శకత్వంలో కామాఖ్య

సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో ఓ థ్రిల్లింగ్ మూవీ తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి కామాఖ్య అనే పవర్ ఫుల్ టైటిల్ ఖరారు చేశారు. డివైన్ వైబ్‌తో వున్న టైటిల్ పోస్టర్ అదిరిపోయింది.

డైరెక్టర్ అభినయ కృష్ణ ఈ సినిమా కోసం మిస్టీరియస్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ యూనిక్ కథని సిద్ధం చేశారు. ఈ చిత్రంలో ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి గ్యాని సంగీతం అందిస్తున్నారు. రమేష్ కుశేందర్ రెడ్డి డీవోపీగా వర్క్ చేస్తున్నారు. భూపతి యాదగిరి ఆర్ట్ డైరెక్టర్. ఈచిత్రానికి సంబధించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.

## కంటెంట్‌పై ఫోకస్



వరసగా సినిమాలైతే చేస్తున్నారు కానీ ఎందుకు చేస్తున్నారో కూడా శ్రీలీలకు కూడా అర్థం కావట్లేదు. అసలెప్పుడు వస్తున్నాయో.. ఎప్పుడెళ్తున్నాయో కూడా తెలియట్లేదు ఆమె సినిమాలు. ఈ ఏడాది రాబిన్ హుడ్, జూనియర్ సినిమాలతో వచ్చినా ఫలితం లేదు. కంటెంట్‌పై ఫోకస్ పెట్టమ్మా.. గ్యాప్ తీసుకున్నా పర్లేదంటున్నారు ఫ్యాన్స్. స్ట్రాంగ్ కమ్‌బ్యాక్ కోసం చూస్తున్నారు శ్రీలీల. రవితేజ మాస్ జాతర, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలతో పాటు తమిళంలో శివకార్తికేయన్ పరాశక్తి.. హిందీలో కార్తిక్ ఆర్యన్ సినిమాల్లో నటిస్తున్నారు ఈ బ్యూటీ. వీటిలో శ్రీలీలకు కమ్ బ్యాక్ ఇచ్చే సినిమా ఏదవుతుందనేది ఆసక్తికరంగా మారింది. మిస్టర్ బచ్చన్ ఫేమ్ భాగ్య శ్రీ బోర్సే సైతం మాంచి కమ్ బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు. విజయ్ దేవరకొండ కింగ్డమ్ జూలై




31న రానుంది.. అలాగే దుల్కర్ సల్మాన్ కాంతా, రామ్ ఆంధ్రాకింగ్ తాలూక సినిమాలు 2025లోనే రానున్నాయి. వీటితో కమ్ బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు ఈ బ్యూటీ. ఇక రష్మిక మందన్నకు హిట్స్ ఉన్నాయి కానీ గ్యాప్ ఎక్కువగా ఇస్తున్నారు. పుష్ప 2 తర్వాత మొన్న



కుబేరాతో వచ్చారు. త్వరలోనే రెయిన్ బో, గాళ్ ఫ్రెండ్ అంటూ గ్యాప్ లేకుండా వస్తున్నారు. హిట్ 3 బానే ఆడినా శ్రీనిధి శెట్టి పేరు పెద్దగా వినిపించట్లేదు. అక్టోబర్ 17న తెలుసు కదా అంటూ మరోసారి పలకరించబోతున్నారు ఈ బ్యూటీ. అలాగే మంచి కథ దొరికితే తెలుగులో నటిస్తానంటున్నారు సమంత. ఖుషీ తర్వాత ఈమె కనబడలేదు. త్రిష సినిమాలు చేస్తున్నా.. విజయాల్లేవు. ఈమె ఆశలన్నీ విశ్వంభరపైనే ఉన్నాయి. మరి వీళ్లలో ఎంతమందికి కోరుకున్న కమ్ బ్యాక్ వస్తుందో చూడాలిక.



## షారుక్‌కు గాయాలు



ఇండియన్ సినిమాలో మోస్ట్ హార్డ్ వర్కింగ్ యాక్టర్స్‌లో షారుక్ ఖాన్ ఒకరు. ఎలాంటి సినీ బ్యాగ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన కింగ్ ఖాన్.. తన సినిమాలతో గత మూడు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్నారు. 60 ఏళ్ల వయసులోనూ రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తున్నారు. సినీ ప్రియులను ఆకట్టుకోడానికి యంగ్ హీరోలకు పోటీగా రిస్క్ స్టంట్స్ చేస్తున్నారు. అయితే ఇప్పుడు బాలీవుడ్ బాద్ షా తన అప్ కమింగ్ సినిమా కోసం ఓ ఇంటెన్స్ యాక్షన్ సీన్ షూటింగ్ చేస్తుండగా, ప్రమాదం జరిగి గాయాలపాలైనట్లుగా వార్తలు వస్తున్నాయి. షారుక్ ఖాన్ ప్రస్తుతం ఖికింగ్ఖి అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఈ యాక్షన్ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమా సెట్స్ లోనే షారుక్ గాయపడినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇటీవల ముంబైలోని గోల్డెన్ టొబాకో స్టూడియోలో ఓ యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేయగా.. షారుక్ డూప్ లేకుండా ఆ స్టంట్ చేశారట. ఈ సందర్భంగా ఆయనకు గాయాలైనట్లు కథనాలు పేర్కొన్నాయి. కింగ్ షూటింగ్‌లో ప్రమాదం జరగడంతో, అత్యవసర చికిత్స కోసం షారుక్ తన టీంతో కలిసి అమెరికా వెళ్లినట్లు ఆంగ్ల మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే అది తీవ్రమైన గాయం కాదని, కండరాల గాయం అని చిత్ర వర్గాలు తెలిపాయి. వైద్యులు ఒక నెల రోజుల పాటు రెస్ట్ తీసుకోవాలని సూచించినట్లుగా తెలుస్తోంది. దీంతో కింగ్ షూటింగ్‌ను సెప్టెంబర్‌కు వాయిదా వేసినట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

## నన్ను సూపర్ స్టార్‌గా చూశారు

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ కింగ్డమ్. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా మూవీలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశకు చేరుకుంది. మరో ఆరు రోజుల్లో ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. మూవీ ప్రమోషన్స్‌లో సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కూడా భాగమయ్యారు. కింగ్డమ్ బాయ్స్ పాడ్‌కాస్ట్ పేరుతో సందీప్‌రెడ్డి వంగాతో కలిసి విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి స్పెషల్ చిట్ చాట్ నిర్వహించారు. సినిమాకి సంబంధించిన సంగతులతో పాటుగా పలు ఇంట్రెస్టింగ్ విషయాలను పంచుకున్నారు. శ్రీలంకలోని 200 ఏళ్ల క్రితం నాటి జైల్లో కింగ్డమ్ సినిమా షూటింగ్ జరిగిందని, పూర్తిగా వర్షంలో తీసిన 13 నిమిషాల కీలకమైన సీక్వెన్స్ ఉంటుందని డైరెక్టర్ గౌతమ్ చెప్పారు. సెకండాఫ్‌లో వైలెన్స్ చాలా ఎక్కువగా ఉంటుందని చెప్పిన విజయ్.. ఇటీవలే కింగ్డమ్ గంట సినిమా చూశానని, ఆర్ఆర్ లేకుండా చూసినా అద్భుతంగా అనిపించిందని సందీప్ రెడ్డి చెప్పారు. ప్రమోషనల్ కంటెంట్ చాలా బాగుందని, తప్పకుండా సక్సెస్ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెళ్లి చూపులు రిలీజైన రోజే విజయ్ దేవరకొండకి ఓ కథ చెప్పానని, రెండు సమోసాలు తిని స్టోరీ తనకు ఎక్కలేదని చెప్పి వెళ్లిపోయాడని గౌతమ్ చెప్పారు. కింగ్డమ్ అనేది గ్యాంగ్ స్టర్ బ్యాక్ డ్రాప్ మూవీ అని, అన్నదమ్ముల సెంటిమెంట్ ప్రధానంగా ఉంటుందని దేవరకొండ విజయ్ వెల్లడించారు. తానే స్వయంగా గౌతమ్‌కి ఫోన్ చేసి సినిమా చేద్దామని



అడిగినట్లుగా చెప్పారు.

అర్జున్ రెడ్డి మూవీ టైంలోనే సందీప్ రెడ్డి వంగా తనలో సూపర్ స్టార్‌ని చూశాడని విజయ్ దేవరకొండ చెప్పారు. అప్పట్లోనే తనని యాక్టర్‌గా కాకుండా, సూపర్ స్టార్‌లా ట్రీట్ చేసేవాడని తెలిపారు. యానిమల సినిమా ఫైనల్ కట్ 3 గంటల 30 నిమిషాలు వచ్చిందని, చివరకు మరో 7 నిమిషాలు ట్రిమ్ చేసానని సందీప్ వెల్లడించారు. అయితే చాలా మంచి సీన్స్ లేపేసానని, ఆ విషయంలో చాలా రిగ్రెట్ అవుతున్నానని పేర్కొన్నారు. విజయ్, సందీప్, గౌతమ్‌లు కింగ్డమ్ బాయ్స్ పాడ్‌కాస్ట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## మహారాజుల విడిదిలో నిద్రలేని రాత్రులు



హారర్ సినిమాలు ఆద్యంతం ఎంతో ఎంగేజింగ్‌గా సాగుతాయి.. భయపెట్టే స్టోరీలు, సస్పెన్స్‌కు గురిచేసే సీన్స్ ఆడియెన్స్‌కు మంచి థ్రిల్‌ను అందిస్తాయి. ఇప్పుడు మనం చర్చించుకోబోయే సినిమా ఇదే జానర్ లో నెక్స్ట్ లెవెల్ అని చెప్పుకోవచ్చు. ఈ మూవీ హారర్ జానర్‌లో ఒక సరికొత్త ట్రెండ్ ను క్రియేట్ చేసింది. ఈ సినిమా కేవలం ఆడియెన్స్‌ను మాత్రమే కాదు.. ఇందులో నటించిన యాక్టర్స్‌ను కూడా భయ పెట్టింది. వారు చాలా రోజులు నిద్రలేని రాత్రులు గడిపారు. ఈ సినిమా షూటింగ్ ఊటీలోని ఫెర్న్‌హిల్ హోటల్, ఫైన్ ఫారెస్ట్, లారెన్స్ స్కూల్‌లో జరిగింది. ఈ ప్రాంతాల్లో నిజంగానే దెయ్యాలు ఉన్నాయనే ప్రచారం ఉంది. ఇందులో ఫేర్న్ హిల్ హోటల్ ఒకప్పుడు మైసూర్ మహారాజుల విడిది. ఈ హోటల్‌లో దెయ్యాలు, ఆత్మలు సంచరిస్తున్నాయని ప్రచారంలో ఉంది. అందుకే షూటింగ్ టైమ్ లో సెట్‌లో జరిగిన కొన్ని సంఘటనలు నటీనటులను చాలా భయపెట్టాయట. ఒకసారి హోటల్‌లో పైఅంతస్తు లేనప్పటికీ ఫర్నీచర్ జరుపుతున్న సౌండ్స్ వినిపించాయని ఇందులో నటించిన హీరోయిన్ ఒక సందర్భంలో చెప్పుకొచ్చింది. రాత్రి పూట డ్యాన్సర్లకు కూడా అలాంటి వింతైన, భయానక శబ్దాలు వినిపించాయట. అలాగే డాక్టర్ అంబేడ్కర్ ఫొటో జారిపడిందని.. అది కెమెరాలో రికార్డ్ అయ్యిందని కూడా సదరు హీరోయిన్ చెప్పింది. ఒక రాత్రి షూటింగ్ జరుగుతుండగా.. ఒక అమ్మాయి పాట పాడుతున్న గొంతు తనతో పాటు అందరికీ వినిపించిందని హీరోయిన్ చెప్పుకొచ్చింది.

ఇలా షూటింగ్ జరుగుతుండగానే యాక్టర్లను భయ పెట్టిన ఆ హారర్ సినిమాపేరు రాజ్. 2002లో రిలీజైన ఈ సినిమాలో బిపాషా బసు, డీనో మోరియా, మాలిని శర్మ, అశుతోష్ రాణా, విశ్వజీత్ ప్రధాన్ లీడ్ రోల్స్ చేశారు. విక్రమ్ భట్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సంజన (బిపాషా బసు), ఆదిత్య (డీనో మోరియా) దంపతులు ఊటీలోని ఒక బంగ్లాకు వెళతారు. అక్కడ వారికి కొన్ని భయంకరమైన అనుభవాలు ఎదురవుతాయి. ఒక శక్తి వారిని వెంటాడటం మొదలుపెడుతుంది? మరి అది వారి జీవితాలను ఎలా ప్రభావితం చేసింది. సంజన, ఆదిత్యలు బయటపడ్డారా? అన్నదే రాజ్ సినిమా కథ. ప్రస్తుతం ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది.

## వార్ వన్ సైడ్ ఎవరికి ?

ఆర్ఆర్ఆర్ తరువాత అంతే హైప్‌తో వస్తున్న మరో మల్టీస్టారర్ వార్ 2. బాలీవుడ్ గ్రీకు వీరుడు హృతిక్ రోషన్, ఎన్టీఆర్ మల్టీస్టారర్‌గా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న వార్ 2 పైనే ప్రస్తుతం ఇండస్ట్రీ కళ్లన్నీ ఉన్నాయి. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు సినిమాపై అంచనాలను పెంచేసాయి. ఇక ఇప్పుడు ట్రైలర్ చూశాకా.. అందరికీ ఒక క్లారిటీ వచ్చింది. జక్కన్న చేసిన తప్పు అయాన్ చేయలేదనిపిస్తుంది. ఇద్దరు హీరోలు ఉంటే.. వారిద్దరికీ సరిసమానమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో పాటు డైలాగ్స్‌ను కూడా పెట్టి కట్ చేసిన విధానం ఆకట్టుకుంటుంది.



ఇక వార్ 2 ను అనౌన్స్ చేసిన దగ్గరనుంచి హృతిక్ వర్సెస్ ఎన్టీఆర్ ట్రోల్స్ నడుస్తూనే ఉన్నాయి. ట్రైలర్ రిలీజ్ తరువాత లెక్కలు తారుమారు అయ్యాయి అని చెప్పొచ్చు. మొదట హృతిక్.. ఎన్టీఆర్ ను డామినేట్ చేస్తాడు అని ట్రోల్ చేసినవారే ట్రైలర్ చూసాక ఎన్టీఆరే హృతిక్ ను డామినేట్ చేసేలా కనిపిస్తున్నాడే అని చెప్పుకొస్తున్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ యాక్టింగ్.. హృతిక్‌తో కనిపించిన ప్రతి సన్నివేశంలో ఎన్టీఆర్ తానేంటో నిరూపించుకోవడానికే ఎంతో కసితో చేసినట్లు కనిపించాడు. కొన్ని సీన్స్‌లో ఫ్యాన్స్ చెప్పినట్లే హృతిక్‌ను డామినేట్ చేసినట్లే కనిపించాడు. మొత్తానికి వార్ 2.. ఇద్దరు సైనికుల మధ్య యుద్ధం అని అనడం కన్నా ఇద్దరు స్టార్ హీరోల మధ్య యుద్ధం అని చెప్పొచ్చు. లుక్ పరంగా హృతిక్‌ను కొట్టేవారు లేరు. వార్ 2లో కూడా అలాగే కనిపించాడు. ఎన్టీఆర్ లుక్‌లో కొన్ని లోపాలున్నా.. నటనలో అతడిని కొట్టేవారు లేరు. ఇక ఇద్దరికీ సమ ప్రాధాన్యత ఇచ్చి.. అయాన్ తెలుగు అభిమానుల ఆగ్రహం నుంచి తప్పించుకున్నాడు. ట్రైలర్ వరకు ఇది ఓకే.. సినిమాలో ఏ చిన్న తేడా వచ్చినా.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఉగ్రరూపం దాలుస్తారు అని చెప్పడంలో ఆశ్చర్యం లేదు. మరి వార్ 2.. ఎవరికి వార్ వన్ సైడ్ అయ్యేలా చేస్తుంది.

## వినాయక చవితి కానుకగా సుందరకాండ

ప్రముఖ నటుడు నారా రోహిత్ బర్త్ డే జూలై 25. ఈ సందర్భంగా అతని తాజా చిత్రం సుందరకాండ రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ఆగస్ట్ 27న ఈ సినిమా వినాయక చవితి కానుకగా విడుదల కాబోతోంది. ఈ విషయాన్ని ఓ స్పెషల్ వీడియో ద్వారా తెలియచేశారు. ఆగస్ట్ 27 అంటే బుధవారం. లాంగ్ వీకెండ్ ఈ మూవీకి కలిసివస్తుందని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు.



ఇప్పటికే వెంకటేశ్ హీరోగా కె. రాఘవేంద్రరావు సుందర కాండ మూవీని తెరకెక్కించారు. అలానే అల్లరిఖి నరేశ్ హీరోగా బాపు ఓ సుందరకాండను రూపొందించారు. వెంకీ సుందరకాండ సూపర్ హిట్ అయితే నరేశ్ సుందర కాండ భారీ పరాజయాన్ని పొందింది. అయితే సుందరకాండ పేరుతోనే ఇప్పుడు నారా రోహిత్ హీరోగా ఓ సినిమా రూపుదిద్దుకుంది. ఇది నారా రోహిత్ కు 20వ చిత్రం కాగా, ఈ సినిమా ద్వారా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి దీనిని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శ్రీదేవి విజయ్ కుమార్‌తో పాటు వృతి వాఘాని హీరోయిన్లుగా నటిస్తున్నారు. దీనికి లియోన్ జేమ్స సంగీతం సమకూర్చారు. సిద్ శ్రీరామ్ పాడిన ఫస్ట్ సింగిల్ బహుసా బహుసా చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రానికి ప్రదీప్ ఎం వర్మ సినిమాటోగ్రఫీ అందించారు.

# గంగానది ప్రక్షాళన కోసం



**వారణాసి... గంగా ఘాట్‌లన్నీ** మంత్రాలతో నిండిపోయి ఉంటాయి. భక్తి పారవశ్యంతో నిండిపోవాలనీ, ఆ గంగా నదిలో స్నానమాచరించాలనీ, అయినవాళ్లకి పుణ్యలోకాలు దక్కాలనీ... ఇలా ఎంతోమంది నిత్యం అక్కడికి చేరుకుంటారు. ఈ క్రమంలో వాళ్లు వదిలే చెత్త తక్కువేమీ కాదు. దీంతో గంగానదీ కలుషితమవుతోంది. దీనికి కొంతైనా అడ్డుకట్ట వేయాలనుకున్నారు కొందరు మహిళలు.

ఆ నిర్ణయం వాళ్లకి ఉపాధిని అందిస్తోంది. గంగానది స్నానమాచరించాక ఆ వస్త్రాలను చాలామంది అక్కడే వదిలేస్తుంటారు. ఆ వస్త్రాలన్నీ గుట్టల్లా పేరుకొని పోతున్నాయి. వాటికోనరూపమిస్తే మాగుంటుందని తలచారు అక్కడి ఐఎఎస్ ఆఫీసర్ అక్షత్ వర్మ. స్థానిక హోప్ వెల్ఫేర్ ఫౌండేషన్‌తో కలిసి మహిళలకు వస్త్రాలతో బ్యాగుల తయారీలో శిక్షణ ఇప్పించారు. అలా శిక్షణ తీసుకున్న కొందరు మహిళలు 2023 డిసెంబరులో 'గ్రీన్ ఆర్మీ'గా ఏర్పడ్డారు. ఆ వస్త్రాలను సేకరించి, బ్యాగులుగా కడుతున్నారు. దీనికోసం వాటిని శుభ్రపరచడం, శానిటైజ్ చేయడం వంటివి చేస్తారట. ఆపైనే బ్యాగులుగా మలుస్తారట. వీళ్లంతా ఒకప్పుడు ఇల్లుదాటనివారే. కుటుంబానికి తోడు నిలవొచ్చు. పుణ్యక్షేత్రాన్ని పర్యావరణ హితంగా మలచొచ్చన్న ఆలోచనతో ఈ క్రతువులో భాగమయ్యారు. నిజానికి తొలిరోజుల్లో ప్లాసిక్ట్ వాడకం తగ్గించొచ్చన్న ఆలోచనతో ఈ వస్త్రలను ఉచితంగా ఇచ్చారు ఆపై మున్సిపాలిటీ దుకాణాల వాళ్లు డబ్బులకు తీసుకోవడం మొదలుపెట్టారు. ఇక్కడి నీటి సమస్య ఎక్కువగా ఉండేది. అలాంటిది ఉన్న నీటిని కలుషితం చేయకుండా చూడమంటే పట్టించుకునేవారు కాదు. దీంతో మొదట బావులు, గుంటలు, నది చుట్టుపక్కల బాగు చేయడం మొదలుపెట్టాం. అప్పుడే ప్లాస్టిక్ కవర్లు, దుస్తుల వృథాని చూసినప్పుడు బాధ వేసేది. దానికో పరిష్కారం చూపగలిగినందుకు ఆనందంగా ఉంది. ఇక్కడ బ్యాగుల తయారీతోపాటు మార్పునకు కారణమవుతున్నామని గర్వంగా చెబుతారీ మహిళలు. □



# మహిళల హక్కుల కోసం పోరాటం చేసి..

మహిళా సమానత్వం, హక్కుల గురించి అందరూ మాట్లాడతారు.. కానీ వీటిపై పోరాటం చేసే వారు తక్కువమంది ఉంటారు. అలాంటి వారిలో వర్షా దేశ్‌పాండే గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆమె.. గత 35 ఏళ్లుగా లింగ సమానత్వం, భ్రూణహత్యల నిర్మూలన, మహిళల సంక్షేమం, హక్కులు, జనాభా నియంత్రణ, స్త్రీ ప్రత్యుత్పత్తి హక్కుల ఆరోగ్యం.. వీటిపై అలుపెరుగని పోరాటం చేస్తోంది.

ఓ సంస్థను నెలకొల్పిన ఆమె.. ఈ వేదికగా వివిధ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రస్తుత సమాజంలో మహిళల స్థితిగతులను కళ్లకు కడుతోంది. ఇలా ఆమె చేస్తోన్న ఈ కృషే తాజాగా ఆమెకు 'ఐక్యరాజ్య సమితి జనాభా పురస్కారం' దక్కేలా చేసింది. ఇందిరా గాంధీ, జేఆర్‌డీ టాటా తర్వాత ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్న మూడో భారతీయురాలిగా ఘనత సాధించారు వర్ష. ఈ నేపథ్యంలో ఈ మహిళా లీడర్ గురించి కొన్ని ఆసక్తికర విశేషాలు తెలుసుకుందాం..!

అలా ఎందుకు? అనిపించింది! వర్షది మహారాష్ట్రలోని సతారా జిల్లా. ఆమెది ముక్కుసూటి వ్యక్తిత్వం. తన మనసులోని భావాల్ని కుండబద్దలు కొట్టినట్లు ధైర్యంగా చెప్పడం ఆమెకు చిన్న వయసు నుంచే అలవాటు! అయితే 1980ల్లో తను కాలేజీలో చదువుకుంటున్నప్పుడు 'ముల్గి ఝాలి హో'అనే నాటకాన్ని చూసింది. మహిళ పైన వివక్షకు అద్దం పట్టేలా ఉన్న ఈ నాటకం ఆమె ఆలోచనలో పడేసింది. స్త్రీలకే ఇన్ని కష్టాలు? అసలు ఆడపిల్లల్ని ఈ సమాజం ఎందుకు వద్దనుకుంటోంది? అన్న ప్రశ్నలు నా మనసును మెలిపెట్టాయి. ఆపై ఇదే నాటకంలో నేనూ భాగమై.. ఊరూరా దీన్ని ప్రదర్శిస్తూ మహిళల వెతల్ని కళ్లకు కట్టడంలో కీలక పాత్ర పోషించా. అంతేకాదు.. స్త్రీలపై ఉన్న వివక్షను అంతమొందించి.. వారికీ పురుషులతో సమాన అవకాశాలు, హక్కులు కల్పించేలా. చేయడం మొదలుపెట్టా.. అంటోన్న వర్షం.. ఈ నాటకంతో తన కెరీర్ లక్ష్యమేంటో తనకు అవగతమైందని చెబుతోంది.

**లైబ్రరీతో మొదలు....** శక్తిని చాటుతూనే మహిళల సమానత్వం కోసం పోరాటం చేయాలని నిర్ణయించుకుంది "తొలుత 'ప్రతిశబ్ద' పేరుతో ఓ లైబ్రరీని ఏర్పాటుచేసింది. మహిళా రచయితలు రాసి వారి ఆత్మకథల్ని ఈ గ్రంథాలయంలో పొందారు. ఇవన్నీ చూశాక పెళ్లంటూ చేసుకుంటే నన్ను తనతో సమానంగా చూసే వ్యక్తి చేసుకోవాలనుకున్నా. ఓ రోజు పేపర్లో ఓ యాడ్ చూశా. కులమత భేదాలతో సంబంధం లేకుండా. కట్నంతో పనిలేకుండా వరుడికి వధువు కావాలని అందులో ఉంది. వెంటనే అతడిని సంప్రదించా. మొదట లేఖలతో మొదలైన మా పరిచయం నెమ్మదిగా ప్రేమలో పడే ఒకరినొకరం పూర్తిగా తెలుసుకున్నాక పెళ్లి చేసుకోవాలనుకున్నాం. అయితే మా ఇద్దరి కులాలు వేరు కావడంతో ఇంట్లో మా పెళ్లికి ఒప్పుకోలేదు. కానీ నెమ్మదిగా ఇంట్లో ఒప్పించి సంజీవ్ తో ఏడడుగులు నడిచా. ఆయన నా అభిరుచుల్ని అర్థం చేసుకొని ఆలోచనల్ని గౌరవిస్తారు. నాకు నచ్చిన అంశాల్లో నన్ను ప్రోత్సహిస్తారు. చాలా మంది పెళ్లయ్యాక తమ స్వేచ్ఛను కోల్పోతారు. కానీ నాకు మాత్రం వివాహం తర్వాతే పూర్తి స్వేచ్ఛలభించినట్ల నిపించింది..అంటూ తన లవ్ లైఫ్ గురించి చెబుతారు వర్ష .సమస్యలకు సమాధానంగా..! ఇక పెళ్లి తర్వాత ఓవైపు ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తూనే.. మరో వైపు న్యాయవిద్యను పూర్తి చేశారు. వర్ష చదువు పూర్తి న్యాయ పట్టా పుచ్చుకున్నాక మహిళా హక్కుల పోరాటంపై పూర్తి దృష్టి పెట్టారామె. ఈ విధంగానే 1990లో 'దళిత్ మహిళా వికాస్ మండల్' అనే సంస్థను స్థాపించారు. తొలి అడుగుగా వివాహబంధంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలేంటో తెలుసుకునేందుకు జిల్లావ్యాప్తంగా ఓ చిన్నపాటి సర్వే చేశారు. వాళ్ల సమస్యలను అంతమొందించి.. వారి జీవితాల్లో వెలుగులు నింపాలనుకున్న ఆమె.. స్థానిక కలెక్టర్‌ని కలిసి ఆయా మహిళలకు సొంత రేషన్ కార్డులు ఇప్పించారు. అంతేకాదు..



వాళ్లకు జీవనోపాధి నైపుణ్యాలూ నేర్పించారు.జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 వేల మందికి పైగా మహిళలు తమ భర్త, అత్తింట్లో వేధింపులు, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలుసుకున్నారు. వీరికి ముఖ్యోద్దేశంతో ఇక్కడి కలెక్టర్ సహకారంతో మేం చేసిన తొలి ప్రయత్నం విజయవంతమైంది. పాకశాస్త్రంలో ప్రావీణ్యం ఉన్న ఆయా మహిళలకు చేయూతనందించాం.." అంటూ తాము ప్రారంభించిన పలు కార్యక్రమాల గురించి చెప్పారు. వర్ష. సమస్యలకు సమాధానంగా..! ఇక పెళ్లి తర్వాత ఓవైపు ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తూనే.. మరో వైపు న్యాయవిద్యను పూర్తి చేశారు. వర్ష చదువు పూర్తై న్యాయ పట్టా పుచ్చుకున్నాక మహిళా హక్కుల పోరాటంపై పూర్తి దృష్టి పెట్టారామె. ఈ విధంగానే 1990లో 'దళిత్ మహిళా వికాస్ మండల్' అనే సంస్థను స్థాపించారు. తొలి అడుగుగా వివాహబంధంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలేంటో తెలుసుకునేందుకు జిల్లావ్యాప్తంగా ఓ చిన్నపాటి సర్వే చేశారు. వాళ్ల సమస్యలను అంతమొందించి.. వారి జీవితాల్లో వెలుగులు నింపాలనుకున్న ఆమె. □

# తేలిక పట్టు అందాలు



శుభాల శ్రావణంతో పండుగలు మొదలు అయ్యాయి. పండుగలు, పెళ్లిళ్ల ఒకటేమిటి ఎన్నెన్నో కార్యక్రమాలు. వేడుక ఏదైనా లక్ష్మీకళ ఉట్టిపడేలా కనిపించాలని మగువల ఆరాటం. ఫాస్ట్ ఫ్యాషన్‌లో ఫ్యూజన్ ట్రెండ్స్ ఎన్నో రకాలు వచ్చిపోతుంటాయి. కానీ దక్షిణ భారతంలో మాత్రం ప్రత్యేక సందర్భం అంటే పట్టు కట్టాల్సిందే. వీటిల్లోనూ ఎన్నో రకాలు. మరి ఏం ఎంచుకోవాలన్న ప్రశ్న రానే వస్తుంది. కంచి, బెనారస్, మంగళగిరి, ఉప్పాడ సిల్క్‌ల హవా నిన్నమొన్నటి దాకా సాగింది. ఇప్పుడు వెంకటగిరి, నారాయణపేట గద్వాల పట్టుదే ట్రెండ్ అంతా. ఒకప్పుడు అమ్మా, అమ్మమ్మలు ఎంచుకున్న ఈ తరం అమ్మాయిలూ ఎంతో ఇష్టంగా కట్టుకుంటున్నారు. ఆధునికంగా తయారవుతున్నారు. తేలిగ్గానూ ఉండటం వల్ల ఎంతో సౌకర్యంగానూ ఉంటున్నాయి. పూజ చేసినప్పుడూ, పేరంటానికి వెళ్లినప్పుడూ అనువుగా ఉంటాయి. జరీ అంచుల ధగధగలు శ్రావణ శోభ కళ్లకు కట్టేస్తాయి. అలాంటి డిజన్లలో ఇవి కొన్ని.









# బెల్లం వెన్న పొంగనాలు



కావాల్సినవి : దోశ పిండి, కొబ్బరి, బెల్లం, క్యారెట్ తురుము-కప్పు చొప్పున, నెయ్యి- నాలుగు చెంచాలు, వెన్న-కప్పు, కాజు, బాదం, పిస్తా ముక్కలు-పావు కప్పు.

**తయారీ:** పెద్ద గిన్నెలో దోశ పిండి, కొబ్బరి, క్యారెట్ తురుము, వెన్న, ఎండు ఫలాల ముక్కలు వేసి బాగా కలపాలి. పొయ్యి వెలిగించి గిన్నె పెట్టి బెల్లం వేసి, తగినన్ని నీళ్లు పోసి తీగ పాకం తయారు చేసుకోవాలి. ఈ పాకాన్ని దోశ పిండిలో పోసి చక్కగా కలపాలి. పొంగనాల పెనంలో కాస్తంత నెయ్యి రాసి ఈ పిండిని పొంగనాల్లా వేసుకోవాలి. కొద్ది కొద్దిగా నెయ్యి వేస్తూ రెండు వైపులా చక్కగా కాల్చుకోవాలి. అంతే రుచికరమైన తియ్యతియ్యని బెల్లం వెన్న పొంగనాలు రెడీ. □

# గోంగూర ప్రయోజనం- 2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

గోంగూరని ఏదో ఒక రూపంలో తీసుకుంటే సహజ ఔషధంలా పని చేస్తుంది. గోంగూర మన ఆరోగ్యానికి ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. గోంగూర పచ్చడి కోడి మాంసంతో సమానమని చెప్తారు. వేడి చేసి బలం కల్గించే ఆకుకూరని పిల్లలు, వృద్ధులు అందరూ తీసుకోవచ్చు. గోంగూర సహజ మందు మరియు డైజెస్టివ్ బూష్టర్ అని చెప్పవచ్చు.

**రక్తశుద్ధికి:** గోంగూరలోని ఐరన్, విటమిన్ సి రక్తంలో హీమోగ్లోబిన్ శాతాన్ని పెంచి రక్తహీనతని, అధిక రక్తస్రావాల్ని తగ్గిస్తుంది. ఇది లింఫాటిక్ రక్తప్రసరణకి మంచిది. ఫోలేట్స్, విటిమిన్ బి6 వల్ల హీమోస్థాసిస్ స్థాయిల్ని నిర్వహిస్తుంది. ఐరన్ లోపాన్ని తగ్గిస్తుంది. ఎర్రరక్తకణాల ఉత్పత్తికి, కణాలకి ఆక్సిజన్ సరఫరా చేసి ఎనర్జీ లెవల్స్‌ని పెంచి రక్తాన్ని శుద్ధిచేస్తుంది. స్లీఎన్ వ్యాధుల్ని నివారిస్తుంది. **రక్తపోటు:** కొలెస్ట్రాల్/గుండె గోంగూరలోని పొటాషియం, మెగ్నీషియం వల్ల అధిక రక్తపోటుని తగ్గస్తుంది. హైబిపి ఉన్నవారిలో రక్తప్రసరణని మెరుగుపరచి స్ట్రోక్, పక్షవాతం రాదు. గోంగూర నీళ్లు త్రాగిన చెడుకొలెస్ట్రాల్, ట్రైస్లిజురైడ్స్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డిఎల్) పెరుగుతుంది. గోంగూరలోని లిపో ప్రోటీన్స్ వాసోడైలటర్స్‌గా, రక్తనాళాలు కుచించుకుపోకుండా చేయడం వల్ల కార్డియోవాస్కుషర్ వ్యాధులు, గుండె జబ్బులు రావు. గుండె ఆరోగ్యానికి గోంగూర చేసే మేలు అంతా ఇంతా కాదు.

**కేశ సంరక్షణకు:** జుట్టురాలడం, బట్టతల, తెల్లవెంట్రుకలు రావడం, జుట్టు చివర్లు చిట్లిపోవడం, కళావిహీనమైన జుట్టు, చుండ్రు వంటి సమస్యలకి గోంగూర పేస్ట్ మంచిది. గోంగూరని ఆహారంగా తీసుకుంటే వెంట్రుకలు నల్లగా, ఒత్తుగా, ఆరోగ్యంగా తయారవుతాయి.

**చర్మసౌందర్యానికి:** గోంగూరలోని అమినోఆసిడ్స్, అధిక విటమిన్స్ మినరల్స్ వల్ల చర్మం హైడ్రేట్‌గా, కాంతివంతంగా ఉంటుంది. మొటిమలు, వడగుల్లలు, కురుపులు, బోధకాలు, వాపులు, తెలికపాటి రక్తస్రావాల్ని, దీర్ఘ కాలిక చర్మవ్యాధుల్ని తగ్గిస్తుంది. **డయాబెటిస్:** గోంగూర డయాబెటిస్ రాకుండా చేస్తుంది. ఇది శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి చక్కెర, యూరిక్ ఆసిడ్ స్థాయిల్ని తగ్గిస్తుంది. ఇది ప్రీడయాబెటిక్స్‌కి, డయాబెటిక్ రోగులకి చాలా మంచిది. గోంగూరలోని ఫైబర్ చక్కెర శోషణని నెమ్మదింపచేసి, రక్తంలో చక్కెర స్థాయిల్ని పెరగకుండా నిరోధించడంలో సహాయపడతాయి. **ఎముకల బలం :** గోంగూరలోని కాల్షియం, మెగ్నీషియం వల్ల ఎముకలు దృఢంగా ఉండి కీళ్లనొప్పులు, ఆస్టియోపోరోసిస్ రాకుండా చేస్తాయి. గోంగూరలోని విటమిన్ బి,సి వల్ల విరిగినెముకల్ని తద్వారా నయం చేస్తుంది. చిగుళ్ల సమస్యలు, దంతసమస్యలు, నోటి అల్సర్స్ తగ్గుతాయి. **పురుషులు :** గోంగూరలోని ఆంటిబాక్టీరియల్ ఎఫెక్ట్స్ వల్ల యూరిన్ ఇన్ఫెక్షన్స్ వరిబీజంని తగ్గించి మూత్రవిసర్జనని మెరుగుపరుస్తుంది. పురుషుల్లో వీర్యవృద్ధిని పెంపొందిస్తుంది. సుఖవ్యాధులు రాకుండా వాటి నివారణలో కూడా ఉపయోపడుతుంది.

**స్త్రీలు :** గోంగూర గర్భాశయానికి సరైన రక్త ప్రవాహాన్ని ప్రేరేపించి బహిష్టి సమస్యల్ని, అధిక రక్త స్రావాన్ని, పీరియడ్స్ క్రాంప్స్‌ని తగ్గిస్తుంది. థైరాయిడ్ సమస్యలకి కూడా గోంగూర చాలా మంచిది. గర్భిణీల్లో వచ్చే డయాబెటిస్, రక్తపోటు, జీర్ణకోశ సమస్యలకి, మొలలు, మల బద్ధకానికి గోంగూరలోని విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ వల్ల కంట్రోల్‌లో ఉంచుతాయి. ఆంటీ ఆక్సిడెంట్ల పవర్‌హౌస్ అయిన గోంగూర శిశువు అభివృద్ధికి చాలా మంచిది. పుట్టుకతో వచ్చే న్యూరల్ ట్యూబ్ లోపాలు వంటి అనేక వ్యాధులు రాకుండా డిఎన్ఎలో మార్పు తెస్తుంది. అయితే దీన్ని గర్భధారణలో మితంగా తీసుకుంటే ఒత్తిడి అదుపులో ఉంటుంది. గర్భిణీల్లో రోగనిరోధకశక్తి పెరిగి గర్భ స్రావాలు కావు. గోంగూర తింటే పాలు తగ్గిపోతాయి. శరీరంలో వాపులు, నీరు ఎక్కువ ఉంటే గోంగూరని పథ్యంగా తింటే నీరు తగ్గుతుంది.


**జాగ్రత్తలు :** గోంగూరని ఎక్కువగా తినకుండా మితంగా సంవత్సరం పొడవునా తీసుకోవచ్చు. వారానికి 1-2 సార్లు తినడమే మేలు. దగ్గు ఆయాసం, తుమ్ములు, ఎలర్జీ ఉన్నవారు ఏదో ఒక రూపంలో గోంగూరని తినడం వల్ల సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాధి నిరోధకతని పెంపొదిస్తుంది (53%) కాబట్టి ఆకలి లేని వారికి మంచిది డయాబెటిస్, బి.పి.గుండెజబ్బులున్నవారు, గర్భిణీలు, బాలింతలు, మందులు ఎక్కువగా వాడేవారు మితంగా తీసుకోవాలి. గోంగూర ఎక్కువగా తింటే వేడి చేస్తుంది. ఆహారం సరిగా జీర్ణం కాదు. □

# ఈ దిండుతో గురకకి చెక్ !



మెనోపాజ్ వల్ల చాలామందికి చీమ చిటుక్కుమన్నా మెలకువ వచ్చేస్తుంది. దీనికి తోడు భాగస్వామి గానీ లేదా ఇంట్లో పెద్దవాళ్లుగానీ అదే పనిగా గురక పెడుతుంటే నిద్ర సంగతి దేవుడెరుగు.. ఆ శబ్దం చిర్రెత్తిస్తుంది. అందుకేనేమో ఈ మధ్య గురకని తగ్గించేందుకు మార్కెట్లోకి కొత్త ఉత్పత్తులు చాలానే వస్తున్నాయి. వాటిల్లో ఒకటి హూతీ యాక్టివ్ పిల్లో. ఇది గురక రావడాన్ని ముందే గుర్తించి, నిద్ర లోంచి లేవకుండానే తల పొజిషన్‌ను మార్చి శ్వాస సరిగ్గా అందేలా చేయడం ద్వారా గురకని నియంత్రిస్తుందట. అదెలా అని ఆశ్చర్యపోకండి. ఎందుకంటే ఇది ఏఐపిల్లో. 'దనెక్స్ట్ జనరేషన్ యాంటీ స్నోర్-పిల్లో' అనీ అంటున్నారు. చూడ్డానికి అచ్చం మెమరీ ఫోమ్ దిండులానే ఉంటుంది. ఈ దిండులోని సెన్సర్లు.. బోన్ కండక్షన్ టెక్నాలజీ సాయంతో గురక రాకని గుర్తించి.. బ్లూటూత్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌లోని ఆప్‌ను అలర్ట్ చేస్తాయి. అది కాస్తా గురక తీవ్రతనీ శ్వాస, గుండె వేగాల్నీ లెక్కించి.. ఆ వ్యక్తికి మెలకువ రాకుండానే దిండులో వైబ్రేషన్స్ వచ్చేలా చేసి తలను కదిలించేలా చేస్తుంది. తద్వారా గురకను అరికడుతుందట. మార్కెట్‌లో ఉన్న ఇది గురక బాధితులకి గొప్ప వరమే మరి! □

# ఆదిత్య హృదయం



రామ రావణ యుద్ధం భీకరంగా జరుగుతోంది. రాముడు రావణుడి శిరస్సులు ఖండిస్తుండగా ఓ తల కిందపడగానే ఆ స్థానంలో మరో తల మొలుస్తోంది. అప్పుడిక ఆదిత్య హృదయం జపించి విల్లెక్కుపెట్టి బాణాలు వదిలాడు. రావణుడు పడిపోయాడు. రామరావణ యుద్ధ సన్నివేశమిది. అరుణాచలంలో శేషాద్రి స్వామి అవదూత దీన్ని గురించి ఓ నిగూఢ అర్థం తెలియజేశారు. కామక్రోధాలు రాక్షసుల వంటివి. రాక్షసులు నిశాచరులు. చీకటిలోనే కామ క్రోధాలు విజృంభిస్తాయి. వ్యక్తిలో అలాంటి గుణాలు ఉన్నంత వరకు ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలను లోబరచుకోవడం సాధ్యం కాదు. జ్ఞానజ్యోతి కాంతులను వెదజల్లినప్పుడే అజ్ఞానాంధకారం తొలగిపోతుంది. కామక్రోధాలూ, రాక్షసత్వం నశిస్తాయి. అటుపై ఇంద్రియాలు విషయతపన లేక అణగారిపోతాయి. రావణుడు కామక్రోధాలు మూర్తీభవించిన నిండు విగ్రహం. నిశాచరుల నియంత. అతడిపది తలలూ జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలకు నిదర్శనం. శ్రీ రామచంద్రుడు తలలన్నింటినీ ఛేదించినా రావణుడు జీవించే ఉన్నాడంటే అతడిలో కామక్రోధాలు నశించ లేదని అర్థం. ఆదిత్యహృదయ పఠనంతో ఆ ప్రదేశమంతా వెలుగు నిండిపోయింది. అంధకారం అంతరించిపోయింది. కామక్రోధాలు అదృశ్యమయ్యాయి. అని విపులీకరించారు అవదూత స్వామి. ఆదిత్య హృదయానికి అసాధ్యమైంది ఏదీ లేదన్నారు మహర్షులు. □

ఆధ్యాత్మికం

# యాపిల్ తింటున్నారా..



రోజూ ఒక యాపిల్ తింటే డాక్టర్‌తో పని ఉండదని చిన్నప్పటి నుంచీ వింటున్నాం కదా! ఇంతకీ ఇందులో ఉన్న సుగుణాలేంటో, ఎన్ని విధాలుగా ఉపయోగపడుతుందో చూద్దామా..

కెలోరీలు, పీఈచు, సి-విటమిన్, కాపర్, పొటాషియంలతో యాపిల్ మంచి పోషకాహారం. మలబద్ధక సమస్యను నివారిస్తుంది. ఇది రక్తపోటును క్రమబద్ధం చేస్తుంది. అగ్నాశయానికి (పాంక్రియాజ్) మంచిది. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంట, తాపం, బాధల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మంచి పోషకాలతో దండిగా ఉంటుది కాబట్టి త్వరగా ఆకలి వేయదు. బరువు తగ్గాలనుకునేవారికి యాపిల్ మంచిది. అమెరికాలో 40 వేలమంది మీద జరిపిన పరిశోధనలో యాపిల్స్ తినేవారిలో గుండెజబ్బులు వచ్చే అవకాశం చాలా తక్కువని తేలింది. టైప్ 2 డయాబెటిస్, రక్తంలో చక్కెరలను నియంత్రిస్తుంది. సైనస్ ఉబ్బసం తదితర శ్వాస ఇబ్బందులను నివారిస్తుంది. క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది త్వరగా జీర్ణమవుతుంది కనుక వృద్ధులకు, అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి కూడా మంచిది. మనలో చాలామంది యాపిల్ చెక్కు తీసి తినడానికి ఇష్టపడతాం. నిజానికి అందులో యాంటీ ఆక్సిడెంట్లు విస్తారంగాఉన్నాయి కాబట్టి తీయకుండానే తినాలని చెబుతున్నారు ఆహార నిపుణులు. యాపిల్ ఎలా తిన్నా రుచిగానే ఉంటుంది. □

# వచ్చే ఐపిఎల్ సీజన్‌కు.. పాత జట్లకు ముగ్గురు గుడ్ బై

**• ఫ్రాంచైజీలు మారనున్న ప్లేయర్లు • ఆల్‌రౌండర్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ వేట**


సంజూ శాంసన్


ఇషాన్ కిషన్


వెంకటేష్ అయ్యర్

**న్యూఢిల్లీ:** దేశంలోని అన్ని ఫ్రాంచైజీలు కొత్త సీజన్ కోసం సిద్ధమవుతున్నాయి. ఐపిఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ఇంకో ఎనిమిది నెలల సమయం ఉంది. అయితే గత సీజన్ ముగిసిన వెంటనే ట్రేడ్ విండో ప్రారంభమైంది. ఈ క్రమంలో ఆటగాళ్లను ట్రేడ్ విండోద్వారా భర్తీ చేసుకునేందుకు ఫ్రాంచైజీలు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో ముగ్గురు కీలక ప్లేయర్లు ఫ్రాంచైజీలు మారేందుకు సిద్ధమవుతున్నారు. సంజూశాంసన్‌తో పాటు మరో ఇద్దరు భారత ఆటగాళ్లు వచ్చే సీజన్‌లో ఫ్రాంచైజీ మారడం ఖాయంగా కనిపిస్తోంది. ఐపిఎల్‌లో గత కొన్నాళ్లుగా సంజూ శాంసన్ రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఆ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. అయితే ఈ వికెట్ కీపర్ బ్యాటర్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. అతడిని ట్రేడ్ ద్వారా కొనుగోలు చేయాలని భావిస్తోంది. ఎంఎస్ ధోని వచ్చే సీజన్‌లో ఆడడం అనుమానం అని, అందుకనే అనుభవజ్ఞుడైన, నమ్మకమైన వికెట్ కీపర్‌కోసం చెన్నై వెతుకుతున్నట్లు ఫ్రాంచైజీవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే సంజూపై దృష్టి సారించినట్లు సమాచారం. అలాగే ఐపిఎల్ 2025 సీజన్‌లో ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. 14 మ్యాచ్‌ల్లో 354 పరుగులు చేశాడు. ఇందులో ఓ శతకం కూడా ఉంది. అయితే నివేదికల ప్రకారం వచ్చే సీజన్‌లో అతడు కోల్‌కతా నైట్ రైడర్స్ తరుపున ఆడొచ్చు. నైట్ రైడర్స్ వారి బ్యాటింగ్ లైనప్ బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన వికెట్ కీపర్ కోసం వెతుకుతోంది. ఈ క్రమంలోనే కిషన్‌ను ట్రేడ్ విండో ద్వారా కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇక ఐపిఎల్ 2025 మెగా వేలంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.23.75 కోట్లు వెచ్చించి మరీ వెంకటేష్ అయ్యర్‌ను సొంతం చేసుకుంది. అయితే ఈ సీజన్‌లో వెంకటేష్ అయ్యర్ పెద్దగా రాణించలేదు. 21 సగటుతో 142 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో అతడిని వదులుకునేందుకు కోల్‌కతా సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు బ్యాట్, బంతితో రాణించే భారత ఆల్‌రౌండర్ కోసం వెతుకుతున్నట్లు తెలుస్తోంది.

ఈ క్రమంలో ట్రేడ్ విండో ద్వారా కెకెఆర్, హైదరాబాద్ జట్లు వెంకటేష్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లను మార్చుకోనున్నట్లు సమాచారం. అయితే మరికొద్ది రోజుల్లోనే దీనిపై స్పష్టత రానుందని అంటున్నారు.



## వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో.. వైష్ణవికి కాంస్యం

### పరుగులో అనిమేష్ విఫలం

**న్యూఢిల్లీ:** 2025 ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలలో భారతదేశానికి మిశ్రమ ఫలితాలు చోటు చేసుకున్నాయి. వైష్ణవి అడ్కర్ మహిళల సింగిల్స్ టెన్నిస్‌లో కాంస్య పతకాన్ని సాధించడం ద్వారా చరిత్ర సృష్టించగా, 200 మీటర్ల పురుషుల పరుగులో అనిమేష్ పతకానికి దూరమయ్యాడు. శుక్రవారం జరిగిన మహిళల టెన్నిస్‌లో వైష్టవి పతకాన్ని సాధించడం ద్వారా 46 సంవత్సరాల నిరీక్షణకు ముగింపు పలికింది. స్లోవేకియాకు చెందిన ఎస్జెర్ మెరీతో జరిగిన వీరోచిత పోరాటం తర్వాత పుణేకు చెందిన 21 ఏళ్ల వైష్టవి సెమీఫైనల్లో 6-2, 4-6, 4-6 తేడాతో అధిగమించింది. అడ్కర్ మొదటి సెట్‌ను 6-2తో సాధించింది. కానీ మెరీ తిరిగి పుంజుకుని తరువాతి రెండు సెట్‌లను ఆధిక్యం కనపరచింది. సెమీఫైనల్ ఓటమి ఉన్నప్పటికీ, చివరి నాలుగు స్థానాలకు అడ్కర్ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేసింది. ఆమె నాలుగు రౌండ్లలో ఒక్క సెట్ కూడా కోల్పోకుండా ప్రతి మ్యాచ్‌లోనూ ఆధిపత్యాన్ని సంపాదించింది. 64వ రౌండ్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన జోలియన్ మరియా జెనియా గీల్స్‌పై 2-0 తేడాతో ఆమె ప్రచారం ప్రారంభమైంది. తదుపరి రెండు రౌండ్లలో ఫిన్లాండ్‌కు చెందిన వెన్లా ఎలిసా అహ్తి, కెన్యాకు చెందిన ఏంజెల్లా ఒకుటోయిపై వరుస సెట్ల విజయాలతో ముందుకు సాగింది. క్వార్టర్ ఫైనల్లో, అడ్కర్ జర్మనీకి చెందిన సినా హెర్మాన్‌ను ఎదుర్కొని మరోసారి 2-0 తేడాతో క్లీన్ విజయంతో ఫైనల్ ఫోర్‌లో స్థానం సంపాదించి, కనీసం కాంస్య పతకాన్ని గెలుచుకుంది. కాగా 200 మీటర్ల పురుషుల ఫైనల్‌లో 20.85 సెకన్ల స్వల్ప సమయం నమోదుతో 4వ స్థానంలో నిలిచి భారత ఏస్ స్ప్రింటర్, జాతీయ రికార్డు హోల్డర్ అనిమేష్ కుజుర్ పతకాన్ని కోల్పోయాడు.

## మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో .. భారత జట్టుకు టైటిల్

**న్యూఢిల్లీ:** యూనివర్సిటీ గేమ్స్‌లో టీమ్ ఈవెంట్లలో భారత మిక్స్‌డ్ కాంపౌండ్ జట్టు టైటిల్‌ను నిలబెట్టుకుంది. టీమ్ ఈవెంట్లలో భారత కాంపౌండ్ ఆర్చర్లు ఒక స్వర్ణం, ఒక రజతం, మరియు ఒక కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. శుక్రవారం జర్మనీలోని ఎస్సెన్‌లో జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కుశాల్ దలాల్ మరియు పర్నీత్ కౌర్‌ద్వయం బంగారు పతకాన్ని సాధించడంతో భారత కాంపౌండ్ మిక్స్‌డ్ జట్టు తమ ప్రపంచ యూనివర్సిటీ గేమ్స్ టైటిల్‌ను నిలుపుకుంది. ఈ జంట 160 పాయింట్లకు గాను 157 పాయింట్లు సాధించి, ఫైనల్‌లో దక్షిణ కొరియా జంటను మూడు పాయింట్ల తేడాతో ఓడించింది. 2025 ఎఫ్ఐఎస్‌యు వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో భారతదేశానికి తొలి బంగారు పతకాన్నిసాధించింది. అంతకుముందు, భారత పురుషులు మరియు మహిళల కాంపౌండ్‌జట్లుకూడా రజత మరియు కాంస్యపతకాలను గెలుచుకున్నాయి. ఈ క్రీడలలో భారత్ ఖాతాలో మొత్తం పతకాల సంఖ్యను 5కు చేరాయి. 1 స్వర్ణం, 1 రజతం, 3 కాంస్య పతకాలు. పర్నీత్, అవనీత్ కౌర్ మరియు మధుర ధమన్‌గోంకర్‌లతో కూడిన మహిళల జట్టు గ్రేట్ బ్రిటన్‌ను ఓడించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మరోపక్క కుశాల్, సాహిల్ జాదవ్ మరియు హృతిక్ శర్మలతో కూడిన భారత్ పురుషుల జట్టు ఫైనల్‌లో తుర్కియే చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయింది. కుశాల్, పర్నీత్ రేపు వ్యక్తి గత కాంపౌండ్ ఈవెంట్ సెమీఫైనల్స్‌లో కూడా పోటీ పడనున్నారు. దేవ్ మీనా జాతీయ రికార్డు మరోవైపు, ఈ వర్ధమాన భారత పోల్ వాల్టర్ పురుషులపోల్‌వాల్ట్ ఈవెంట్‌అర్హతరౌండ్‌లో తనసొంతజాతీయ రికార్డును మెరుగుపరుచుకున్నాడు.

## మరోసారి ఇంగ్లాండ్‌కు టీమిండియా

**వన్డే, టి20 సిరీస్ షెడ్యూల్ విడుదల**

**వన్డేలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఎంట్రీ**

**న్యూఢిల్లీ:** భారత జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉంది. అక్కడ ఆతిథ్య జట్టుతో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడుతోంది. టెస్ట్ సిరీస్ ఉత్కంఠ మధ్య మరో వన్డే, టి20 షెడ్యూల్‌ను భారత్ క్రికెట్ నియంత్రణ బోర్డు విడుదల చేసింది. దీంతో టీమిండియా మరోసారి ఇంగ్లాండ్‌లో పర్యటించనున్నది. ఇంగ్లాండ్ వేల్స్ క్రికెట్ బోర్డు, భారత క్రికెట్ బోర్డు వచ్చే ఏడాది భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు టి20, మూడు ఓడీఐ మ్యాచ్‌లు ఆడనున్నట్లు ప్రకటించాయి. ఓడీఐ, టి20 సిరీస్‌లు రెండూ జూలై 2026లో ఇంగ్లాండ్‌లో జరగనున్నాయి. ఇక ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ జూలై 1న ప్రారంభంకానుండగా, వన్డే సిరీస్ అదే నెల 14న ప్రారంభమవుతుంది.ఆతర్వాత మిగిలినటి20 మ్యాచ్‌లు జూలై 4, 7, 9, 11 తేదీల్లో జరుగుతాయి. దీని తర్వాత మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ ఉంటుంది. వన్డే సిరీస్‌లో మొదటి మ్యాచ్ జూలై 14న జరుగుతుంది. మిగిలిన రెండు వన్డే మ్యాచ్‌లు జూలై 16, 19 తేదీల్లో జరుగుతాయి. వచ్చే ఏడాది ఇంగ్లాడ్‌తో జరిగే వన్డే సిరీస్లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడనున్నారు. టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయిన తర్వాత ఈ ఇద్దరు దిగ్గజాలు తొలిసారి ఇంగ్లాండ్‌లో ఆడనున్నారు. కాగా వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న టి20 ప్రపంచ కప్ తర్వాత భారత్‌ఆడే తొలిటీ20 సిరీస్ ఇదే కావచ్చు. భారతజట్టు ఇంగ్లాండ్‌పర్యటన షెడ్యూల్ టి20 సిరీస్‌కు సంబంధించి జూలై 1న మొదటి టి20, డర్హామ్‌లో రాత్రి 11.00గంటలకు, 4న 2వ టి20, మాంచెస్టర్‌లో రాత్రి 7 గంటలకు, 7న 3వ టి20 నాటింగ్హామ్‌లో రాత్రి 11.00 గంటలకు, 9న నాలుగవ టి20 బ్రిస్టల్‌లో రాత్రి 11.00 గంటలకు, 11న 5వ టి20 సౌతాంప్టన్‌లో రాత్రి 11.00గంటలకు, వన్డే సిరీస్‌కు సంబంధించి 14 జూలైన మొదటివన్డే బర్మింగ్హామ్‌లో సాయంత్రం 5.30 గంటలకు 16న 2 వన్డే కార్డిఫ్‌లో సాయంత్రం 5.30గంటలకు, 19న 3వవన్డే లండన్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు జరగనున్నాయి.

## వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో.. సెమీఫైనల్స్‌కు అనహాత్



**న్యూఢిల్లీ:** అనాహత్ సెమీస్‌కు అర్హత సాధించింది. 2025 ప్రపంచ స్క్వాష్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశపు అగ్రశ్రేణి మహిళా స్క్వాష్ క్రీడాకారిణి అనహత్ సింగ్ ఒక పురోగతిని నమోదు చేసింది. అనూహ్యంగా సెమీఫైనల్స్‌కు చేరుకుంది. ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో తన తొలి పతకాన్ని నిర్ధారించు కుంది. ఢిల్లీకి చెందిన 17 ఏళ్ల, రెండవ సీడ్, క్వార్టర్ ఫైనల్స్‌లో ఈజిప్ట్‌కు చెందిన మలికా ఎల్కరాక్సీని 11-6, 13-11, 11-5 తేడాతో ఓడించి, ఆమె చివరి ఎనిమిది నిష్క్రమణల పరంపరను బద్దలు కొట్టింది. కైరోలోని బ్లాక్ బాల్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన పక్షపాత స్వదేశీ ప్రేక్షకుల ముందు జరిగిన ప్రారంభ గేమ్‌లో 5-6తో వెనుకబడిన తర్వాత, ఆమె వరుసగా ఆరు పాయింట్లు సాధించి మొదటి గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండవ గేమ్‌లో ఎల్కరాక్సీ రెండు గేమ్ బంతులను పట్టుకుంది, కానీ అనాహత్ ధైర్యంగా 13-11 తేడాతో విజయం సాధించింది. ప్రత్యర్థి బలహీనతను అవకాశంగా తీసుకున్న అనాహత్ త్వరగా మూడవ గేమ్‌ను ముగించింది.2022, 2023, 2024లో వరుసగా మూడు సంవత్సరాలు జూనియర్ వరల్డ్స్‌లో అనాహత్ క్వార్టర్ ఫైనల్ దశలోనే నిలిపివేయబడింది. ఆమె ఇప్పుడు సెమీఫైనల్‌లో ఈజిప్ట్‌కు చెందిన నదియన్ ఎల్హమ్మమితో తలపడనుంది.

## రూ.9లక్షల కోట్లు ఇన్వెస్టర్ల సంపద ఆవిరి


**ముంబై, జూలై 25:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్‌తోపాటు ఇతర ఫైనాన్షియల్ స్టాక్స్, అధిక వెయిటేజీ కలిగిన స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలను పడేశాయి. ముఖ్యంగా ఎఫ్ఐఐల అమ్మకాలు, భారత్ అమెరికా మధ్య ట్రేడ్ డీల్‌పై అనిశ్చితి, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు ఇందుకు కారణంగా నిలిచాయి. దీంతో సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. ఈ రెండు సెషన్లలోనే సెన్సెక్స్ 1264 పాయింట్లు కోల్పోయింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.9 లక్షల కోట్లు క్షీణించి రూ.451 లక్షల కోట్లకు చేరింది. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు కూడా అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 82,065.76 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,184.17) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,397.69 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 721.08 పాయింట్ల నష్టంతో 81,463.09 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 225.10 పాయింట్ల నష్టంతో 24,837 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.52గా ఉంది. సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 69.33 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు 3,348 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



భారత్ అమెరికా మధ్య ట్రేడ్ డీల్ విషయంలో గత కొన్ని రోజులుగా అదిగో, ఇదిగో అనే మాటలు వినిపిస్తున్నాయే తప్ప చర్చలు మాత్రం ఓ కొలిక్కి రాలేదు. అగ్రికల్చరల్, డెయిరీ ప్రొడక్టుల విషయంలో ఇరు దేశాల మధ్య సయోధ్య కుదరడం లేదని తెలుస్తోంది. అదే సమయంలో జపాన్, ఫిలిప్పీన్స్, ఇండోనేసియా, వియత్నాం వంటి దేశాలతో అమెరికా ఇప్పటికే ట్రేడ్ డీల్స్ కుదుర్చు కుంది. మరోవైపు ఆగస్టు 1 డెడ్‌లైన్ సమీపిస్తుండడంతో మదుపర్ల అప్రమత్తత కారణమని తెలుస్తోంది.విదేశీ సంస్థాగత మదుపర్లు కొన్నాళ్లుగా మన ఈక్విటీల్లో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. జులైలో ఇప్పటి వరకు రూ.28,528 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా.. గడిచిన నాలుగు రోజుల్లో రూ.11,527 కోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లు డేటా చెబుతోంది.


## కృత్రిమ మేధతో అంతా గందరగోళం: మైక్రోసాఫ్ట్ సిఇఒ

**వాషింగ్టన్, జూలై 25:** మైక్రోసాఫ్ట్‌లో భారీగా ఉద్యోగాల కోత విధించడం సీఈవో సత్యనాదెళ్లను కూడా భావోద్వేగపరంగా కదిలించింది. అదే సమయంలో కృత్రిమ మేధతో చోటుచేసుకొంటున్న మార్పులు గందరగోళంగా ఉన్నాయన్నారు. ఆయన ఉద్యోగులకు వీడ్కోలు పలుకుతూ ఎమోషనల్ మెసేజ్‌ను పంపారు. దీనిలో ఆయన చాలా సూటిగా రాసుకొచ్చారు. అన్ని విషయాల కంటే ముందు భావోద్వేగ పరంగా నాపై ప్రభావం చూపుతున్న అంశాలపై మాట్లాడాలనుకుంటున్నాను. అదే సమయంలో మీరు దేనిగురించి ఆలోచిస్తున్నారో కూడా నేను అర్థం చేసుకోగలను. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం చాలా కష్టం. అవి మా తోటి ఉద్యోగులపైనా ప్రభావం చూపుతాయి. మన టీమ్‌మేట్స్, కొలీగ్స్, ఫ్రెండ్స్‌తో మనకు ఎన్నో అనుభవాలు, అనుబంధాలు, జ్ఞాపకాలు ఉంటాయి. ఇది ఓ పరిశ్రమ విజయరహస్యమే అయినా దానికి ఎలాంటి విలువ లేదు. అభివృద్ధి గీత గీసినట్లు సూటిగా ఉండదు.. ఎగుడుదిగుడులు ఉంటాయి. కొన్నిసార్లు వైవిధ్యంగా కూడా ఉంటుంది. కానీ, ఎప్పుడూ పురోగతిని కోరుకుంటుంది. కానీ, మార్పునకు ఇది మనకిచ్చే సరికొత్త అవకాశం. భవిష్యత్తులో మరింత ముందుకుసాగండి అని సత్య నాదెళ్ల పేర్కొన్నారు. అంతేకాదు.. మైక్రోసాఫ్ట్ భవిష్యత్తు దార్శనికతలో ఏఐ కీలక భాగమనే సందేశాన్ని ఆయన ఈ మెమోలో పేర్కొన్నారు.భూమిపై ప్రతి వ్యక్తి, సంస్థ మరింత అభివృద్ధి సాధించాలంటే కచ్చితంగా కృత్రిమేధ సంస్కృతికి అలవాటుపడాల్సిందేనన్నారు. కొత్తతరం ఏఐ అంటే కేవలం కొన్నింటికి అవసరమైన టూల్స్‌ను అభివృద్ధి చేయడం కాదన్నారు. ప్రతి ఒక్కరూ సొంతంగా తమకు అవసరమైన టూల్స్‌ను తయారు చేసుకునేందుకు కావాల్సిన టూల్స్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఈ క్రమంలో భవిష్యత్తులో మరిన్ని లేఆఫ్‌లు ఉండవన్న హామీ మాత్రం ఆయన నుంచి రాలేదు. మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల సంఖ్యలో మాత్రం పెద్దగా మార్పులు లేవని ఆ నోట్‌లో పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులు, వ్యాపారాల్లో కృత్రిమమేధతో మార్పులు చోటుచేసుకొంటున్న వేళ.. ఉద్యోగులు గ్రోత్ మైండ్‌సెట్‌తో ఉండాలని కోరారు. ప్రస్తుతం తాను గందరగోళానికి గురవుతున్నాను. కానీ, మార్పులు చోటుచేసు కొనే సమయంలో ఎప్పుడైనా ఇలాంటి పరిస్థితి తప్పదు. మా టీమ్‌లను పునర్ వ్యవస్థీకరిస్తున్నాం.. దీంతో పరిధులు పెరుగుతున్నాయి. సరికొత్త అవకాశాలు అన్ని చోట్లా ఉన్నాయన్నారు.



## ఎంజి నుంచి సైబర్‌స్టర్ 'ఇవి'

**ముంబై, జూలై 25:** జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా దేశీయ మార్కెట్‌లోకి ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారును లాంచ్ చేసింది. ఈ కారు ధరను రూ.74.99 లక్షలుగా (ఎక్స్ షోరూమ్) నిర్ణయించింది. ప్రీరిజర్వేషన్ చేసుకున్న వారికి రూ.72.49 లక్షలకే అందిస్తామని ప్రకటించింది. ఈ ఏడాది జరిగిన భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో దీన్ని తొలుత ప్రదర్శించారు. తాజాగా దేశీయంగా లాంచ్ చేశారు. ఎంజీ సెలక్ట్ ప్రీమియం డీలర్‌షిప్ కేంద్రాల్లో లభిస్తుంది. ఎంజీ సైబర్‌స్టర్ ఫోల్డింగ్ సాఫ్ట్ టాప్ రూఫ్, సిజర్ డోర్స్‌తో 2 సీటింగ్‌తో వస్తోంది. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, ఎల్ఈడీ డీఆర్ఎల్స్, యారో షేప్డ్ ఎల్ఈడీ టెయిల్ లైట్స్ ఉన్నాయి. 20 అంగుళాల లైట్ వెయిట్ అల్లాయ్ వీల్స్‌తో వస్తోంది. కారు లోపలి భాగంలో 10.25 అంగుళాల సెంట్రల్ టచ్‌స్క్రీన్, 7 అంగుళాల డిజిటల్ ప్యానెల్ ఇచ్చారు. వీటి సాయంతో రియల్‌టైమ్ వెహికల్ డేటా, ఎంటర్‌టైన్‌మెంట్, సెట్టింగ్స్‌ను యాక్సెస్ చేయొచ్చు. పీఎం 2.5 ఫిల్టరేషన్‌తో డ్యూయల్ జోన్ క్లైమేట్ కంట్రోల్‌తో వస్తోంది.



# వాణిజ్యం

## బ్రిటన్ ఒప్పందంతో భారత్‌కు ప్రయోజనం: ఆర్‌బిఐ గవర్నర్

**న్యూఢిల్లీ, జూలై 25:** భారత్, బ్రిటన్ మధ్య చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడాన్ని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్వాగతించారు. ఇరుదేశాలు చేసుకున్న ఈ ఒప్పందం భారత ఆర్థికవ్యవస్థలోని బహుళ రంగాల అభివృద్ధికి సహాయపడుతుందని తెలిపారు. ఇతర దేశాలతోనూ భారత్ ఇటువంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. అనేక దేశాలు కలిసి పనిచేసే విధానం తగ్గిపోతున్న నేపథ్యంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలకు మేలు చేకూరుస్తాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. బీఎఫ్ఎస్ఐ సమ్మిట్‌లో మాట్లాడుతూ ఆర్బీఐ గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటువంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి భారత్ అమెరికాతో సహా పలు దేశాలతో వాణిజ్య చర్చలు కొనసాగిస్తోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. అగ్రరాజ్య ఆర్థికాభివృద్ధికి అమెరికా ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ తీసుకుంటున్న చర్యలను సంజయ్ సమర్థించారు. ఆయన తన పనిని సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారన్నారు. కాగా పావెల్ నిర్ణయాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శిస్తున్న సమయంలో ఫెడరల్ రిజర్వ్ స్వయంప్రతిపత్తితో పనిచేస్తుండడాన్ని సంజయ్ మల్హోత్రా ప్రశంసించడం గమనార్హం. విదేశీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ బ్రిటన్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. ఇరుదేశాల మధ్య బంధాలను మరింత పెంచుకునే చర్యల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌ల సమక్షంలో ఇరుదేశాల వాణిజ్య మంత్రులు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశారు.



దీంతో ఇరుదేశాల ఉత్పత్తులకు పరస్పర మార్కెట్ ప్రవేశం సులభతరం కానుంది. బ్రిటన్‌కు భారత ఎగుమతుల్లో 99శాతం ఉత్పత్తులపై సుంకాల భారం తగ్గనుంది. దుస్తులు సహా చాలా వ్యవసాయ రంగ, ఆహారశుద్ధి ఉత్పత్తులకు టారిఫ్‌ను లండన్ పూర్తిగా మినహాయించనుంది. బ్రిటన్(యూకే) నుంచి దిగుమతయ్యే స్కాచ్ విస్కీ, జిన్‌లపై సుంకాన్ని మన దేశం సగానికి తగ్గించనుంది. తాజా ఎఫ్‌టీఏతో ఇరుదేశాల్లోనూ పలు రంగాల్లో వేలకొద్దీ ఉద్యోగావకాశాలు రానున్నాయి.

## ఎగుమతుల్లో 'మారుతి కాంపాక్ట్ ఎస్‌యువి' రికార్డు

**ముంబై, జూలై 25:** భారత ఆటోమొబైల్ తయారీలో మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ తన కాంపాక్ట్ ఎస్‌యువి ఫ్రాంక్స్ ఎగుమతుల్లో రికార్డు నెలకొల్పింది. భారతదేశం నుంచి వేగంగా ఒక లక్షల ఎగుమతులను అధిగమించిన ఎస్‌యువిగా నిలిచిందని కంపెనీ ప్రకటించింది. 2023 జూన్‌లో ప్రపంచ ఎగుమతి కార్యకలాపాలు ప్రారంభమైన కేవలం 25 నెలల్లోనే ఈ మైలురాయిని చేరుకుందని చెప్పింది. గుజరాత్‌లోని మారుతి సుజుకి ప్లాంట్‌లో ప్రత్యేకంగా తయారు చేసిన ఫ్రాంక్స్ లాటిన్ అమెరికా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికాతో సహా విదేశీ మార్కెట్లలో బలమైన పనితీరును కనబరుస్తోందని కంపెనీ తెలిపింది. జపాన్‌లో దీనికి పెరుగుతున్న ప్రజాదరణ ఎగుమతి వృద్ధికి దోహదం చేసిందని చెప్పింది. మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ హిసాషి టేకుచి మాట్లాడుతూ, ప్రపంచ మార్కెట్ల ప్రభావం స్థాయి వాహనాలను తయారు చేయగల సామర్థ్యం కంపెనీకి ఉంది. మేక్ ఇక్ ఇండియా చొరవకు కంపెనీ సాధించిన విజయమే నిదర్శనం. ప్యాసింజర్ వాహన ఎగుమతులు, అంతర్జాతీయ మార్కెట్లపై దృష్టిసారిస్తున్నాం అని అన్నారు. 2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే మారుతి సుజుకి 96వేల వాహనాలను ఎగుమతి చేయడం విశేషం. భారతదేశ ప్యాసింజర్ వాహన ఎగుమతుల్లో రికార్డు స్థాయిలో 47శాతం వాటాను ఆక్రమించింది. వరుసగా నాలుగో యేడాది భారతదేశపు టాప్ ప్యాసింజర్ వాహన ఎగుమతిదారుగా కంపెనీ తన స్థానాన్ని నిలుపుకుంది.



## ఇంటెల్‌లో 25వేల మందికి ఉద్వాసన

**ముంబై, జూలై 25:** ప్రపంచ చిప్ దిగ్గజం ఇంటెల్ తీవ్ర ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటూ భారీ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 25,000 మందికి పైగా ఉద్యోగులను తొలగించనున్నట్టు నివేదించింది. ప్రస్తుతం 1,08,900 మంది ఉద్యోగులున్న ఈ సంస్థ.. 2025 చివరి నాటికి ఉద్యోగుల సంఖ్యను 75,000కి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఉద్యోగ కోతలు లేఆఫ్‌లు, సహజ విరమణలు, ఇతర చర్యల ద్వారా జరుగుతాయని కంపెనీ నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇంటెల్ ఇప్పటికే సుమారు 15 శాతం (సుమారు 15,000) ఉద్యోగాలను తగ్గించింది. గత ఏడాది కూడా 15,000 కంటే ఎక్కువ ఉద్యోగాలను తొలగించడం గమనార్హం. 2024 రెండవ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను విడుదల చేస్తూ ఇంటెల్ ఈ లేఆఫ్‌లను ధ్రువీకరించింది. కంపెనీ 2.9 బిలియన్ డాలర్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. ఇందులో తాజా తగ్గింపులకు సంబం ధించిన పునర్వ్యవస్థీకరణ ఖర్చులు కూడా ఉన్నాయి.



అయినప్పటికీ, త్రైమాసికఆదాయం 12.9బిలియన్ డాలర్ల వద్ద స్థిరంగా ఉంది. ఇది మార్కెట్ అంచనాలను అధిగమించడం విశేషం. ప్రస్తుత త్రైమాసికంలో ఆదాయం 12.6 బిలియన్ డాలర్ల నుంచి 13.6 బిలియన్ డాలర్ల మధ్య ఉంటుందని, సగటు న 13.1 బిలియన్ డాలర్లుగా ఉంటుందని ఇంటెల్ అంచనా వేస్తోంది. ఇది విశ్లేషకుల అంచనాల కంటే ఎక్కువ కావడం కొంత సానుకూల అంశం. ఒకప్పుడు ప్రపంచ చిప్ మార్కెట్ లో అగ్రగామిగా ఉన్న ఇంటెల్ ఇటీవలి సంవత్సరాలలో తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. 1990లలో పర్సనల్ కంప్యూటర్ బూమ్ సమయంలో మైక్రో ప్రాసెసర్ వ్యాపారంలో ఆధిపత్యం వహించినప్పటికీ ఆ తర్వాత వెనుకబడిపోయింది. ప్రస్తుతం ఎన్‌విడియా వంటి కంపెనీలు నాయకత్వం వహిస్తున్న, వేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమమేధస్సు (ఏఐ)చిప్ విభాగంలో ఇంటెల్ వెనుకబడి ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.